www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 25-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 26 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం; తిథి: ద్వాదశి ఉ.11.45 తదుపరి త్రయోదశి; నక్షత్రం: పూర్వాభాద్ర ఉ.8.53 తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: సా.5.30-6.56; దుర్ముహూర్తం: ఉ.8.27-9.17, మ.12.38-1.28; అమృతఘడియలు: రా.2.08-3.34; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 5.56; సూర్యాస్తమయం: 6.30 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆంధ్రజ్యోతి

స్పోర్ట్స్

వరంగల్ ● శుక్రవారం 25 ఏప్రిల్ 2025

నేటి మ్యాచ్

చెన్నై X హైదరాబాద్

వేదిక చెన్నై

రా.7.30 నుంచి

అలా చేస్తే.. అర్జున్ మరో గేల్ అవుతాడు



న్యూఢిల్లీ: సచిన్ టెండూల్కర్ తన యుడు అర్జున్‌ను యువరాజ్ సింగ్‌కు అప్పగిస్తే మరో క్రిస్ గేల్‌లా తయారవుతాడని మాజీ క్రికెటర్ యోగ్‌రాజ్ సింగ్ అన్నాడు. 25 ఏళ్ల అర్జున్ ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ జట్టులో ఉన్నాడు. అలాగే యువీ తండ్రి అయిన యోగ్‌రాజ్ దగ్గర గతంలో శిక్షణ తీసుకున్నాడు కూడా. అప్పట్లో తాను అర్జున్‌కు బ్యాటింగ్‌పైనే ఎక్కువగా దృష్టి పెట్టమని కోరినట్టు చెప్పాడు. అయితే ప్రస్తుతం తన కుమారుడి కెరీర్ గురించి యువరాజ్‌తో సచిన్ మాట్లాడితే బావుంటుందని చెప్పాడు.

అనిమేష్, చిత్రవేల్ జాతీయ రికార్డులు

ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్



అనిమేష్


కొచ్చి: ఒడిశా స్ప్రింటర్ అనిమేష్ కుజుర్ పురుషుల 200 మీ. రేస్‌లో, ట్రిపుల్ జంప్ స్టార్ ప్రవీణ్ చిత్రవేల్ కొత్త జాతీయ రికార్డులతో భళా అనిపించారు. గురువారం ముగిసిన ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 200 మీ. పరుగులో 21 ఏళ్ల కుజుర్ 20.40 సెకన్ల రికార్డ్ టైమింగ్‌తో గమ్యాన్ని చేరి స్వర్ణం సాధించాడు. ఇక ట్రిపుల్ జంప్‌లో చిత్రవేల్ తన పేరిటే ఉన్న 17.37 మీటర్ల జాతీయ రికార్డును సమం చేసి పసిడి పతకం కొల్లగొట్టాడు. ఈ క్రమంలో 17.22 మీటర్ల ప్రపంచ చాంపియన్‌షిప్స్ నిర్దేశిత దూరాన్నీ అతడు అధిగమించాడు.



ప్రవీణ్

గెలిచి.. నిలిచేదెవరో?





నేడు చెన్నైతో రైజర్స్ ఢీ

చెన్నై: చెరి ఆరేసి ఓటములతో ప్లే ఆఫ్స్ అవకాశాలను సంక్లిష్టం చేసుకొన్న చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఇక ప్రతి మ్యాచ్ చావోరేవో కానుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగే కీలక మ్యాచ్‌లో ఇరుజట్లూ అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ మ్యాచ్‌లో ఓడిన జట్టుకు నాకౌట్ అవకాశాలు దాదాపుగా గల్లంతయినట్టే. మామూలుగా సొంత మైదానం చెపాక్‌లో చెలరేగిపోయే చెన్నై జట్టు.. ఈ సీజన్‌లో మాత్రం తడబడుతోంది. సీఎస్‌కే బ్యాటర్లు ఆశించినట్టు ఆడలేకపోతున్నారు. మరోవైపు సన్‌రైజర్స్ పరిస్థితి కూడా ఇలాగే ఉంది. టాపార్డర్‌లో అభిషేక్, హెడ్ ఆ జట్టుకు బలం.. బలహీనతగా మారారు. వారి ఆటపైనే జట్టు విజయావకాశాలు ఎక్కువగా ఆధారపడి ఉండడం కవిన్స్ సేనకు మైనస్‌గా మారింది. ఈ నేపథ్యంలో మిడిలార్డర్ బాధ్యత తీసుకోవాలి.

చంపేస్తాం!

గంభీర్‌కు బెదిరింపు మెయిల్స్



న్యూఢిల్లీ: భారత జట్టు కోచ్ గౌతమ్ గంభీర్‌కు బెదిరింపు లేఖలు వచ్చాయి. 'ఐ కిల్ యూ' అంటూ గంభీర్ ఈ-మెయిల్‌కు ఐసిస్, కశ్మీర్ పేరిట రెండు బెదిరింపు లేఖలు పంపారు. ఉగ్రవాదులు పహల్గాంలో పర్యాటకులపై దాడి చేసిన రోజే గంభీర్‌కు బెదిరింపు రావడం కలకలం రేపింది. దాంతో స్థానిక రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో గంభీర్ ఫిర్యాదు చేశాడు. వెంటనే పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అయితే అధికారికంగా కేసు నమోదు కాకున్నా..ఈ-మెయిల్ మూలాన్ని, పంపిన వారిని గుర్తించే పనిలో సైబర్ క్రైమ్ పోలీసులు నిమగ్నమయ్యారు. కాగా..బీజేపీ మాజీ ఎంపీ అయిన గంభీర్‌కు 2022లోనూ ఇలాంటి బెదిరింపే వచ్చింది. దాంతో అతడి కుటుంబానికి కట్టుదిట్టమైన భద్రత కల్పించారు.

భారత బాక్సర్ల జోరు

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా అండర్-15 చాంపియన్‌షిప్స్‌లో భారత బాక్సర్ల హవా కొనసాగుతోంది. ముగ్గురు బాలురు, ఇద్దరు బాలికలు సెమీఫైనల్లోకి అడుగుపెట్టారు. 55 కిలోల్లో నెల్సన్, 61 కిలోల్లో అభిజిత్, 64 కిలోల్లో లక్షయ్ ఫొగట్ సెమీస్‌కు దూసుకుపోయారు. బాలికల విభాగంలో..ప్రిన్సి (52కి.), సమృద్ధి సతీష్ (55) చివరి నలుగురిలో ప్రవేశించారు. అండర్-15 విభాగంలో ఇప్పటికే ఆరుగురు భారత బాక్సర్లు సెమీఫైనల్లో అడుగు పెట్టిన సంగతి తెలిసిందే.

ఉగ్రదాడులపై స్పందించరేం?

పాక్ ప్రధానిపై కనేరియా విమర్శ



కరాచీ: పాకిస్థాన్ మాజీ స్పిన్నర్ డానిష్ కనేరియా తమ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌పై విరుచుకుపడ్డాడు. కశ్మీర్‌లో టూరిస్టులపై జరిగిన ఉగ్రదాడులపై కనీస స్పందన కరువైందని దుయ్యబట్టాడు. 'పహల్గాం ఉగ్రదాడిలో పాక్ హస్తం లేకుంటే.. ఇప్పటి దాకా ప్రధాని షెహబాజ్ ఎందుకు స్పందించనట్టు? ఎందుకు మీ సైన్యం ఒక్కసారిగా అప్రమత్తమైంది? ఎందుకంటే టెర్రరిస్టులకు ఆశ్రయం ఇచ్చి పోషించేది మీరే కాబట్టి. సిగ్గుండాలి' అంటూ ఎక్స్‌లో కనేరియా తీవ్రస్థాయిలో స్పందించాడు. మరోవైపు భారత ప్రధాని నరేంద్ర మోదీని ప్రశంసించాడు. దాడులు చేసిన ఉగ్రవాదులను భారత్ ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోదన్నాడు.

పాక్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడబోం!

బీసీసీఐ ఉపాధ్యక్షుడు శుక్లా

న్యూఢిల్లీ: ఉగ్ర దేశం పాకిస్థాన్‌తో ఎట్టిపరిస్థితుల్లోనూ ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడేది లేదని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా మరోసారి ఉద్ఘాటించాడు. పహల్గాంలో పర్యాటకుల ఊచకోత నేపథ్యంలో శుక్లా తీవ్రంగా స్పందించాడు. ప్రభుత్వ నిర్ణయాలకు పూర్తిగా కట్టుబడి ఉంటామన్నాడు. 2012-13 తర్వాత పాక్‌తో భారత్ ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడడంలేదు. ఐసీసీ టోర్నమెంట్లలో మాత్రమే ఇరుజట్లూ తలపడుతున్నాయి.

సొంతగడ్డపై మురిసె..

- చిన్నస్వామిలో ఆర్‌సీబీ బోణీ
- హాజెల్‌వుడ్‌కు నాలుగు వికెట్లు
- ఆఖర్లో తడబడిన రాజస్థాన్
- ప్లే ఆఫ్స్ ఆశలు దాదాపు గల్లంతు

బెంగళూరు: ఇతర వేదికల్లో అదిరే విజయాలతో ఆకట్టుకుంటున్నా.. తాజా సీజన్‌లో సొంత వేదికపై మాత్రం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు గెలిచిందే లేదు. ఇక్కడ హ్యాట్రిక్ ఓటములతో చిన్నబోయిన ఆర్‌సీబీ ఎట్టకేలకు రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 11 పరుగుల తేడాతో నెగ్గి అభిమానులను మురిపించింది. అటు ఆర్‌ఆర్‌కిది వరుసగా ఐదో ఓటమి. కేవలం నాలుగు పాయింట్లతో ఉన్న ఈ జట్టు ప్లేఆఫ్స్ ఆశలు దాదాపు గల్లంతైనట్టే. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 5 వికెట్లకు 205 పరుగులు చేసింది. విరాట్ (70), దేవ్‌దత్ (50) ధాటిగా ఆడారు. సందీప్‌నకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో రాజస్థాన్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 194 పరుగులు చేసి ఓడింది. జైస్వాల్ (49), జురెల్ (47) రాణించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హాజెల్‌వుడ్‌కు నాలుగు, క్రునాల్‌కు రెండు వికెట్లు దక్కాయి.



హాజెల్‌వుడ్ (4/33)

ధాటిగా ఆరంభించినా..: 206 పరుగుల ఛేదన.. అయితేనేం ఓపెనర్ జైస్వాల్ ధాటికి రాజస్థాన్ తొలి 9 ఓవర్లలోనే 110 పరుగులతో నిలిచింది. అప్పటికి రెండు వికెట్లు కోల్పోయినా 12 పరుగుల రన్‌రేట్‌తో దూసుకెళ్లింది. కానీ స్పిన్నర్ క్రునాల్ పాండ్యా మ్యాజిక్ బంతులతో కట్టడి చేయడంతో 10-15 ఓవర్లలో జట్టు చేసింది 38 పరుగులే.. పైగా మరో రెండు వికెట్లు కూడా కోల్పోయింది. ఈ తడబాటు జట్టు భారీ ఛేదనపై ప్రభావం చూపింది. చివర్లో జురెల్ పోరాడినా నిరాశ తప్పలేదు. ఇన్నింగ్స్ తొలి బంతినే సిక్సర్‌గా మలిచిన జైస్వాల్ ఉన్నంత సేపు ఎదురుదాడికి దిగాడు. రెండో ఓవర్‌లో 4,4,6తో 18.. నాలుగో ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో 12 రన్స్ రాబట్టాడు. అటు మరో ఓపెనర్ వైభవ్ (16)ను భువనేశ్వర్ అవుట్ చేసినా జైస్వాల్ తగ్గలేదు. ఆరో ఓవర్‌లో 4,4,6తో 14 రన్స్ అందించాడు. పవర్‌ప్లేలో 72/2 స్కోరుతో పటిష్ఠంగా కనిపించినా.. జైస్వాల్ పరుగు తేడాతో హాఫ్‌సెంచరీని కోల్పోయాడు. ఆ తర్వాత పరాగ్ (22), రాణా (28) సైతం భారీ షాట్లతో చెలరేగారు. కానీ పదో ఓవర్‌లో పరాగ్‌ను క్రునాల్ అవుట్ చేయడంతో ఆర్‌ఆర్ తడబాటు ఆరంభమైంది. రాణాను సైతం క్రునాల్ వెనక్కిపంపాడు. అటు హిట్టర్ హెట్‌మయెర్ (11) నిరాశపర్చగా.. సమీకరణం 3 ఓవర్లలో 40 పరుగులకు చేరింది. ఈ దశలో 18వ ఓవర్‌లో జురెల్ 6,4,4 శుభమ్ (12) 6తో 22 రన్స్‌తో ఆర్‌సీబీలో గుబులు రేపారు. కానీ వరుస బంతుల్లో జురెల్, ఆర్చర్ (0)లను హాజెల్‌వుడ్ అవుట్ చేయడంతో ఆశలు లేకుండా పోయాయి. చివరి ఓవర్‌లో 17 రన్స్ కావాల్సి ఉండగా శుభమ్, హసరంగ (1) వికెట్లను కోల్పోయి 5 పరుగులే చేయడంతో ఆర్‌సీబీ సంబరాల్లో మునిగింది.

టాపార్డర్ అదుర్స్ : టాస్ కోల్పోయి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరుకు శుభారంభం దక్కింది. బంతి అనూహ్యంగా బౌన్స్ అవుతున్నా టాపార్డర్ నిలబడింది. విరాట్ తన సూపర్ ఫామ్‌ను కొనసాగించగా.. అతడికి పడిక్కళ్, ఓపెనర్ సాల్ట్ (26) చక్కగా సహకరించారు. చివర్లో డేవిడ్ (23) మెరుపులు తోడయ్యాయి. దీనికితోడు రాజస్థాన్ పేలవ ఫీల్డింగ్ కూడా కలిసివచ్చింది. సాల్ట్ ఒక్క పరుగు వద్ద ఉన్నప్పుడే కెప్టెన్ పరాగ్ అతడి క్యాచ్‌ను వదిలేశాడు. ఓపెనర్ల అడపాదడపా బౌండరీలతో పవర్‌ప్లేలో స్కోరు 59కి చేరింది. కానీ ఆ వెంటనే స్పిన్నర్ హసరంగ సాల్ట్‌ను అవుట్ చేసి తొలి వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యానికి చెక్ పెట్టాడు. మరోవైపు స్పిన్నర్ల ధాటికి 7-11 ఓవర్ల మధ్య స్కోరు కాస్త నెమ్మదించింది. 12వ ఓవర్‌లో విరాట్ రెండు ఫోర్లతో సీజన్‌లో ఐదో ఫిఫ్టీని పూర్తి చేశాడు. అటు పడిక్కళ్ 28 రన్స్ దగ్గర ఉన్నప్పుడు ఇచ్చిన సులువైన క్యాచ్‌ను తుషార్ వదిలేశాడు. 15వ ఓవర్‌లో పడిక్కళ్ రెండు సిక్సర్లు, విరాట్ ఓ సిక్సర్‌తో 22 రన్స్ సమకూరాయి. అయితే 16వ ఓవర్‌లో బంతి ఆర్చర్ చేతికివ్వడంతో తను ఈ ఫార్మాట్‌లో తొలిసారి విరాట్‌ను అవుట్ చేశాడు. ఈ దశలో సందీప్ 17వ ఓవర్‌లో పడిక్కళ్, రజత్ (1)ల వికెట్లను తీయడంతో 200 స్కోరుపై సందేహం నెలకొంది. అయితే డేవిడ్, జితేశ్ (19 నాటౌట్)ల జోరుకు ఆఖరి మూడు ఓవర్లలో 38 పరుగులు రావడంతో ఆర్‌సీబీ 205 రన్స్‌తో ప్రత్యర్థిని సవాల్ చేయగల స్కోరు సాధించింది.



కోహ్లీ (70)

1

టీ20ల్లో తొలుత బ్యాటింగ్ చేస్తూ ఎక్కువ 50+ స్కోర్లు (62) సాధించిన ప్లేయర్‌గా విరాట్. బాబర్ ఆజమ్ (61)ను దాటాడు.

ఐపీఎల్‌లో రాజస్థాన్‌పై తమ అత్యధిక స్కోరు (205)ను నమోదు చేసిన బెంగళూరు.

ఐపీఎల్ చరిత్రలో ఇన్నింగ్స్ తొలి బంతినే 3 సార్లు సిక్సర్‌గా మలచిన తొలి ఆటగాడు యశస్వి

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	8	6	2	0	12	1.104
ఢిల్లీ	8	6	2	0	12	0.657
బెంగళూరు	9	6	3	0	12	0.482
ముంబై	9	5	4	0	10	0.673
పంజాబ్	8	5	3	0	10	0.177
లఖ్‌నవూ	9	5	4	0	10	-0.054
కోల్‌కతా	8	3	5	0	6	0.212
రాజస్థాన్	9	2	7	0	4	-0.625
హైదరాబాద్	8	2	6	0	4	-1.361
చెన్నై	8	2	6	0	4	-1.392

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

బెంగళూరు: సాల్ట్ (సి) హెట్‌మయెర్ (బి) హసరంగ 26; విరాట్ (సి) రాణా (బి) ఆర్చర్ 70; పడిక్కళ్ (సి) రాణా (బి) సందీప్ 50; డేవిడ్ (రనౌట్) 23; రజత్ (సి) జురెల్ (బి) సందీప్ 1; జితేశ్ (నాటౌట్) 20; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 20 ఓవర్లలో 205/5. వికెట్ల పతనం:** 1-61, 2-156, 3-161, 4-163, 5-205; **బౌలింగ్:** ఆర్చర్ 4-0-33-1; ఫరూఖి 3-0-30-0; తుషార్ 2-0-36-0; సందీప్ 4-0-45-2; హసరంగ 4-0-30-1; పరాగ్ 3-0-30-0.

రాజస్థాన్: యశస్వి (సి) షెపర్డ్ (బి) హాజెల్‌వుడ్ 49, వైభవ్ (బి) భువనేశ్వర్ 16, నితీశ్ రాణా (సి) భువనేశ్వర్ (బి) క్రునాల్ 28, రియాన్ (సి) జితేశ్ (బి) క్రునాల్ 22, జురెల్ (సి) జితేశ్ (బి) హాజెల్‌వుడ్ 47, హెట్‌మయెర్ (సి) జితేశ్ (బి) హాజెల్‌వుడ్ 11, శుభమ్ (సి) సాల్ట్ (బి) యశ్ 12, ఆర్చర్ (సి) పటీదార్ (బి) హాజెల్‌వుడ్ 0, హసరంగ (రనౌట్) 1, తుషార్ (నాటౌట్)1, ఫరూఖి (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు 5, మొత్తం: 20 ఓవర్లలో 194/9; వికెట్ల పతనం:** 1-52, 2-72, 3-110, 4-134, 5-162, 6-189, 7-189, 8-189, 9-191; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-50-1, యశ్ దయాల్ 3-0-33-1, హాజెల్‌వుడ్ 4-0-33-4, షెపర్డ్ 1-0-15-0, సుయాశ్ 4-0-31-0, క్రునాల్ పాండ్యా 4-0-31-2.

టెక్ మహీంద్రా లాభం జూమ్



ఒక్కో షేరుకు రూ.30 డివిడెండ్

క్యూ4లో 77% వృద్ధితో రూ.1,167 కోట్లకు చేరిక

న్యూఢిల్లీ: మార్చి 31తో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (క్యూ4)లో టెక్ మహీంద్రా ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 76.5 శాతం వృద్ధి చెంది రూ.1,166.7 కోట్లకు పెరిగింది. ఆదాయం 4 శాతం పెరిగి రూ.13,384 కోట్లుగా నమోదైంది. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)తో పోలిస్తే మాత్రం కంపెనీ లాభంలో 19 శాతం, ఆదాయంలో కేవలం 1 శాతం వృద్ధి నమోదైంది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి టెక్ మహీంద్రా నికర లాభం 80 శాతం వృద్ధితో రూ.4,252 కోట్లకు, ఆదాయం 2 శాతం పెరుగుదలతో రూ.52,988 కోట్లకు చేరుకుంది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో గడిచిన ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.30 తుది డివిడెండ్ చెల్లించనున్నట్లు తెలిపింది. మరిన్ని ముఖ్యాంశాలు..

- క్యూ4లో కంపెనీ 79.8 కోట్ల డాలర్ల (సుమారు రూ.6,800 కోట్లు) విలువైన కొత్త ఆర్డర్లను దక్కించుకుంది. ఏడాది క్రితం ఇదే కాలానికి లభించిన ఆర్డర్లతో పోలిస్తే 60 శాతం అధికమిది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి లభించిన కొత్త డీల్స్ విలువ 270 కోట్ల డాలర్లు (దాదాపు రూ.23,000 కోట్లు)గా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 42 శాతం ఎక్కువ.
- క్యూ3తో పోలిస్తే క్యూ4లో సంస్థ ఉద్యోగుల సంఖ్య 1,757 మేర తగ్గింది. పూర్తి ఆర్థిక సంవత్సరంలో 3,276 మంది తగ్గారు. దాంతో, ఈ మార్చి 31 నాటికి టెక్ మహీంద్రాలో పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య 1,48,731కి జారుకుంది. కాగా, మార్చి త్రైమాసికంలో కంపెనీ ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 11.8 శాతంగా నమోదైంది.
- గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ప్రాంగణ నియామకాల ద్వారా 6,000 మంది ఫ్రెషర్లను చేర్చుకోవాలన్న లక్ష్యాన్ని మించి 6,100 నియామకాలు చేపట్టినట్లు కంపెనీ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26) క్యాంపస్ హైరింగ్ లక్ష్యాన్ని వెల్లడించేందుకు కంపెనీ నిరాకరించింది. ట్రంప్ సుంకాలతో అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి పెరిగిన నేపథ్యంలో ఐటీ సేవలకు డిమాండ్ మందగించడం ఇందుకు కారణంగా పేర్కొంది.
- ఈ మార్చి త్రైమాసికం నాటికి కంపెనీ వద్ద రూ.7,656 కోట్ల నగదు, అందుకు తత్సమానమైన నిల్వలు ఉన్నాయని టెక్ మహీంద్రా వెల్లడించింది.

6% తగ్గిన సైయెంట్ లాభం

ఒక్కో షేరుకు రూ.14 డివిడెండ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సైయెంట్ డీఈటీ.. గడచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.1,472 కోట్ల మొత్తం రెవెన్యూపై రూ.163 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2023-24) ఇదే కాలంతో పోల్చితే రెవెన్యూ 3.4 శాతం క్షీణించగా లాభం 6 శాతం తగ్గింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను నికర లాభం 12.2 శాతం తగ్గుదలతో రూ.605 కోట్లుగా నమోదు కాగా ఆదాయం కూడా 1.6 శాతం క్షీణించి రూ.5,816 కోట్లుగా నమోదైంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.5 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.14 డివిడెండ్ (280 శాతం)ను డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

బిజినెస్

మదుపరులూ మోసపోవద్దు..

అర్థం చేసుకుని ట్రేడింగ్ చేయండి..

బీఎస్ఈ ఎండీ,సీఈఓ సుందరరామన్ రామమూర్తి



కోల్‌కతా: స్టాక్ మార్కెట్ పెట్టుబడులపై రిటైల్ మదుపరులు అప్రమత్తంగా ఉండాలని బీఎస్ఈ ఎండీ, సీఈఓ సుందరరామన్ రామమూర్తి హెచ్చరించారు. స్పష్టమైన అవగాహన, బాధ్యతలు గుర్తెరిగి పెట్టుబడులు పెట్టాలని కోరారు. లేకపోతే కొంప కొల్లేరయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పెట్టుబడులు పెట్టేటప్పుడు సరైన జాగ్రత్తలు పాటించకపోతే మదుపరులను కాపాడడం రెగ్యులేటరీ సంస్థలకు కూడా సాధ్యం కాదని స్పష్టం చేశారు. 'మీకు అర్థమైతేనే ట్రేడింగ్ చేయండి. లేదా అర్థం చేసుకుని ట్రేడింగ్ చేయండి. లేకపోతే సమస్యలు తప్పవు' అన్నారు. కోల్‌కతా చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన ఒక సదస్సులో బీఎస్ఈ ఎండీ ఈ హెచ్చరికలు చేశారు.

చెప్పుడు మాటలు వినొద్దు

చాలా మంది రిటైల్ మదుపరులు తాము కొనే కంపెనీల షేర్లపై కనీస కసరత్తు కూడా చేయకుండా.. గుడ్డిగా ఎవరో చెప్పిన మాటలు విని పెట్టుబడులు పెట్టడాన్ని బీఎస్ఈ చీఫ్ తప్పుపట్టారు. కూరగాయలు కొనేటప్పుడే అవి బాగున్నాయో లేదో ఒకటికి రెండు సార్లు పరిశీలిస్తాం. అలాంటిది జీవితమంతా కష్టపడి సంపాదించుకున్న మొత్తాన్ని ఎవరో చెప్పిన మాటలు విని పెట్టుబడి పెట్టడం ఏ మాత్రం సరికాదు' అన్నారు. చిన్న మదుపరులు నేరుగా స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టడానికి బదులు మ్యూచువల్ ఫండ్స్ ద్వారా మదుపు చేయాలని సూచించారు. మళ్లీ ఇందులో ఏదో ఒక ప్రత్యేక సెక్టార్‌కు చెందిన ఫండ్స్‌లో కాకుండా లార్జ్ క్యాప్ లేదా మల్టీ అసెట్ ఫండ్స్‌లో మదుపు చేయడం మంచిదని రామమూర్తి అన్నారు.

7 రోజుల ర్యాలీకి బ్రేక్

సెన్సెక్స్ 315 పాయింట్లు డౌన్


ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో ఏడు రోజుల ర్యాలీకి తెరపడింది. మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడం, నిరాశాజనక త్రైమాసిక ఆర్థిక ఫలితాల కారణంగా ప్రామాణిక సూచీలు గురువారం నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 315.06 పాయింట్లు కోల్పోయి 79,801.43 వద్దకు.. నిఫ్టీ 82.25 పాయింట్ల నష్టంతో 24,246.70 వద్దకు జారుకున్నాయి. ఆసియా, ఐరోపా మార్కెట్లో స్తబ్ధత కూడా ట్రేడింగ్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 17 నష్టపోయాయి. మార్చి త్రైమాసిక లాభం తగ్గడంతో ఎఫ్ఎంసీజీ దిగ్గజం హెచ్‌యూఎల్ షేరు 4 శాతం క్షీణించి సెన్సెక్స్ టాప్ లూజర్‌గా మిగిలింది. బీఎస్ఈలోని మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.16 శాతం వరకు తగ్గాయి. రంగాల వారీ సూచీల్లో రియల్టీ 1.39 శాతం నష్టపోగా.. ఎఫ్ఎంసీజీ, టెక్ ఇండెక్స్‌లు అర శాతానికి పైగా తగ్గాయి.

- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 12 పైసలు పెరిగి రూ.85.33 వద్ద ముగిసింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడి చమురు బ్యారెల్ ధర ఒక దశలో 66.10 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.
- ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర రూ.200 పెరిగి రూ.99,400 స్థాయికి చేరింది. కిలో వెండి రూ.700 పెరుగుదలతో రూ.99,900 ధర పలికింది. అంతర్జాతీయ విపణిలో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 1.43 శాతం పెరిగి 3,335 డాలర్లకు చేరగా.. సిల్వర్ 33.42 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

ఐదో అతిపెద్ద ఆస్తిగా బిట్‌కాయిన్

మార్కెట్ విలువపరంగా ప్రపంచంలోని అతిపెద్ద ఆస్తుల జాబితాలో గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్, అమెజాన్, సిల్వర్‌ను వెనక్కి నెట్టి బిట్‌కాయిన్ ఐదో స్థానానికి ఎగబాకింది. అయితే, ఇది కొద్ది సమయం పాటే. కంపెనీస్ మార్కెట్‌క్యాప్ డేటా ప్రకారం.. ఈ ప్రముఖ క్రిప్టోకరెన్సీ ధర బుధవారం ఒక దశలో 93,500 డాలర్లకు చేరువైంది. దాంతో మార్కెట్ విలువ 1.86 లక్షల కోట్ల డాలర్లకు ఎగబాకింది. తద్వారా గోల్డ్, యాపిల్, మైక్రోసాఫ్ట్, ఎన్‌విడియా తర్వాత ఐదో అతిపెద్ద అసెట్‌గా నిలిచింది. కానీ, గురువారం ట్రేడింగ్‌లో బిట్‌కాయిన్ ధర కాస్త తగ్గడంతో మళ్లీ 8వ స్థానానికి జారుకుంది.


ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ


హైదరాబాద్	405	విజయవాడ	420
వరంగల్	407	గోదావరి	410
చిత్తూరు	450	విశాఖపట్నం	425
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	112
వరంగల్	120	గుంటూరు	115
కరీంనగర్	120	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	88
కర్నూలు	120	నెల్లూరు	93
విశాఖపట్నం	111	అనంతపురం	93
గోదావరి	112		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,240 ▼	90,050 ▼	1,10,900 ▼
విజయవాడ	99,000 ▼	93,500 ▼	1,00,000 ▲
విశాఖపట్నం	99,170 ▲	90,050 ▼	1,10,900 ▲
రాజమండ్రి	98,240 ▼	90,050 ▼	1,00,900 ▲
ప్రొద్దుటూరు	97,300 ▼	89,520 ▼	1,00,000 ▲
ముంబై	96,286 ▲	88,198 ▲	97,634 ▲

వడ్డీ రేట్లు తగ్గించిన కెనరా, ఇండియన్ బ్యాంక్

న్యూఢిల్లీ: మరో రెండు ప్రభుత్వ రంగ బ్యాంకులు తమ గృహ, వాహన రుణాల వడ్డీ రేట్లు తగ్గించాయి. కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్ తమ రెపో ఆధారిత రుణాల వడ్డీ రేటును పావు శాతం (0.25%) మేర తగ్గించాయి. ఇండియన్ బ్యాంక్ గృహ రుణాలపై కనీస వడ్డీ రేటు 8.15 శాతం నుంచి 7.90 శాతానికి, వాహన రుణాలపై కనీస వడ్డీ రేటు 8.5 శాతం నుంచి 8.25 శాతానికి తగ్గాయి. వడ్డీ రేటు తగ్గింపుతో పాటు తమ రుణాలపై జీరో డాక్యుమెంటేషన్ చార్జీలు, డిస్కౌంటెడ్ ప్రాసెసింగ్ ఫీజు కూడా అమలు చేస్తున్నట్టు ఇండియన్ బ్యాంక్ తెలిపింది. కెనరా బ్యాంక్ కూడా తన గృహ రుణాల కనీస వడ్డీ రేటును 8.15 శాతం నుంచి 7.90 శాతానికి, వాహన రుణాల వడ్డీ రేటును 8.45 శాతం నుంచి 8.2 శాతానికి తగ్గిస్తున్నట్టు వెల్లడించింది.

వియత్నాం నుంచి భారత్‌కు..

స్మార్ట్‌ఫోన్ల తయారీని తరలించేందుకు సామ్‌సంగ్ సన్నాహాలు

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పోటుతో దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం సామ్‌సంగ్ తన వ్యాపార వ్యూహాన్ని మార్చుకుంటోంది. వియత్నాంలో ఉన్న తన స్మార్ట్‌ఫోన్ల ఉత్పత్తిలో కొంత భాగాన్ని మన దేశానికి తరలించాలని యోచిస్తున్నట్టు సమాచారం. ట్రంప్ సర్కారు వియత్నాం దిగుమతులపై 46 శాతం, భారత దిగుమతులపై 26 శాతం సుంకాలు విధించడమే ఇందుకు కారణం. ప్రస్తుతం ఈ సుంకాల పోటు నుంచి 90 రోజుల విరామం దొరికినా.. దీర్ఘకాలంలో తన స్మార్ట్‌ఫోన్లను వియత్నాం కంటే భారత్ నుంచి ఎగుమతి చేయడమే మేలని సామ్‌సంగ్ భావిస్తోంది.

మన వాటా స్వల్పమే: సామ్‌సంగ్ గత ఏడాది భారత్ నుంచి 350 కోట్ల డాలర్ల (సుమారు రూ.29,850 కోట్లు) విలువైన స్మార్ట్‌ఫోన్లు ఎగుమతి చేసింది. ఇదే సమయంలో వియత్నాం నుంచి 3,500 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.98 లక్షల కోట్లు) విలువైన స్మార్ట్‌ఫోన్లను ఎగుమతి చేసింది. ఇందులో 1,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.85,290 కోట్లు) విలువైన స్మార్ట్‌ఫోన్లు ఒక్క అమెరికాకే ఎగుమతయ్యాయి. భారత్‌లో ఉత్పత్తి పెంచడం ద్వారా అమెరికా స్మార్ట్‌ఫోన్ల మార్కెట్లో తన పట్టు నిలుపుకోవాలని సామ్‌సంగ్ యోచిస్తోంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకమూ ఈ విషయంలో కంపెనీని ఆకర్షిస్తోంది.

రూటు మార్చిన చైనా

అమెరికా భారీ సుంకాలను తప్పించుకునేందుకు చైనా కంపెనీలు కొత్త వ్యూహాన్ని అమలు చేస్తున్నాయి. తమ దేశంలో తయారైన వస్తువులను దక్షిణ కొరియాకు ఎగుమతి చేసి.. అక్కడ మళ్లీ వాటిని రీప్యాకింగ్ చేసి మేడిన్ ఇన్ సౌత్ కొరియా పేరుతో అమెరికాకు ఎగుమతి చేస్తున్నాయి. కొరియా కస్టమ్స్ అధికారులను ఉటంకిస్తూ జపాన్ వార్తా సంస్థ నిక్కీ ఏషియా న్యూస్ ఒక కథనం ప్రచురించింది. కొంత మంది చైనా పౌరులు దక్షిణ కొరియాలో ఇందుకోసం కొన్ని గిడ్డంగులు ఏర్పాటు చేసి ఈ పని చేస్తున్నట్టు తెలిపింది.

● లారస్ ల్యాబ్స్ లాభం మూడింతలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో లారస్ ల్యాబ్స్ రూ.234 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.76 కోట్లు)తో పోల్చితే లాభం ఏకంగా మూడింతలు వృద్ధి చెందింది. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం కూడా రూ.1,440 కోట్ల నుంచి రూ.1,720 కోట్లకు పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి లాభం రూ.161 కోట్ల నుంచి రూ.358 కోట్లకు, ఆదాయం రూ.5,041 కోట్ల నుంచి రూ.5,554 కోట్లకు పెరిగింది. కాగా కంపెనీ డైరెక్టర్ల బోర్డు 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2 ముఖ విలువ గల ఒక్కో షేరుపై 80 పైసల డివిడెండ్ ప్రకటించింది.

● తాన్లా లాభంలో 11% వృద్ధి

మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో తాన్లా ప్లాట్‌ఫామ్స్ రూ.1,024 కోట్ల ఆదాయంపై రూ.117 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే లాభం 11.5 శాతం వృద్ధి చెందింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను రూ.4,028 కోట్ల రెవెన్యూపై రూ.507 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

వరంగల్

సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 26

శుక్రవారం | 25-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్రమాసం, బహుళ పక్షం, తిథి: ద్వాదశి ఉ.11.45 తదుపరి త్రయోదశి, నక్షత్రం: పూర్వాభాద్ర ఉ.8.53 తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: సా.5.30-6.56, దుర్ముహూర్తం: ఉ.8.27-9.17, మ.12.38-1.28, అమృతఘడియలు: రా.2.08-3.34, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 5.56, సూర్యాస్తమయం: 6.30

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మూర్.. 9

ఉత్తమ పంచాయతీ

ఆత్మనిర్భర్ భారత్ పథకం కింద ఎంపిక

ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా

అవార్డు అందుకున్న పంచాయతీ కార్యదర్శి



అంతమొందించేందుకు ఎంతవరకైనా..

ఆ ఉగ్రవాదులు భూమ్మీద ఎక్కడ దాక్కున్నా పట్టుకుంటాం

'పహల్గాం' హంతకులను, వారికి మద్దతిస్తున్న వారిని కలలో కూడా ఊహించనట్లు శిక్షిస్తాం

ఇది పర్యాటకులపై దాడి మాత్రమే కాదు..

భారత ఆత్మపై దాడికి శత్రువుల దుస్సాహసం

ఉగ్రవాదుల స్వర్గధామాన్ని నిర్వీర్యం చేసే సమయం ఆసన్నమైంది: ప్రధాని మోదీ

మద్దతు ప్రకటించిన దేశాలకు కృతజ్ఞతలు

పట్నా, ఏప్రిల్ 24: పహల్గాంలో అమాయకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదుల అంతు చూస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఆ హంతకులు భూమ్మీద ఎక్కడ దాక్కొన్నా వెతికి పట్టుకొని శిక్షిస్తామన్నారు. ఉగ్రవాదులకు, ఉగ్రమూకలకు మద్దతిస్తున్న వారికి కలలో కూడా ఊహించని విధంగా కఠిన శిక్ష విధిస్తామని స్పష్టం చేశారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం బిహార్‌లోని మధుబనిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా పహల్గాంలో ఉగ్రదాడి గురించి ఆయన ప్రస్తావిస్తూ.. ముష్కరులకు తీవ్రమైన హెచ్చరిక చేశారు. వారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. తన ప్రసంగం ఆరంభంలో 'పహల్గాం ఉగ్రదాడిలో అసువులు బాసిన మన కుటుంబ సభ్యుల గౌరవార్థం మనమంతా మౌనం పాటిద్దాం' అని మోదీ సభికులను కోరారు. ప్రధానితో పాటు సభకు హాజరైన వారంతా ఒక నిమిషం పాటు

మిగతా 10వ పేజీలో...

ఉగ్రక్యాంపులను నాశనం చేయాల్సిందే!


కేంద్రం ఏ చర్య తీసుకున్నా మద్దతిస్తాం

జాతీయ భద్రత అంశంలో రాజకీయాల్లేవ్

ఉగ్రవాదంపై కలసికట్టుగా పోరాడదాం

అఖిలపక్ష సమావేశం ప్రకటన 10

రాష్ట్రపతితో అమిత్‌షా, జైశంకర్ భేటీ 11



పహల్గాం మృతులకు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ప్రజల నివాళి

పర్యాటకుల మతం అడిగి పాశవికంగా కాల్చారు


10 ఉగ్రవాదులకు గుణపాఠం నేర్పాలి: ఎంపీ ఒవైసీ

భారత్, పాక్ పోటాపోటీగా క్షిపణి పరీక్షలు

10 ఎంఆర్-ఎస్ఏఎంను పరీక్షించిన భారత నౌకాదళం

అరేబియా జలాల్లో ఐఎన్ఎస్ విక్రాంత్ మోహరింపు

ఒకటి రెండు రోజుల్లో పరీక్షలకు పాక్ మిలటరీ నోటమ్



పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్

సిమ్లా ఒప్పందం నిలిపివేత

భారత్ తీసుకున్న కఠిన నిర్ణయాలపై పాకిస్థాన్ ప్రతిచర్యలు

పాక్ ప్రధాని నేతృత్వంలో జరిగిన భేటీలో కీలక నిర్ణయాలు

వాఘా బార్డర్ మూసివేత.. వాణిజ్యం బంద్.. వీసాల రద్దు

సింధు జలాల ఒప్పందం కింద తమకు రావాల్సిన నీటిని మళ్లించే యత్నాల్ని యుద్ధచర్యగా భావిస్తామని హెచ్చరిక


మన విమానాలు తమ గగనతలంలోకి రాకుండా నిషేధం

చుట్టూ తిరిగి వెళ్లాల్సిందే!.. పాక్ నిర్ణయం ప్రభావం 11

విమానాల దారి మళ్లింపు.. ప్రయాణికులపై మరింత భారం

నిఘా వైఫల్యంపై విచారణ చేయాలి.. విద్వేషాల పెంపునకు బీజేపీ ఈ ఘటనను వాడుకోవడం బాధాకరం: సీడబ్ల్యూసీ

ఉగ్రదాడికి నిరసనగా నేడు దేశవ్యాప్తంగా కొవ్వొత్తుల ర్యాలీ



మేడిగడ్డ బ్యారేజీలో వచ్చిన పగుళ్లు (ఫైల్)

3 బ్యారేజీలు ప్రమాదంలోనే!

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల యథాతథంగా పనికిరావు

నష్టం విస్తృతం.. సమగ్ర పునరుద్ధరణ, రీడిజైన్ చేయాల్సిందే

మేడిగడ్డలో ఏడో బ్లాకును పూర్తిగా తొలగించాలి

కుంగడానికి ప్రధాన కారణం నిర్మాణ లోపమే

సీకెంట్ ఫైల్స్ అమరిక సరిగాలేకే ఇసుక జారింది

భూ పరీక్షలు లేకుండానే అన్నారం, సుందిళ్ల స్థలాల మార్పు

జలసంఘం అనుమతి తీసుకున్న తర్వాతే పునరుద్ధరణ

జాతీయ డ్యామ్ రక్షణ అథారిటీ నివేదికలో వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 24, (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మూడు బ్యారేజీలు పెను ప్రమాదంలో ఉన్నాయని జాతీయ ఆనకట్టల రక్షణ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) స్పష్టం చేసింది. ఇక ఆ బ్యారేజీలు యథాతథంగా నిరుపయోగమే అన్న రీతిలో నివేదికలోని అంశాలున్నాయి. ఈ బ్యారేజీలకు జరిగిన విస్తృత, పెను నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని...సమగ్ర పునర్‌నిర్మాణం, రీడిజైన్ చేయాలని పేర్కొంది. నిర్మాణ లోపాలు, డిజైన్ లోపాలు, నాణ్యత తనిఖీ లేకపోవడం, నీటి ఒత్తిడి ఎంత అన్న దానిపై తప్పుడు అంచనాలు... అన్నీ కలిసి సీకెంట్ ఫైల్స్ కూలిపోవడం, బ్యారేజ్ ఎగువ, దిగువల్లో రంధ్రాలు పడ్డాయని తేల్చింది. మూడు బ్యారేజీలకు విస్తృత, పెను నష్టం జరిగిందని పేర్కొంది. ఈ నష్టం ఇక్కడితోనే ఆగదని, నీటి

మిగతా 9వ పేజీలో...

ఈడీ అదుపులో హవాలా ఆపరేటర్లు

హైదరాబాద్‌లో 13 చోట్ల ఈడీ అధికారుల సోదాలు

మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు 12



తుక్కు వ్యాపారుల నుంచి..

23 లక్షల లూటీ

నిందితుల్లో సైబరాబాద్ సీపీ ఎస్కార్ట్ కానిస్టేబుల్ 12

అతనితో పాటు ముగ్గురి అరెస్టు.. పరారీలో నలుగురు



విలేకరుల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్

తెలంగాణ నమూనాను ప్రపంచానికి చాటుతాం

అందుకే 'భారత్ సదస్సు-2025'

రాష్ట్రానికి పెట్టుబడుల్ని ఆహ్వానిస్తాం

ప్రగతిశీల పార్టీలతో కలిసి డిక్లరేషన్ విడుదల చేస్తాం

100కు పైగా దేశాల నుంచి 450కు పైగా ప్రతినిధులు

డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

నేడు నోవాటెల్‌లో సదస్సు ప్రారంభం

సదస్సుతో పెట్టుబడులకు అనుకూల వాతావరణం: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి విషయంలో తెలంగాణ నమూనాను ప్రపంచానికి చాటి చెప్పడానికే 'భారత్ సదస్సు-2025'ను నిర్వహిస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ)లోని నోవాటెల్ హోటల్‌లో సదస్సు జరగనుంది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి గురుదీప్ సింగ్ సప్పల్‌తో

మిగతా 12వ పేజీలో...

కర్రెగుట్టల్లో ఎన్‌కౌంటర్.. ముగ్గురు

నక్సల్స్ కాల్చివేత



ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా చిన్నఉట్లపల్లిలో ఖాళీగా ఆదివాసీల ఇళ్లు

మృతులంతా మహిళలే.. సంఖ్య పెరగొచ్చు

అగ్రనాయకులను చుట్టుముట్టారని ప్రచారం

డ్రోన్లతో దాడులు చేస్తున్న బలగాలు

నిర్మానుష్యంగా మారిన గ్రామాలు

వడదెబ్బతో 15 మంది జవాన్లకు అస్వస్థత

కర్రెగుట్టల ఆపరేషన్‌తో మాకు సంబంధం లేదు

స్పష్టం చేసిన తెలంగాణ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

రాష్ట్రంలో 14 మంది నక్సల్స్ లొంగుబాటు

వరంగల్/చర్ల/వాజేడు/వెంకటాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కర్రెగుట్టల్లో ఆపరేషన్ కగార్ జోరందుకుంటోంది. మావోయిస్టులకు కంచుకోటగా ఉన్న ఈ గుట్టలను జల్లెడపట్టేందుకు భద్రతాబలగాలు హెలికాప్టర్లు, డ్రోన్లను వినియోగిస్తున్నాయి. ఈ క్రమంలో గురువారం డ్రోన్లతో నిర్వహించిన దాడుల్లో ముగ్గురు మహిళా నక్సల్స్ మృతిచెందారని బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందంటూ ఓ ప్రకటనను విడుదల చేశారు. మృతదేహాలను గుట్టల పైనుంచి కిందకు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామని, ఆ తర్వాతే మృతుల వివరాలు

మిగతా 12వ పేజీలో...



తెలుగుకు ముప్పు

మాతృభాషను చంపేస్తున్న ఇంటర్ బోర్డు

ద్వితీయ భాషగా సంస్కృతం..

ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

సర్కార్‌కు ఆచార్యులు, సాహితీవేత్తల లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ద్వితీయ భాషల విషయంలో ఇంటర్మీడియట్ బోర్డు తీసుకుంటున్న నిర్ణయాలు మాతృభాషను హతమార్చేలా ఉన్నాయని రాష్ట్రంలోని తెలుగు ఆచార్యులు, పరిశోధకులు, సాహితీవేత్తలు ప్రభుత్వానికి లేఖ రాశారు. అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ద్వితీయ భాష స్థానంలో సంస్కృతాన్ని ప్రవేశపెట్టాలన్న

మిగతా 12వ పేజీలో...

తెలుగుకు ద్రోహం.. 12

జయప్రదంగా సంస్కృతం!

ఇంటర్ బోర్డులో ఓ అధికారిణి అత్యుత్సాహం



బైక్‌కు గొడుగు ఏర్పాటు చేసుకుని యాదాద్రికి వెళ్తున్న ఓ కుటుంబం

నిప్పుల కొలిమి

రాష్ట్రంలో రోజురోజుకీ అధికమవుతున్న ఎండలు 7

నిర్మల్ జిల్లా తానూరు, జగిత్యాల జిల్లా అల్లీపూర్‌లో 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత

చాలా చోట్ల 40 డిగ్రీలకుపైనే..

వడదెబ్బతో నలుగురి మృతి

వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలో గాలివాన బీభత్సం

గర్జం దాల్చిన సంగతి తెలిసిన రోజే గోడ కూలి మహిళ మృతి

అమెరికాలో విద్యార్థి వీసాల

రద్దుకు బ్రేకులు!

- 133 మంది సెవిస్ రికార్డుల పునరుద్ధరణకు జార్జియా ఫెడరల్ కోర్టు ఆదేశం
- వీరిలో ఎక్కువ మంది భారతీయ విద్యార్థులే
- హెచ్-1బీకి అడ్రస్, బయోమెట్రిక్ తప్పనిసరి
- అమెరికా అధికారుల స్పష్టీకరణ



వాషింగ్టన్/ న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: అమెరికాలో స్టూడెంట్ వీసాలు రద్దయి ఇబ్బందులు పడుతున్న విదేశీ విద్యార్థులకు న్యాయస్థానం ఊరట కల్పించింది. మొత్తం 133 మంది విద్యార్థుల సెవిస్ (స్టూడెంట్ అండ్ ఎక్స్‌చేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) రికార్డులను తాత్కాలికంగా పునరుద్ధరించాలని జార్జియాలోని ఫెడరల్ కోర్టు న్యాయమూర్తి ట్రంప్ ప్రభుత్వాన్ని ఆదేశించారు. వీరిలో ఎక్కువ మంది భారతీయ విద్యార్థులే ఉన్నారు. అమెరికా విదేశాంగ శాఖ, ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ) అధికారులు

మిగతా 8వ పేజీలో...

ఎస్ఎల్‌బీసీ సహాయక చర్యలకు

తాత్కాలిక బ్రేక్

3 నెలలు విరామం ఇవ్వాలని నిర్ణయం

తదుపరి చర్యల కోసం సాంకేతిక నిపుణులతో ఉప కమిటీ

మృతుల కుటుంబాలకు సీఎం సహాయ నిధి నుంచి పరిహారం 12

ఎస్ఎల్‌బీసీపై సాంకేతిక సలహా మండలి సమావేశంలో నిర్ణయం

రాష్ట్ర వ్యాప్తంగా

'బిల్డ్ నౌ' 7

భవన నిర్మాణ అనుమతులు ఇక ఈ ప్లాట్‌ఫామ్ ద్వారానే

జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలో సానుకూల ఫలితాలతో నిర్ణయం

అమల్లోకి వచ్చిన సదుపాయం



టీఏసీ భేటీకి హాజరైన నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ తదితరులు

సీతారామకు సాంకేతిక అనుమతి

పర్యావరణ, జల విద్యుత్తు డిజైన్లకు లోబడి క్లియరెన్స్

టీఏసీ భేటీలో కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి వెల్లడి

ప్రాజెక్టుల్లో ముందడుగు

లక్షల ఎకరాలు సాగులోకి: భట్టి

పనులు పరుగులు పెట్టిస్తాం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్/ఢిల్లీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ నేతృత్వంలోని టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ (టీఏసీ) సాంకేతిక అనుమతి మంజూరు చేసింది. గురువారం ఢిల్లీలో దేబశ్రీ ముఖర్జీ అధ్యక్షతన జరిగిన 158వ టీఏసీ సమావేశానికి కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) ఛైర్మన్ డాక్టర్ ముకేశ్ కుమార్ సిన్హాతో పాటు తెలంగాణ నుంచి నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ(జనరల్) జీ అనిల్‌కుమార్, అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం ఎస్ఈ ఎస్.విజయకుమార్, కొత్తగూడెం ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, గోదావరి బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.సుబ్రమణ్యం ప్రసాద్ హాజరయ్యారు. బ్యారేజీ స్టెబిలిటీ డిజైన్లు, డ్రాయింగ్‌లు సరిగ్గానే ఉన్నాయని సీడబ్ల్యూసీ తెలిపింది. ప్రాజెక్టుకు సంబంధించి టీఏసీ లేవనెత్తిన అభ్యంతరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (పీపీటీ) ఇస్తామని

మిగతా 9వ పేజీలో...

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

రగులుతున్న ప్రతీకారం


పహల్గాంలో ఉగ్రవాదుల మారణకాండ దేశాన్ని కుదిపేస్తున్నది. ఆవేదనతోనూ, ఆగ్రహంతోనూ న్యూస్ చానెళ్ళలో చర్చోపచర్చలు జరుగుతున్నాయి. సోషల్ మీడియా ప్రతీకారేచ్ఛతో ఊగిపోతోంది. అనుచిత వ్యాఖ్యలు, ఉచితసలహాలు, ఫేక్ విడియోలతో సామాజికమాధ్యమాలు నిండిపోతున్నాయి. జరిగిన ఘోరానికి ప్రతిస్పందన ఏ విధంగా, ఏ స్థాయిలో ఉండాలన్నది పాలకులు నిర్ణయించాల్సిన అంశం. ప్రజాగ్రహం అర్థంచేసుకోదగినదే కానీ, వారి చర్యలూ చేష్టలూ ఒత్తిడిపెంచేందుకు దోహదం చేయకూడదు.

సౌదీ అరేబియాలో ఉన్న ప్రధాని నరేంద్రమోదీ, ఈ ఘోరం జరిగిన విషయం తెలియగానే పర్యటనను కుదించుకొని భారతదేశానికి చేరుకున్నారు. కార్యాలయానికో, నివాసానికో చేరేవరకూ ఆగకుండా విమానం నేలూనగానే విమానాశ్రయంలోనే ప్రభుత్వంలోని కీలకమైన వ్యక్తులతో సమావేశాన్ని నిర్వహించారు. గురువారం బిహార్‌లో ప్రసంగిస్తూ ఉగ్రవాదులను, వారిని వెనకేసుకొస్తున్నవారిని ఏ రీతిన శిక్షిస్తామో, ప్రపంచపు అంచులవరకూ ఎలా తరిమికొడతామో ప్రకటించారు. వచ్చే ఏడాది ఎన్నికలు జరగబోతున్న ఈ కీలకమైన రాష్ట్రాన్ని ప్రధాని తన హెచ్చరిక సందేశానికి వేదికగా ఎంచుకోవడమేమిటని కొందరి అభ్యంతరం. అయితే, హిందీలో ధాటీగా ప్రసంగిస్తున్న ప్రధాని మధ్యలో ఇంగ్లిష్‌లోకి మారి ఆ నాలుగుమాటలు చెప్పడం ప్రపంచానికంతటికీ తన సందేశం చేరాలన్న లక్ష్యంతోనే. రాబోయే రోజుల్లో ఏ చర్యలుంటాయో తెలియదుగానీ, ఇప్పటికే కొన్ని తక్షణ ప్రతీకార చర్యలైతే ప్రభుత్వం తీసుకుంది. సరిహద్దుల మూసివేత, దౌత్యసంబంధాల కుదింపు ఇత్యాదివాటికి తోడుగా, సింధుజలాల ఒప్పందాన్ని నిలిపివేయడం ద్వారా ఉగ్రవాదానికి అండగా నిలుస్తున్న పాకిస్థాన్‌కు పెద్ద హెచ్చరికే చేసింది.

ఆరుదశాబ్దాలక్రితం ఆవిర్భవించిన ఈ ఒప్పందం ప్రపంచవ్యాప్తంగా చాలా ఒప్పందాలకు స్ఫూర్తి. అయితే, ఈ మనం నిర్మించిన కిషన్‌గంగ, రాత్లె విద్యుత్ ప్రాజెక్టులపై పాకిస్థాన్ అభ్యంతరపెడుతున్న తరుణంలో, ఈ ఒప్పందాన్ని పునఃస్సమీక్షించుకుందామంటూ భారత్ ఇప్పటికే రెండుసార్లు ప్రతిపాదించిన విషయం తెలిసిందే. కారణాలు ఏమైనప్పటికీ, మోదీ ప్రభుత్వం ఈ ఒప్పందానికి మొదటినుంచీ అనుకూలంగా లేని తరుణంలో, పహల్గాం ఘటన జరిగింది. ఇప్పుడు ఒప్పందాన్ని నిలుపుదల చేయడం ద్వారా తక్షణమే పాకిస్థాన్‌ను శిక్షించలేకపోవచ్చును గానీ, ఒక బలమైన హెచ్చరిక చేసినట్టయింది. ఇప్పటికైతే ఇండస్, ఝీలమ్, చీనాబ్ నదులమీద భారీ డ్యాములేమీ లేవు కనుక, దిగువకు పోయే నీటిని అడ్డుకోవడం సాధ్యం కాదు. కానీ, 80శాతం సింధుజలాలకు ఈ మూడునదులే కారణం కనుక, వాటిని నియంత్రించగలిగినపక్షంలో తాగు, సాగునీటికి, విద్యుదుత్పత్తికీ పాకిస్థాన్ కటకటలాడక తప్పదు. ఈ సంక్లిష్టమైన ప్రాంతంలో, భారీ ఆర్థిక కేటాయింపులతో, ఓ నాలుగేళ్ళపాటు శ్రమించి ప్రాజెక్టులు కట్టగలిగితే పాకిస్థాన్‌ను ఇబ్బందిపెట్టాలన్న లక్ష్యం నెరవేరుతుందని నిపుణుల అంచనా. ఇక, ఒప్పందం ప్రకారం మనం వినియోగించుకోగలిగే జలాలు కూడా పాకిస్థాన్‌కు పోతున్న నేపథ్యంలో వాటిని రావి, బియాస్ లేదా సట్లెజ్‌లోకి మళ్ళించేందుకు ఈ సందర్భంగా ప్రయత్నం చేయవచ్చు.

అఖిలపక్ష సమావేశంలో ఇంటలిజెన్స్ వైఫల్యం, కీలకమైన ప్రాంతాల్లో కెమెరాలు లేకపోవడం, సమాచారలోపం, వేలాదిమంది సైనికులు ఉన్నాయాభైమందిని కాపాడలేకపోవడం ఇత్యాదివి విపక్షాలు ప్రస్తావించినప్పటికీ, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వానికి అండగా నిలిచాయి. ఇక, పాకిస్థాన్ ప్రకటించిన ప్రతీకార చర్యల్లో సిమ్లా ఒప్పందం రద్దు ప్రధానమైనది. 1971నాటి భారీయుద్ధం అనంతరం మరుసటి ఏడాది జుల్ఫికర్ అలీ భుట్టో, ఇందిరాగాంధీ మధ్య కుదిరిన ఈ ఒప్పందం ఇరుదేశాల సంబంధాలు అతుకుపడేందుకు ఉపకరించింది. ఉభయదేశాల మధ్య తలెత్తే ఘర్షణలు, సమస్యలు, వివాదాలు చర్చలద్వారా, పరిష్కారం కావాలని ఈ ఒప్పందం ఆకాంక్షిస్తోంది. కశ్మీర్ గురించి పాకిస్థాన్ మాట్లాడినప్పుడల్లా భారత్ ఈ ఒప్పందం వల్లనే గట్టిగా కొట్టిపారేయగలుగుతోంది. జమ్మూకశ్మీర్‌లో అధీనరేఖను గుర్తించడానికి కూడా ఇది ప్రాతిపాదిక. కొన్ని ఆదర్శాలు అటకెక్కిపోవడం, అడపాదడపా ఉల్లంఘనలను అటుంచితే, ఈ ఒప్పందం రద్దుకావడం కశ్మీర్ సహా చాలా అంశాలను సమస్యాత్మకంగా మార్చవచ్చు. పహల్గాం దారుణం ఇప్పటికే దిగజారిన భారత్-పాక్ సంబంధాలను ప్రమాదంలో పడవేసింది. రాబోయే రోజుల్లో దౌత్య, సైనికపరమైన సంక్షోభాలు అనేకం చూడవలసి రావచ్చు.

నయా కశ్మీర్ పహల్గాంకు ఎలా చేరింది?



> సీమాంతర ఉగ్రవాదాన్ని తుదముట్టించడంలో వెనకటి ప్రభుత్వాలు విఫలమైనట్టే మోదీ సర్కార్ సైతం ఆ భయానక బెడదను నిర్మూలించలేకపోయింది. భారత్ వ్యతిరేక ఉగ్రవాద కార్యకలాపాలకు, కశ్మీర్‌లో హింసాత్మక సంఘర్షణలకు పాకిస్థాన్ ప్రభుత్వ మద్దతు కొనసాగుతుందని పఠాన్‌కోట్ నుంచి పహల్గాం దాకా సంభవించిన ఉగ్ర బీభత్సాలు రుజువు చేస్తున్నాయి. పాకిస్థాన్ రాజ్యవ్యవస్థ 'ఇస్లామీకరణ' మాత్రమే కాకుండా మన సమాజంలో తీవ్రమవుతున్న మతపరమైన విభజనలు కూడా ఆ హింసాత్మక విధ్వంసాన్ని పురిగొల్పుతున్నాయి.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

జమ్మూ కశ్మీర్‌లో సుదీర్ఘకాలంగా ఎడతెగని హింసాత్మక సంఘర్షణను వర్ణించే, వివరించే, వ్యాఖ్యానించే పదజాలంలో ఒక మాట మళ్లీ మళ్లీ ప్రస్తావితమవుతోంది. ఆ పునరావృత పదమే 'సాధారణ పరిస్థితి'. కశ్మీర్ లోయలో సాధారణ పరిస్థితి ఎలా పునరుద్ధరింపబడిందో రాజకీయవేత్తలు, పరిశీలకులు, పాత్రికేయులు విజయోత్సాహంతో తరచు మాట్లాడుతుండడం కద్దు. వాస్తవమేమిటి? మూడున్నర దశాబ్దాలుగా కశ్మీర్‌లో పరిస్థితులు సాధారణ స్థాయిలో ఉన్నాయని చెప్పేందుకు వీలులేని భిన్న రీతిలోనే ఉంటూ వస్తున్నాయి. ఇదొక కఠోర సత్యం. హింసారిరంసతో రక్తమోడుతున్న కశ్మీర్ లోయలో పరిస్థితులు చక్కపడతాయనే ఆశాకుసుమాలు వికసించిన ప్రతిసారీ ఉగ్రభూతాలు వాటిని ఛిద్రం చేసేస్తున్నాయి. ఉగ్రవాద కాఠిన్యానికి పహల్గాంలో నిన్నగాక మొన్న కనీసం 28 మంది పర్యాటకులు హతమారిపోవడం ఆ విషాద, వికృత సత్యాన్నే మరొకసారి గుర్తుచేస్తూ జాతిని కలచివేస్తోంది. ప్రాణాంతకమైన ఒక విపత్కర పరిస్థితిలో కశ్మీర్ చిక్కుకున్నది.

ఆగస్టు 2019లో జమ్మూ–కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తున్న అధికరణ 370ని రద్దు చేసిన అనంతరం ఒక కొత్త కశ్మీర్ (నయా కశ్మీర్) విషయమై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన దార్శనికతను ఎలా ఆవిష్కరించారో గుర్తుచేసుకోండి. కశ్మీర్‌లో మామూలు పరిస్థితులను పునరుద్ధరించే దిశలో అదొక ప్రధాన ముందడుగు అని మోదీ పేర్కొన్నారు. త్వరలోనే పెట్టుబడుల వెల్లువను కశ్మీర్ చూడనున్నదని ప్రధానమంత్రి హామీ ఇచ్చారు. సత్వరమే మౌలిక సదుపాయాలను అభివృద్ధిపరుస్తామని వాగ్దానం చేశారు. బాలీవుడ్ సినిమా మాంత్రికులు నీలాల నింగిని చుంబించే హిమవత్పర్వతాలు, కన్నుల పండువైన పచ్చిక మైదానాలకు తిరిగి వస్తారని నరేంద్ర మోదీ ఉత్సాహంగా చెప్పారు. ఇదొక 'కొత్త సాధారణ'మని, జమ్మూ కశ్మీర్ శీఘ్రగతిన 'న్యూ ఇండియా' ప్రధాన స్రవంతిలో కలిసిపోతుందని మోదీ నిశ్చిత స్వరంతో చెప్పారు.

ప్రధానమంత్రి హామీ ఇచ్చిన 'సాధారణ పరిస్థితి' పైకి కనిపించే దృశ్యం. కొత్త రహదారులు, హైవేలు, కొండలు తొలిచి నిర్మించిన సొరంగాలు పెనుమార్పులకు ప్రతీకలే, సందేహం లేదు. ఇప్పుడు శ్రీనగర్ నుంచి అనంతనాగ్ లేదా బారాముల్లాకు వాయువేగంతో వెళ్లవచ్చు. ఈ ప్రయాణ సౌఖ్యం కొద్ది సంవత్సరాల క్రితం అయితే కలలో కూడా ఊహించలేని విషయం మరి. అయితే 'సాధారణ పరిస్థితి' అనేది భౌతిక వసతులకు మాత్రమే పరిమితమైనది కాదు. అది, అంతిమంగా ప్రజల మనస్సును, హృదయాన్ని గెలుచుకోవడమే అని చెప్పి తీరాలి. అయితే ఇది జరగలేదు. కనుకనే కశ్మీరీలలో చాలా కాలంగా ఉన్న మనోక్లేశాలు, హృదయావేదనలు సమసిపోవడం లేదు. ఎలా సమసిపోతాయి?

భారత్‌లో ముస్లింలు అధిక సంఖ్యాకులుగా ఉన్న ఏకైక రాష్ట్రమైన జమ్మూ–కశ్మీర్‌ను రాత్రికి రాత్రి శాసన విహిత ఫర్మానాతో విభజించి రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా కుదించి వేసినప్పుడు అక్కడ 'సాధారణ పరిస్థితి' ఎలా ఉంటుంది? ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులను అదుపులోకి తీసుకుని గృహ నిర్బంధంలో ఉంచినప్పుడు అది 'సాధారణ'మెలా అవుతుంది? వేలాది కశ్మీరీలను క్రూర చట్టాల కింద అరెస్ట్ చేసి జైళ్లలో కుక్కివేసినప్పుడు కశ్మీర్‌లో 'సాధారణ పరిస్థితి' ఎలా మొలకలేస్తుంది? నెలల తరబడి పాఠశాలలను మూసివేసినప్పుడు, ఇంటర్నెట్ షట్‌డౌన్ నిత్య వ్యవహారమైనప్పుడు 'సాధారణ పరిస్థితి' ఎలా నెలకొంటుంది? కశ్మీర్ లోయలో అడుగడుగునా వేలాది సైనికులను మోహరించినప్పుడు భారత ప్రభుత్వ వాగ్దానాలను కశ్మీరీలు ఎలా విశ్వసిస్తారు? ఆ అందమైన లోయకు 'సాధారణ' జీవన సౌందర్యం మళ్లీ ఎలా సమకూరుతుంది? భయభీతులను వ్యాపింపచేసేందుకు, హింసాకాండను రగిలించేందుకు కశ్మీరీ యువకులకు ఆయుధాలు, శిక్షణ ఇవ్వడాన్ని పాకిస్థానీ దుష్ట రాజ్య వ్యవస్థ కొనసాగిస్తున్నప్పుడు 'సాధారణ పరిస్థితుల' దిశగా కశ్మీర్ ఎలా పురోగమిస్తుంది?

గత ఏడాది తొలుత లోక్‌సభకు, ఆ తరువాత విధానసభకు జరిగిన ఎన్నికలలో అంతకు ముందు ఎన్నడూ లేని రీతిలో అత్యధిక ఓటర్లు తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకున్నారు. కశ్మీర్‌లో నెలకొన్న సాధారణ పరిస్థితులను ఈ పరిణామాలు ప్రతిబింబించడం లేదా అని హిమాలయ శిఖరాల నెక్కి కన్యాకుమారిలోని వారికి కూడా వినపడేలా ప్రశ్నించారు. ఏ కశ్మీరీ వేర్పాటువాద పార్టీ కూడా ఎన్నికలను బహిష్కరించాలని పిలుపునివ్వలేదు. ఓటు వేయవద్దని ఓటర్లను ఒత్తిడి చేయలేదు. వేర్పాటువాద పార్టీల సమష్టి వేదిక అయిన హురియత్ కాన్ఫరెన్స్ సర్వశక్తిమంతమైన భారత రాజ్య యంత్రాంగం పుణ్యమా అని కకావికలైపోయింది. జమ్ము–కశ్మీర్‌కు ఒమర్ అబ్దుల్లా ప్రజాస్వామ్యబద్ధంగా 'ఎన్నికైన' ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన పార్టీ పూర్తి మెజారిటీని సాధించుకున్నది. అయితే ముఖ్యమంత్రికి ఎలాంటి అధికారాలు, కనీసం కీలక అధికారులను నియమించేందుకు, బదిలీ చేసేందుకు సైతం అధికారాలు లేనప్పుడు అది 'సాధారణ' ప్రజాస్వామ్య పాలన ఎలా అవుతుంది? కశ్మీర్‌తో ఎటువంటి సంబంధమూ లేని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక కాని లెఫ్టినెంట్ గవర్నర్‌కు శాంతిభద్రతల సంరక్షణతో సహా సమస్త అధికారాలను కట్టబెట్టడం 'సాధారణ పరిస్థితి' పునరుద్ధరణకు ఎలా దోహదం చేస్తుంది? ప్రత్యేక ప్రతిపత్తిని కోల్పోయిన తమ రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర హోదా పునరుద్ధరణ జరుగుతుందనే ఆశాభావంతోనే జమ్ము–కశ్మీర్ ప్రజలు సంఖ్యానేకంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో పాల్గొన్నారు. కేంద్రం తన హామీని నెరవేర్చలేదు. కశ్మీరీల ఆశలు వమ్మయ్యాయి.

'సాధారణ పరిస్థితులు' నెలకొన్నాయనే విషయమై కేంద్ర ప్రభుత్వ కథనాలు, కోవిడ్ అనంతరం పర్యాటక రంగం పుంజుకోవడంలో భాగంగా కశ్మీర్ లోయకు పర్యాటకులు వెల్లువెత్తడాన్ని కూడా ప్రస్తావిస్తున్నాయి. శ్రీనగర్ ఉద్యానవనాలలో ట్యులిప్ పువ్వులు శోభాయమానంగా వికసిస్తున్నాయి. దాల్ సరస్సులో యాత్రికులు విహరిస్తున్నారు. పహల్గాంలో ట్రెక్కింగ్, గుల్మార్గ్‌లో స్కీయింగ్ సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. పర్యాటక-స్నేహపూరిత గమ్యంగా జమ్ము కశ్మీర్‌ను ప్రమోట్ చేసేందుకు కేంద్రం మే 2023లో శ్రీనగర్‌లో ఒక జీ20 పర్యాటక సదస్సును నిర్వహించింది.

అయితే పర్యాటక రంగం పుంజుకోవడమే సాధారణ పరిస్థితి'కి ఎంతమాత్రం చిహ్నం కాదు. ప్రజలు భయరహితంగా సంచరించడం, ఉగ్రవాద కార్యకలాపాలు పూర్తిగా సమసిపోవడం, ఉగ్రవాదులు తమ ఇష్టానుసారం దాడి చేయలేని అశక్తతలో పడడమే సాధారణ పరిస్థితుల పునరుద్ధరణకు నిదర్శనమవుతుంది. ఉగ్రవాద దాడులలో చనిపోయిన పౌరుల సంఖ్య ఇటీవలి సంవత్సరాలలో బాగా తగ్గిపోయిందని కేంద్రం చెప్పడం సమర్థనీయమే. అయితే ఉగ్రవాద మిలిటెంట్లు, సాయుధ బలగాల మధ్య ఎన్‌కౌంటర్లు కొనసాగుతున్నాయన్న నిష్ఠుర సత్యాన్ని ఆ అంకెలు మరుగుపరుస్తున్నాయి.

'సాధారణ పరిస్థితులే' ఉంటే ఉగ్రవాదులు లక్షిత దాడులకు ఎలా పాల్పడుతున్నారు? అక్టోబర్‌లో శ్రీనగర్‌లో ఒక ప్రముఖ కెమిస్ట్, ఒక ఆహార విక్రేత, ఒక టాక్సీ డ్రైవర్‌ను ఒక గంట వ్యవధిలోనే ఉగ్రవాదులు కాల్చివేసిన వైనాన్ని గుర్తు చేసుకోండి. హతుడైన కెమిస్ట్ మఖన్ లాల్ బింద్రూ ఒక కశ్మీరీ పండిట్. 1990ల్లో లోయ నుంచి పండిట్‌లు పెద్ద సంఖ్యలో వేరే రాష్ట్రాలకు శరణార్థులుగా వెళ్లిపోయినప్పటికీ మఖన్‌లాల్ తన స్వస్థలంలోనే ఉండిపోయారు. కశ్మీరీ హిందూ కుటుంబాలు ఇప్పటికీ తమ పూర్వీకుల గృహాలకు తిరిగి రాలేకపోవడం 'సాధారణ' పరిస్థితులకు ఎలా అడ్డం పడుతుంది? అమర్‌నాథ్ యాత్ర ఇప్పటికీ ఉగ్రవాద దాడుల భీతిలోనే జరుగుతుండడం సాధారణ పరిస్థితుల పునరుద్ధరణను ఎలా సూచిస్తుంది?

పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతుతో ఇస్లామిక్ ఉగ్రవాదులు తమ ప్రభావ ప్రాబల్యాలను కశ్మీర్ లోయలో మరింతగా విస్తరించుకుంటున్నప్పుడు అదెలా 'సాధారణ'మవుతుంది? లష్కరే మిలిటెంట్లకు పాకిస్థాన్ అన్ని విధాల ఆశ్రయమివ్వడం కొనసాగుతున్నప్పుడు పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ద్విజాతి సిద్ధాంతాన్ని బలపరుస్తూ కశ్మీర్‌ను పాక్ కంఠ రక్తనాళంగా అభివర్ణిస్తున్నప్పుడు లోయలో సాధారణ పరిస్థితులు నెలకొనడం ఎలా సాధ్యమవుతుంది? ఇటీవలి సంవత్సరాలలో పాకిస్థానీ 'విదేశీ' ఉగ్రవాదులు, స్థానిక కశ్మీరీలతో కలిసి హింసాత్మక దాడులకు పాల్పడడం ప్రబలిపోయింది. ఉపాధి, ఉద్యోగాలు లేని యువకులు ఉగ్రవాద కార్యకలాపాలలో పాల్గొంటూ ఉపశమనం పొందడం ఎలా 'సాధారణ'మవుతుంది?

నిజమేమిటంటే సీమాంతర ఉగ్రవాదాన్ని తుదముట్టించడంలో వెనకటి ప్రభుత్వాలు విఫలమైనట్టే మోదీ సర్కార్ సైతం ఆ భయానక బెడదను నిర్మూలించలేకపోయింది. భారత్ వ్యతిరేక ఉగ్రవాద కార్యకలాపాలకు, కశ్మీర్‌లో హింసాత్మక సంఘర్షణలకు పాకిస్థాన్ ప్రభుత్వ మద్దతు కొనసాగుతుందని పఠాన్‌కోట్ నుంచి పహల్గాం దాకా సంభవించిన ఉగ్ర బీభత్సాలు రుజువు చేస్తున్నాయి. పాకిస్థాన్ రాజ్య వ్యవస్థ 'ఇస్లామీకరణ' మాత్రమే కాకుండా మన సమాజంలో తీవ్రమవుతున్న మతపరమైన విభజనలు కూడా ఆ హింసాత్మక విధ్వంసాన్ని పురిగొల్పుతున్నాయి. రాజకీయ పక్షాలు, వాటి మద్దతుదారులు విద్వేషం, మత సంకుచితత్వాన్ని నిత్య వాస్తవాలుగా చేస్తున్నప్పుడు కశ్మీర్‌లో పరిస్థితులు 'సాధారణస్థితి'లో ఎలా ఉంటాయి? హిందూ–ముస్లిం విభేదాలు మరింతగా పెరిగిపోయేందుకు దుష్ట పాకిస్థానీ సైనిక– రాజ్య వ్యవస్థ పహల్గాం ఉగ్రవాద ఘటనను ఉపయోగించుకుంటుంది. అటువంటి దుష్ట పన్నాగాలను మనం ముందస్తుగా ఎదుర్కోవాలి. పాకిస్థాన్ తన పైశాచిక చర్యలకు భారీ మూల్యం చెల్లించి తీరాలి. అవధులు లేని ఆగ్రహంలోను, అంతులేని ఆవేదనలోను మనం ఐక్యంగా ఉండాలి.


(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

మరుగునపడ్డ మరో జలియన్‌వాలాబాగ్!

పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో 1919 ఏప్రిల్ 13న జరిగిన జలియన్‌వాలాబాగ్ దురంతానికి చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఇది మనందరికీ తెలిసిందే. కానీ చరిత్రకెక్కని ఇలాంటి ఓ ఉదంతమే మన కర్ణాటక–ఆంధ్ర సరిహద్దుల్లోనూ జరిగింది. అప్పటి అనంతపురం, కోలారు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన 'విదురాశ్వత్థం' అనే గ్రామ సమీపంలో 1938 ఏప్రిల్ 25న ఈ ఉదంతం జరిగింది.

1938 ఫిబ్రవరి 19–22 తేదీల్లో గుజరాత్ ప్రాంతం, సూరత్ జిల్లాలోని హరిపురాలో జాతీయ కాంగ్రెస్ సమావేశాలు జరిగాయి. ఆ సమావేశాల తీర్మానాల కారణంగానే మైసూర్ ప్రదేశ్ కాంగ్రెస్ ఏర్పాటైంది. అప్పట్లో మైసూర్ స్టేట్‌గా పిలువబడే ఈ కన్నడ ప్రాంతం కృష్ణరాజ ఒడియార్–4 అనే సంస్థానాధీశుడి పాలనలో ఉండేది. వీరు బ్రిటిష్ పాలకులకు అనుకూలంగా ఉండేవారు. 1938 ఏప్రిల్ రెండో వారంలో మాండ్యా జిల్లా శివపురలో మైసూరు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సమావేశాలు జరిగాయి. 'ధ్వజ సత్యాగ్రహ' కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రాంతాల్లోనూ జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని నేతలు నిర్ణయించారు. 1938, ఏప్రిల్ 9న సిద్దలింగయ్య అనే నాయకుడు జాతీయ జెండాను ఎగురవేశారు. సిద్దలింగయ్యతో పాటు పలు చోట్ల జెండా ఎగురవేసిన చాలామంది నాయకులను పోలీసులు అరెస్టు చేశారు.

హిందూపురం నుంచి బెంగళూరుకు వెళ్లే మార్గంలో ఈ విదురాశ్వత్థం ఉంది. ఇక్కడ కూడా జాతీయ జెండాను ఎగురవేయాలని ప్రదేశ్ కాంగ్రెస్ నేతలు నిర్ణయించుకున్నారు. ఆనాటి కార్యక్రమానికి నాగయ్యరెడ్డి, తిమ్మారెడ్డి, టి.రామాచారి నాయకత్వం వహించారు. 'ధ్వజ సత్యాగ్రహ' కార్యక్రమాన్ని గురించి తెలుసుకుని కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయాలని బ్రిటిష్ అధికారులు నిర్ణయించారు. 1938, ఏప్రిల్ 18 నుంచే ఈ ముందస్తు అరెస్టులు ప్రారంభమయ్యాయి. పోలీసుల చర్యలతో ఏప్రిల్ 22, 24 తేదీల్లో జెండాల ఎగురవేతను వాయిదా వేసినా, ఏప్రిల్ 25 నుంచి యథావిధిగా ఆ కార్యక్రమం కొనసాగింది. జెండాలను ఎగురవేసిన కల్లూరు సుబ్బారావు, నారాయణస్వామి, శ్రీనివాసరావు, సూరన్నలను పోలీసులు అరెస్టు చేశారు.



జలియన్‌వాలాబాగ్ దురంతానికి చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఇది అందరికీ తెలిసిందే. కానీ చరిత్రకెక్కని ఇలాంటి ఓ ఉదంతమే కర్ణాటక–ఆంధ్ర సరిహద్దుల్లోనూ జరిగింది. అప్పటి అనంతపురం, కోలారు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన 'విదురాశ్వత్థం' అనే గ్రామ సమీపంలో 1938 ఏప్రిల్ 25న ఈ ఉదంతం జరిగింది.

విదురాశ్వత్థం ఆలయ ఉత్సవాల్లో భాగంగా రథోత్సవంతో పాటు పశువుల సంత జరుగుతుండడంతో అప్పటికే వందలాదిగా జనాలు అక్కడ ఉన్నారు. కాంగ్రెస్ నాయకుల అరెస్టుతో జనం ఉద్వేగం చెంది, పోలీసులపైకి రాళ్లు రువ్వారు. దీంతో పోలీసులు రెచ్చిపోయారు. నాటి డిప్యూటీ డీఎస్పీ ఏ.ఎస్ ఖిల్లి నేతృత్వంలో మధ్యాహ్నం ఒకటిన్నర నుంచి ఐదున్నర గంటల వరకూ జనాలపై లాఠీచార్జి చేయడంతో పాటు, 96 రౌండ్లు కాల్పులు జరిపారు.

ఈ దురంతంలో సుమారు వందమంది చనిపోయి ఉంటారని అంచనా. కానీ కేవలం పదిమందిలోపే మరణించి ఉంటారని నాటి ఆ ప్రాంత సంస్థానాధీశుడు కృష్ణరాజ ఒడియార్ ప్రకటించారు. చనిపోయిన వారిలో ఇడుగురు భీమయ్య, చౌళూరు నరసప్ప, గజ్జన్నగారి నరసప్ప, హనుమంతప్ప, రాయకొండనహళ్లి మల్లయ్య, నామా అశ్వత్థనారాయణ శెట్టి, నరసప్ప, మరులూరు గౌరమ్మ వంటి వారున్నారు. వారిలో గౌరమ్మ తొమ్మిది నెలల గర్భవతి! ఈ ప్రాంతానికి దగ్గర్లోని తెలుగు ప్రాంతమైన చౌళూరు నుంచి సూలగిత్తి సంజీవప్ప, సూలగిత్తి నరసప్ప, కారేడుపల్లి నాగమల్లారెడ్డి, కురుబ మల్లేశప్ప వంటి వారు ఈ కాల్పుల్లో నేలకొరిగారు. ఈ అమరవీరుల స్మారకంగా 1947 ఆగస్టు 15న చౌళూరు గ్రామ ప్రజలు స్మారక చిహ్నం నిర్మించుకున్నారు. నేటికీ ఈ స్మారక చిహ్నాలు చౌళూరు గ్రామంలో పదిలంగా ఉండటమే కాదు, స్ఫూర్తిని వెదజల్లుతున్నాయి. 2009లో ఆ అమరవీరుల వివరాలతో స్మారక మందిరమైన 'వీరసౌధనూ గ్రామస్తులు నిర్మించుకున్నారు.

ఈ ఘటనలో ప్రాణాలర్పించిన వారి గురించి నాడు జాతీయ స్థాయిలో సంచలనమయ్యింది. ఈ ఘటనపై నివేదిక రూపొందించాలని సర్దార్ వల్లభాయ్ పటేల్, ఆచార్య జే.బీ కృపలానీలను గాంధీజీ కోరారు. మైసూర్ సంస్థానానికి, సర్ మీర్జా ఇస్మాయిల్ దివాన్‌కు గాంధీజీ ఈ ఘటన గురించి ఉత్తరం రాశారు. తత్ఫలితంగా 1939 మేలో సర్దార్ పటేల్, సర్ మీర్జా ఇస్మాయిల్ మధ్య ఒక ఒడంబడిక జరిగింది. దాన్ని 'పటేల్– మీర్జా పాక్ట్' అంటారు. దీని ప్రకారం జెండా ఎగురవేయడంపై నిషేధాన్ని ఎత్తివేశారు. అలాగే వారి సంస్థానంలో కాంగ్రెస్‌ను రాజకీయ పార్టీగా గుర్తిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ నిర్వహణలో సంస్కరణలను ప్రతిపాదిస్తూ ఏర్పాటు చేసిన కమిటీలో ఏడుగురు కాంగ్రెస్ పార్టీ సభ్యులు అంతర్భాగమయ్యారు. మహాత్మాగాంధీ 1939లో చిక్కబల్లాపూర్ సమీపంలోని నందికొండలలో విడిది చేసినప్పుడు ఈ విదురాశ్వత్థ ఘటన గురించి ప్రత్యేకంగా చర్చించారు. అలాగే 1939లో మైసూర్ ప్రదేశ్ కాంగ్రెస్ రెండో సమావేశం విదురాశ్వత్థంలోనే జరగడం విశేషం.

నిజానికి ఈ ఘటన గురించిన సమగ్ర సమాచారం అందుబాటులో లేదు. జనబాహుళ్యంలోకి రాకపోవడంతో ఇది మరుగున పడిపోయింది. కానీ స్థానికులు మాత్రం మృతి చెందినవారి జ్ఞాపకార్థం 1973 సంవత్సరంలో స్థానికంగా ఓ స్మారక స్తూపం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ దురంతానికి సంబంధించిన అంశాలు వెలుగులోకి రావడానికి గౌరీబిదనూరు నేషనల్ కాలేజీలో ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేసిన బి. గంగాధరమూర్తి కృషి ఎంతో ఉంది. వీరే తొలిసారి ఈ ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించి, 2011 డిసెంబర్‌లో 'కర్ణాటకద జలియన్ వాలాబాగ్ విదురాశ్వత్థ' పేరుతో ఓ పుస్తకాన్ని వెలువరించారు. ఈ రచన కన్నడ, ఇంగ్లీషు భాషల్లో ప్రచురితమైంది.

• డా. నాగసూరి వేణుగోపాల్

కలచివేసిన కశ్మీర్ మారణకాండ

ఇటీవల కాలంలో ప్రశాంతంగా ఉండి పర్యాటకులను ఆకర్షిస్తూ అభివృద్ధి పథంలో పయనిస్తున్న కశ్మీర్ లోయలో ఉగ్రవాదులు జరిపిన మారణకాండ మానవతావాదుల్ని కలచివేసింది. అమాయకులను చుట్టుముట్టి వారి మతాన్ని అడిగి మరీ ముస్లిమేతరులను దారుణంగా చంపడం ఎంత మాత్రం క్షమార్హం కాదు. ఈ ఉగ్రదాడికి కారణమైన ఉగ్రవాద సంస్థలు, వాటికి వెన్నుదన్నుగా ఉండి ప్రోత్సహిస్తున్న వ్యక్తులు, సంస్థలు ఏవైనా కావచ్చు. వాటిని తుదముట్టించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ సమయంలో కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా దేశవ్యాప్తంగా ఉన్న భారతీయులందరూ ఇలాంటి దుశ్చర్యలను ఎదుర్కోవడంలో ఐక్యంగా ఏక తాటిపై ఉండాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో ఇలాంటి ముష్కర చర్యలను ఆసరాగా తీసుకుని ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడానికి, అమాయకులను బలితీసుకోవడానికి, దేశంలో అశాంతి, అలజడులను రేకెత్తించి, దేశ సమగ్రతను విధ్వంసం చేయడానికి ప్రయత్నించే వారి పట్ల కూడా అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత పాలకులపై ఉంది.

– సయ్యద్ జుల్ఫికర్ అలీ
కలువాయి, నెల్లూరు జిల్లా

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

విద్యాభారతికి తలమానికం ఓయూ

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఏప్రిల్ 26 నాటికి 107 వసంతాలు పూర్తి చేసుకుని, 108 సంవత్సరంలోకి అడుగుపెట్టబోతున్న వేళ విశ్వవిద్యాలయ గమనాన్ని గతం నుంచి వర్తమానం వరకు అవలోకనం చేసుకొని, భవిష్యత్తు ప్రణాళికలను రూపొందించాల్సిన ఒక చారిత్రక సందర్భం నేడున్నది.

ఉదాత్తమైన ఆశయంతో, అత్యంత దూరదృష్టితో హైదరాబాద్ ఏడవ నిజాం మిర్ ఉస్మాన్ అలీఖాన్ ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. దీనికి సంబంధించిన ఫర్మానాను 1917 ఏప్రిల్ 26న జారీచేశారు. ఇంటర్మీడియట్ తరగతులతో ప్రారంభమై, 1921 నాటికి డిగ్రీ, 1923 నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ తరగతులు విశ్వవిద్యాలయంలో ప్రారంభమయ్యాయి. నాటి నుంచి నేటి దాకా నిరంతరాయంగా అభివృద్ధి చెందుతూ, భారతదేశ ఉన్నత విద్యారంగంలో ఏడవ ప్రాచీన విశ్వవిద్యాలయంగా, దక్షిణ భారతదేశంలో మూడవ ప్రాచీన ఉన్నత విద్యాసంస్థగా సమున్నతమైన స్థానాన్ని ఆక్రమించి, నేడు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా రంగంలో తలమానికంగా నిలిచింది.

ఇంతటి గొప్ప విద్యావారసత్వం ఉన్న విశ్వవిద్యాలయానికి 26వ ఉపకులపతిగా 19 అక్టోబర్ 2024న బాధ్యతలు స్వీకరించి ఏప్రిల్ 19 నాటికి ఆరు నెలలు పూర్తయింది. ఈ ఆరు మాసాల కాలంలో విశ్వవిద్యాలయ పురోభివృద్ధికి తీసుకున్న చర్యలు, భవిష్యత్ కార్యాచరణ ఉన్నత విద్యను మరింత బలోపేతం చేస్తున్నది. ఇటీవలే విశ్వవిద్యాలయ పరిధిలో పనిచేస్తున్న బోధనా సిబ్బందికి వివిధ వృత్తిపరమైన అంశాలతో మూడు రోజులపాటు కార్యశాల నిర్వహించాం. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఉన్న విద్యావేత్తలను, నిపుణుల ద్వారా వర్క్‌షాప్ నిర్వహించి, పూర్తి స్థాయిలో న్యాక్‌కు సిద్ధం అవుతున్నాం.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ చెల్లింపులు, కాగిత రహిత సేవలు ప్రవేశపెట్టి డిజిటల్ పరిపాలనను వేగవంతం చేశాం. క్యాంపస్, అనుబంధ కళాశాలల్లో హాజరుశాతం పెంచటం ద్వారా తరగతుల నిర్వహణ, సకాలంలో పరీక్షల నిర్వహణలో పురోగతి సాధించాం. రానున్న పదేళ్ళ కాలం వరకు విద్యార్థులకు హాస్టల్ వసతి విషయంలో ఇబ్బంది లేకుండా నూతన వసతి గృహాల నిర్మాణానికి కృషిచేస్తున్నాం. పరిశోధనలలో కూడా ఉస్మానియా అగ్రగామిగా ఉన్నది. ఇప్పటికే విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఆచార్యులు సుమారు 300 కోట్ల రూపాయల విలువైన పరిశోధన ప్రాజెక్టులను నిర్వహిస్తున్నారు. రూసా ద్వారా విశ్వవిద్యాలయానికి 107 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయి. వాటిలో ఇప్పటికే 37 కోట్ల రూపాయలు ఖర్చు అయి, వివిధ పనులతో ప్రగతి సాధిస్తున్నాం.

విశ్వవిద్యాలయంలో దాదాపు అన్ని కోర్సులలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఈ ఏడాది నుంచి ఒక విశేష సంఖ్యతో కూడిన గుర్తింపు కార్డు (యూనిక్ ఐడి) ఇవ్వటానికి ప్రణాళిక సిద్ధం చేశాం. దీని ద్వారా విద్యార్థులకు సంబంధించిన ప్రతి సమాచారం ఒకే నంబర్‌పై కొనసాగించవచ్చు. ఇటీవలే ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు, వికలాంగుల కోసం, వారి సమస్యలను సకాలంలో పరిష్కరించటానికి 'సెంటర్ ఫర్ డిసెబుల్డ్' నెలకొల్పాం. గ్రామీణ ప్రాంతం నుంచి యూనివర్సిటీ విద్యలో ప్రవేశించిన విద్యార్థుల కోసం CELT (సెంటర్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ ట్రైనింగ్) ద్వారా ప్రతి 45 రోజులకు ఒకసారి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి, ఇంగ్లీష్ భాష పట్ల విద్యార్థులలో ఉన్న భయాన్ని పోగొట్టి, మంచి సమాచార నైపుణ్యాలను పెంపొందిస్తున్నాం.



> ఉస్మానియా విశ్వవిద్యాలయం 2011లో 'ఐదు నక్షత్రాల' గుర్తింపును, 2008లో న్యాక్ 'A' గ్రేడ్‌ను, 2017లో న్యాక్ 'A+' గ్రేడ్‌ను పొందింది. 2018లో యూజీసీ చేత 'మొదటి క్యాటగిరీ' విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందింది. 2024లో NIRF ర్యాంకింగ్‌లో రాష్ట్ర విశ్వవిద్యాలయాల జాబితాలో ఆరవ స్థానాన్ని పొందింది.

2021లో ప్రారంభించిన మొదటి బ్యాచ్ ILM (కృత్రిమ మేధ) కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు నూరు శాతం ప్లేస్‌మెంట్స్ సాధించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం చరిత్రలోనే తొలిసారిగా ఒక మహిళా అధికారిని జాయింట్ రిజిస్ట్రార్‌గా నియమించి, విశ్వవిద్యాలయ పరిపాలన పదవులలో మహిళలకు సముచిత స్థానం కల్పించాం.

డా. బాబు జగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతిబాఫూలే, డా. బి.ఆర్. అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను అకడమిక్ కార్యక్రమాలుగా నిర్వహించి, సమాజంలో వివిధ రంగాలలో నిష్ణాతులుగా ఉన్న మేధావులచే ఉపన్యాసాలు ఏర్పాటు చేశాం. ఇందులో భాగంగా 20కి పైగా రీసెర్చ్ పేపర్స్‌ను ఒక పుస్తక రూపంగా తీసుకురాబోతున్నాం. విశ్వవిద్యాలయాన్ని 'గ్రీన్ క్యాంపస్'గా మార్చటానికి HMDA సహకారంతో ప్రణాళిక రూపొందించాం.

2011లో 'ఐదు నక్షత్రాల' గుర్తింపును, 2008లో న్యాక్ 'A' గ్రేడ్‌ను, 2017లో న్యాక్ 'A+' గ్రేడ్‌ను పొందింది. 2018లో యూజీసీ చేత 'మొదటి క్యాటగిరీ' విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందింది. 2024లో NIRF ర్యాంకింగ్‌లో రాష్ట్ర విశ్వవిద్యాలయాల జాబితాలో ఆరవ స్థానాన్ని పొందింది. 'ఎమర్జింగ్ ఎకనామిక్ యూనివర్సిటీస్ ర్యాంకింగ్ 2022' ద్వారా అంతర్జాతీయ ఖ్యాతి పొందింది. ఇండియాటుడే – నీల్సన్, వీక్ హన్సా రీసెర్చ్ సంస్థల సర్వేలలో గత 15 సంవత్సరాలుగా వరుసగా భారతదేశంలో ఉన్న టాప్ పది విశ్వవిద్యాలయాల జాబితాలో స్థానం సంపాదించింది. 2012 నుంచి 'యూనివర్సిటీ విత్ పొటెన్షియల్ ఎక్సలెన్సీ' (UPE)గా గుర్తింపు పొందుతోంది.

యూనివర్సిటీలో 66 రకాల అకడమిక్ సబ్జెక్ట్స్, 56 విభాగాలు, ఎనిమిది క్యాంపస్ కళాశాలలు, ఆరు అనుబంధ కళాశాలలు, ఐదు జిల్లా పీజీ కేంద్రాలు కలిగి, తెలంగాణలో అతి పెద్ద విశ్వవిద్యాలయంగా ఉన్నది. 125 రకాల సబ్జెక్ట్స్‌తో 69 డిగ్రీ స్థాయి కోర్సులు, 114 పీజీ కోర్సులు, 66 సబ్జెక్టులలో PhD ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తున్నది.

ప్రస్తుతం ఉస్మానియా విశ్వవిద్యాలయానికి DBT- ఇస్‌లార్ ప్రాజెక్టు క్రింద 15 కోట్ల రూపాయలు, DST-PURSE పథకం క్రింద 17.10 కోట్ల రూపాయలు, రూసా 2.0 క్రింద 107 కోట్ల రూపాయల గ్రాంట్స్ ఉన్నాయి. అంతర్జాతీయంగా ఇంగ్లండ్, మలేసియా, తైవాన్, వియత్నాం, సొల్వేనియా దేశాలతో పరిశోధనలలో భాగస్వామ్యం కలిగివున్నది.

ఉస్మానియా విశ్వవిద్యాలయం బోధన, పరిశోధన రంగంలో CBCS ఛాయిస్ బేస్డ్ (క్రెడిట్ సిస్టం) ఇంటర్నల్ పరీక్షలు లాంటి నూతన పద్ధతులను కలిగి వుండటంతో పాటు డేటా సైన్సు, సైబర్ సెక్యూరిటీ, బిజినెస్ ఎనాలసిస్ లాంటి నూతన కోర్సులను ప్రవేశపెట్టింది. వీటితో పాటు CFRD, NCAM, O-TBT వంటి పరిశోధన సౌకర్యాలను కలిగివున్నది. విశ్వవిద్యాలయ ఆచార్యులు 207 పేటంట్లను కలిగివున్నారు, మరికొన్ని ఆమోదిత జాబితాలో ఉన్నాయి. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, జాబ్ మేళాలు, హెల్త్‌కేర్, మానసిక కౌన్సిలింగ్, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను నెలకొల్పింది. ప్రస్తుతం 735 ఉస్మానియా విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలలో 3.5 లక్షల మంది చదువుతున్నారు.

భారతదేశ ఉన్నత విద్యారంగానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం తలమానికంగా ఉంటుందని, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యకు దశ – దిశ చూపించటంలో తన పాత్ర క్రియాశీలకంగా అగ్రగామిగా ఉంటుందని విశ్వసిస్తున్నాం.

■ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం
వైస్ ఛాన్సలర్, ఉస్మానియా యూనివర్సిటీ

(రేపు ఉస్మానియా యూనివర్సిటీ ఆవిర్భావ దినోత్సవం)



ఎల్కతుర్తిలో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కల్వకుంట్ల కవిత, నేతలు

ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే హామీలన్నీ నెరవేర్చాలి

- సభలో పల్లీలు, బఠానీలు అమ్ముకునేంత మంది లేరు కాంగ్రెస్‌లో
- రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్సే శ్రీరామ రక్ష
- మహిళలకు ప్రాధాన్యత కల్పించింది కేసీఆరే..
- జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- ఎల్కతుర్తిలో రజతోత్సవ సభ ఏర్పాట్ల పరిశీలన

5



కాంగ్రెస్‌లో.. 'సంస్థాగత' సందడి

అధికార కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత ఎన్నికల సందడి మొదలైంది. పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు తమ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు, అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లే దిశగా కాంగ్రెస్ అడుగులు వేస్తోంది. అయితే అధికార పార్టీ కావడంతో మండల, జిల్లా స్థాయిల్లో పదవుల కోసం హస్తం నేతల్లో ఆసక్తి పెరిగింది. ఈ క్రమంలో శుక్రవారం నుంచి మే 20వ తేదీ వరకు అన్ని జిల్లాల్లో పార్టీ సంస్థాగత పదవుల ఎన్నిక ప్రక్రియ పూర్తిచేయాలని అధిష్ఠానం ఆదేశించటంతో పాటు పీసీసీ పరిశీలకులను కూడా నియమించింది. దీంతో పాటు 2017, అంతముందుకు నుంచి పార్టీలో పని చేస్తున్నవారికి పదవుల్లో ప్రాధాన్యమిస్తూనే.. యువత, మహిళలు, సీనియర్లకు పెద్దపీట వేయాలని సూచించింది. మరోవైపు డీసీసీ పగ్గాలు చేపట్టేందుకు ఎమ్మెల్యేలు ఆసక్తి చూపటం లేదు. అయితే కొన్ని జిల్లాల్లో జిల్లా అధ్యక్ష పీఠంపై తమ వారసులను కూర్చోపెట్టేందుకు కీలక నేతలు ప్రయత్నాలు చేస్తుండటంతో కాంగ్రెస్‌లో సంస్థాగత సందడి నెలకొంది. ఇదే సమయంలో ఎన్నాళ్లుగా పదవుల కోసం ఎదురుచూస్తున్న వారు తమ తమ నేతల ద్వారా ముమ్మర ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

నేటి నుంచి మే 20వ తేదీ వరకు సమావేశాలు

ఓరుగల్లు కాంగ్రెస్‌లో సంస్థాగత ఎన్నికల కోలాహలం నెలకొంది. గతేడాది సెప్టెంబరు 6న టీపీసీసీ అధ్యక్షుడిగా బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి ఏడు నెలలుగా సంస్థాగత ఎన్నికలు నిర్వహిస్తారని నాయకులు, కార్యకర్తలు ఆశగా ఎదురు చూస్తున్నారు. కానీ పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా వాయిదా పడుతూ వస్తున్న సంస్థాగత ఎన్నికలకు ఎట్టకేలకు ముహూర్తం ఖరారైంది. శుక్రవారం నుంచి మే 20వ తేదీ వరకు సంస్థాగత ఎన్నికలను పూర్తి చేయాలని ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదేశించారు. ఈ నెల 25నుంచి 30వ తేదీ వరకు జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహిస్తారు. మే 4వ తేదీ నుంచి 19వ తేదీ వరకు బ్లాక్, నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహించి, మండల, బ్లాక్, డీసీసీ స్థాయి నుంచి టీపీసీసీలో ఉపాధ్యక్షులు, ప్రధానకార్యదర్శులు, వర్కింగ్ ప్రెసిడెంట్లు తదితర పదవులకు సిఫార్సులు తీసుకోవాలని అధిష్ఠానం నిర్ణయించింది. ఈ మేరకు పీసీసీ పరిశీలకులను నియమించారు. వరంగల్ జిల్లాకు అమీర్ అలీఖాన్, మేడి రవిచంద్ర, హనుమకొండ జిల్లాకు కోమటిరెడ్డి వినయ్‌రెడ్డి, మక్సూద్ అహ్మద్, భూపాలపల్లి జిల్లాకు కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, ములుగు జిల్లాకు కొండేటి మల్లయ్య, మహబూబాబాద్ జిల్లాకు పోట్ల నాగేశ్వర్‌రావు, కూచన రవళి, జనగామ జిల్లాకు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌ను నియమించారు. శుక్రవారం నుంచి సంస్థాగత ఎన్నికల ప్రక్రియ చేపడుతుండటంతో కాంగ్రెస్‌లో కోలాహలం నెలకొంది.

- మండలాల నుంచి డీసీసీల వరకు కమిటీల ఏర్పాటుపై కసరత్తు
- ఇప్పటికే అన్ని జిల్లాలకు పీసీసీ పరిశీలకులను నియమించిన అధిష్ఠానం
- 2017, అంతకుముందు నుంచి పార్టీలో ఉన్నవారికే పదవుల్లో ప్రాధాన్యం
- సీనియర్లతో పాటు మహిళలు, యువతకు పెద్దపీట వేయాలన్న నాయకత్వం
- డీసీసీ పీఠాలపై పలువురు నేతల వారసుల ఆసక్తి
- ఉమ్మడి జిల్లా హస్తం శ్రేణుల్లో సందడి
- పదవులు దక్కించుకునే ప్రయత్నాల్లో ఆశావహులు

సీనియర్లకే ప్రాధాన్యం..

కాంగ్రెస్ పదవుల్లో అధిష్ఠానం ట్విస్ట్ ఇచ్చింది. 2017, అంతకు ముందు నుంచి పార్టీలో పని చేస్తున్నవారికి పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆమె ఈ మేరకు సూచనలు చేశారు. ప్రతిపక్షంలో ఉండి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకరావడానికి సైనికుల్లా పని చేసిన వారికి పార్టీ పదవుల్లో ప్రాధాన్యం ఉండాలని సూచించారు. దీంతో సీనియర్ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల, జిల్లా కమిటీల్లో సీనియర్లకు ప్రాధాన్యత పెరుగుతుందని భావిస్తున్నారు. అలాగే యువతకు, మహిళలకు కూడా అదే స్థాయిలో పదవుల్లో ప్రాధాన్యత ఉండాలని అధిష్ఠానం ఆదేశించింది. సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయటంతో పాటు అన్ని వర్గాల వారికి పార్టీలో కీలక పదవులు దక్కేలా కసరత్తు చేస్తోంది. దీంతో ప్రతిపక్షంలో ఉన్న పదేళ్ల పార్టీ కోసం పని చేసిన నేతలు పదవులు దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉండటంతో పార్టీ పదవికి ప్రాధాన్యం ఉంటుందనే ఆశతో మండల, జిల్లా కార్యవర్గాల్లో చోటు కోసం ద్వితీయ శ్రేణి నేతలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలపై పార్టీ పదవుల కోసం ఒత్తిడి తీసుకవస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ అభ్యర్థుల ఎంపికలో పార్టీ కార్యవర్గాలు కీలకం కావటంతో పదవి కోసం పోటీ పెరుగుతుంది. పార్టీలో పదవి కోసం డిమాండ్ చేస్తే.. అనివార్య కారణాల వల్ల రాలేకపోయినప్పటికి జడ్పీటీసీ, ఎంపీపీ పదవులపై హామీ దక్కుతుందనే ఆశతో మరికొందరు ఉన్నారు. మరికొందరైతే పార్టీ పదవుల రేసులో ఉంటే కనీసం నామినేటెడ్ పదవుల్లో చైర్మన్, డైరెక్టర్ పోస్టులైనా

మిగతా 5వ పేజీలో...

డాగ్‌షెడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయండి

- నగర మేయర్ గుండు సుధారాణి
- చింతగట్టులోని ఏబీసీ సెంటర్ అకస్మిక తనిఖీ



డాగ్ షెడ్డు పరిశీలిస్తున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భీమారంలోని అదనపు డాగ్ షెడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. వరంగల్ నగర పాలక సంస్థ పరిధి చింతగట్టులో నడుస్తున్న ఏబీసీ (ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్)ను అకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అదనంగా నిర్మిస్తున్న షెడ్డు పనులను పరిశీలించి మేయర్ మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న షెడ్డుతో పాటు అదనంగా మరో షెడ్డును నిర్మిస్తే మరో 20 వీధి కుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేయవచ్చని అన్నారు. వేసవి నేపథ్యంలో కుక్కలలో ఉద్రిక్తత పెరుగుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వేసవి అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు సోలాల్ ప్యానల్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. షెడ్డు ఆవరణలో పండ్ల మొక్కలు, గ్రీనరీ ఏర్పాటు చేయాలన్నారు. వేసవిలో వీధికుక్కల దాహం తీర్చేందుకు నగరంలో 300చోట్ల నీటితొట్టిలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, బల్దియా వెటర్నరి అధికారి డాక్టర్ గోపాల్‌రావు, ఈఈ సంతోష్‌బాబు, డీఈ రవికిరణ్, ఏఈ సతీష్ పాల్గొన్నారు.

వీధి కుక్కలతో తస్మాత్ జాగ్రత్త..

వేసవికాలంలో వీధి కుక్కలకకోపం ఎక్కువగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బల్దియా అధికారులు సూచిస్తున్నారు. ఇటీవల నగరంతో పాటు విలీనగ్రామాల్లో వీధి కుక్కల దాడులు ఎక్కువ కావడంతో గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించేందుకు గురువారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. వరంగల్ నగరంలో ఎక్కడైనా వీధి కుక్కలతో ఇబ్బంది ఏర్పడితే 1800 425 1980, 9701999701 సెల్‌నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని బల్దియా అధికారులు కోరారు.

నర్సరీ భూములకు ముళ్లకంచెలు పెట్టండి..

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



ఎల్లాపూర్ నర్సరీని పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర పరిధిలో ఉన్న నర్సరీ భూములు ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు చుట్టూ ముళ్ల కంచెలను ఏర్పాటు చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. బల్దియా పరిధిలోని ఎల్లాపూర్‌లో నిర్వహిస్తున్న నర్సరీని కమిషనర్‌తోపాటు హార్టికల్చర్ అధికారులు గురువారం సందర్శించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడారు. వనమహోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని నగర పరిధిలోని 12నర్సరీలలో 10 లక్షల మొక్కలను లక్ష్యంగా చేసుకుని పెంచుతున్నామని అన్నారు. అయితే ఎక్కువగా పూలు, పండ్ల జాతి మొక్కలు ఎక్కువగా పెంచాలని అక్కడి అధికారులను కమిషనర్ ఆదేశించారు. పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు ప్రతీరోజు మూడుపూటలా నీళ్లు అందించి కాపాడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోవాలి..

- రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుంది..
- మీడియా సమావేశంలో మల్టీజోన్ -1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి
- 14 మంది చత్తీస్‌గఢ్ మావోయిస్టుల లొంగుబాటు
- ఒక్కొక్కరికి రూ.25వేల నగదు రివార్డు అందజేత

5



సమావేశంలో మాట్లాడుతున్న మల్టీ జోన్ -1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, వెనుక లొంగిపోయిన చత్తీస్‌గఢ్‌కు చెందిన నక్సలైట్లు

'భూ భారతి'తో భూ సమస్యలకు పరిష్కారం

హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

కమలాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంతో వివిధ రకాల భూ సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య చెప్పారు. గురువారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాలులో భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. భూసమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. పొజిషన్, విస్తీరణం, భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు సర్వే స్కెచ్ అంశం కొత్త చట్టంలో ఉందన్నారు. భూ సమస్యలు, రికార్డుల్లో తప్పులను తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ స్థాయిల్లో సవరించుకునే అవకాశాన్ని భూభారతి చట్టం కల్పించిందన్నారు. సాదా బైనామా దరఖాస్తులపై ఆర్డీవో విచారించి, పంచనామా చేసిన అనంతరం పట్టాలు ఇస్తారన్నారు. విరాసత్ అనేది 30రోజుల్లో తహసీల్దార్ చేయాలని చట్టంలో ఉందన్నారు. భూములకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్, సీసీఎల్ఏ స్థాయిల్లో తెలియజేయవచ్చని పేర్కొన్నారు. పది రోజుల్లో ప్రారంభం కానున్న భూ భారతి సమస్యలపై దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. దరఖాస్తులను విచారించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సదస్సుకు హాజరైన ప్రతి ఒక్కరూ చట్టంలోని అంశాలను తమ గ్రామాల్లోని రైతులు, ప్రజలకు తెలియజేయాలన్నారు.



కమలాపూర్‌లో రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

ఈ అవగాహన సదస్సులో ముందుగా భూ భారతి చట్టానికి సంబంధించిన మార్గదర్శకాలు గురించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రదర్శించారు. చట్టంలోని మార్గదర్శకాలను ఆర్డీవో రమేష్ రాథోడ్ చదివి వినిపించారు. భూ భారతి చట్టంలోని అంశాలను ముద్రించిన కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా భూ సమస్యలను మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు కలెక్టర్, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రూస్సీరాణి, తహసీల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీవో బాబు, పీఏసీఎస్ చైర్మన్ సంపత్ రావు, వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్, పలువురు అధికారులతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను బహిష్కరించాలి

- జిల్లాను ఆరు ముక్కలు చేసిన దొంగల ముఠా అది
- మేం గేట్లు తెరిస్తే బీఆర్ఎస్‌లో మిగిలేది ఆ ముగ్గురే..
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- కాజీపేటలో సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన

కాజీపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేసిన దొంగల ముఠా నిర్వహిస్తున్న రజతోత్సవ సభను బహిష్కరించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి బీఆర్ఎస్ రజతోత్సవ సభను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సోమిడి రోడ్డులో రూ.10 లక్షలలో ఏర్పాటుకానున్న సెంట్రల్ లైటింగ్ పనులకు గురువారం శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన కాజీపేట మీడియా పాయింట్‌లో మాట్లాడారు. వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేసి ఇక్కడ ముఖం లేకనే ఎల్కతుర్తిలో విజయోత్సవ సభను నిర్వహిస్తున్నారని, అసలు ఎల్కతుర్తిలో జరిగేది బీఆర్ఎస్ విజయోత్సవమా? టీఆర్ఎస్ విజయోత్సవమా? అనేది ప్రజలకు చెప్పాలన్నారు. జిల్లాను ఆరు ముక్కలు చేసిన దొంగల ముఠాకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని, మేం గేట్లు తెరిస్తే బీఆర్ఎస్‌లో మిగిలేది ముగ్గురేనని కేసీఆర్, కేటీఆర్, కవితను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎల్కతుర్తిలో సభ కోసం రైతుల భూములు తీసుకుని హద్దులు చెరిపి వారికి తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. 10 ఏళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కాజీపేటను అభివృద్ధి చేయకుండా తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందన్నారు. పదేళ్లలో చేయలేని పనులను 16 నెలల్లో చేశామని పేర్కొన్నారు. కాజీపేట ఆర్వోబీ, బస్టాండ్ త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండి కాంగ్రెస్ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి చిత్రహింసలకు గురి చేశారని అన్నారు. వినయ్‌భాస్కర్ అధికారంలో ఉండి హనుమకొండ, వరంగల్‌ను ఏ మాత్రం అభివృద్ధి చేయలేదన్నారు. మేడే రోజున కాజీపేటలో హమాలీ, ఎలక్ట్రిక్ సంఘాల భవనాలకు మంజూరు పత్రాలను అందజేస్తామన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

అనంతరం కాజీపేట ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, ఎండీ.అంకూస్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల రమాకాంత్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు గుంటి కుమార్, సుంచు అశోక్, నాయకులు అంజి, అజ్గర్, అరూరి సాంబయ్య, సిరిల్ లారెన్స్, మాచర్ల జయాకర్, పాక ఓంప్రకాశ్, పోగుల శ్రీనివాస్, రంగు సుధీర్, రాంకీ, నీలక్క, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ తీర్థాల సత్యనారాయణ

ఆంధ్రజ్యోతి : మీ పరిధిలో ఎన్ని పోలీస్‌స్టేషన్‌లు ఉన్నాయి ? ట్రైసిటీలో ట్రాఫిక్ పోలీసుల హద్దులు ఎక్కడి వరకు ?

ఏసీపీ : వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ పరిధిలో హనుమకొండ, వరంగల్, కాజీపేట ట్రాఫిక్ పీఎస్‌లు ఉన్నాయి. కాజీపేట పీఎస్ పరిధిలో కడిపికొండ బ్రిడ్జి వరకు, వరంగల్ పీఎస్ పరిధిలో ఖమ్మం రోడ్డులో ఆర్‌టీఏ జంక్షన్, నర్సంపేట రోడ్డులో తెలంగాణ జంక్షన్, హనుమకొండ పీఎస్ పరిధిలో కరీంనగర్ రోడ్డులోని ఎర్రగట్టుగుట్ట క్రాస్, ములుగురోడ్డులో పెద్దమ్మగడ్డ క్రాస్ వరకు ట్రాఫిక్ పోలీసుల పరిధిలోకి వస్తాయి.

ఆంధ్రజ్యోతి : ట్రైసిటీ పరిధిలో ఎన్ని ట్రాఫిక్ పాయింట్స్ ఉన్నాయి ? ఎన్ని పాయింట్లలో సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు ?

ఏసీపీ : మూడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 18 సిగ్నల్ పాయింట్లు ఉన్నాయి. సిగ్నల్ పాయింట్ల వద్దనే కాకుండా ఇంకా 41 చోట్ల ట్రాఫిక్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తుంటారు.

ఆంధ్రజ్యోతి : ట్రైసిటీలో ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్స్ ఇంకా ఎక్కడైనా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందా ?

ఏసీపీ : ఆరు ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఆరులో ప్రధానంగా న్యూశాయంపేట జంక్షన్, వడ్డేపల్లి చర్చి వద్ద సత్వరమే ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్, మున్సిపల్ అధికారులకు నివేదించాం. మిగతా నాలుగు మడికొండ జంక్షన్, తెలంగాణ జంక్షన్, కేఎల్ఎన్ రెడ్డి కాలనీ, ఆర్‌టీఏ జంక్షన్‌లో సిగ్నల్స్ అవసరం ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి : జనవరి నుంచి ఇప్పటి వరకు ఎన్ని డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. జైలు శిక్షకు గురైన వారు, విధించిన జరిమానా ఎంత ?

ఏసీపీ : 3 పీఎస్‌ల పరిధిలో 6,049 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశాం. రూ.60,63,073 జరిమానా విధించాం. 71 మంది జైలు శిక్షకు గురికాగా, 162 మంది సామాజిక సేవా శిక్షకు గురికాగా 59 మంది మైనర్లను అబ్జర్వేషన్ హోమ్‌కు తరలించాం.

ఆంధ్రజ్యోతి : మైనర్లు, డ్రైవింగ్ లైసెన్స్ లేని యువకులు రోడ్లపై ఇష్టానుసారంగా చేస్తున్న డ్రైవింగ్‌ను ఎలా నిలువరిస్తున్నారు ?

ఏసీపీ : మైనర్లు పట్టుబడగానే అబ్జర్వేషన్ హోమ్‌కు తరలించి వాహనాన్ని సీజ్ చేసి తల్లితండ్రులపై కేసులు నమోదు చేసి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తులకు వాహనం ఇచ్చిన వారికి సైతం జరిమానా విధిస్తూ హెచ్చరిస్తున్నాం.

- వరంగల్ క్రైం, (ఆంధ్రజ్యోతి)

మార్కెట్ వేళల్లో మార్పులు

ప్రతీ బుధవారం మార్కెట్ యార్డు బంద్

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వేసవి ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో గుమస్తా సంఘం కోరిక మేరకు సరుకుల బీటు సమయాల్లో మార్పులు, అలాగే ఇకపై ప్రతీ బుధవారం యార్కెట్ యార్డు బంద్‌కు వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ గురువారం పిలుపునిచ్చింది. ఈ నెల 28 (సోమవారం) నుంచి జూన్ 11వ తేదీ వరకు మార్కెట్ బీటు సమయాల్లో ఈ విధంగా మార్పులు చేశారు.

- మిర్చి బీటు : ఉదయం 7.05 గంటలకు..
- పత్తి బీటు : ఉదయం 8.05 గంటలకు..
- పల్లికాయ బీటు : ఉదయం 8.30 గంటలకు..
- అపరాలు, ధాన్యం బీటు : ఉదయం 8.45 గంటలకు.. మార్పు జరిగింది.

అలాగే ఈ నెల 30 (బుధవారం) నుంచి జూన్ 11వ తేదీ వరకు ప్రతీ బుధవారం మార్కెట్ యార్డుకు బంద్ ప్రకటించినట్లు, అడ్తిదారులు, ఖరీదుదారులు ఈ విషయాన్ని గమనించి పాటించాలని చాంబర్ ప్రతినిధులు కోరారు.

క్రీడలకు సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట

- క్రీడలతో శరీర ధృఢత్వం పెంపొందుతుంది..
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి
- ప్రారంభమైన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టాలెంట్ హంట్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడాకారులను ప్రోత్సహించడానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయించి క్రీడలకు పెద్దపీట వేస్తున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ జేఎన్ఎస్‌లోని హ్యాండ్‌బాల్ కోర్టులో నాయిని విశాల్‌రెడ్డి మెమోరియల్ 7వ తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్-15 బాలబాలికల హ్యాండ్‌బాల్ టాలెంట్ హంట్ క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడా పోటీలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిత్యం క్రీడల్లో పాల్గొనం ద్వారా శరీర ధృడత్వం పెంపొందడంతో పాటు ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపొచ్చన్నారు. వేల కోట్ల రూపాయలు ఉండి అనారోగ్యం బారిన పడిన వారికంటే ఆరోగ్యవంతులే మేలని, అది క్రీడల్లో పాల్గొనడం ద్వారానే సాధ్యం అవుతుందన్నారు. అదేవిధంగా క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడం ద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ నిస్వార్థంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి,



క్రీడా పోటీల ప్రారంభంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని

వారిని ప్రోత్సహించడానికి ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. పవన్‌కుమార్ స్ఫూర్తితోనే క్రీడాకారులు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే హితవు పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హ్యాండ్‌బాల్ ఆడి క్రీడాకారుల్లో నూతన ఉత్తేజాన్ని నింపారు.

తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న హ్యాండ్‌బాల్ టాలెంట్ హంట్ టోర్నీలో ఉమ్మడి పది జిల్లాల నుంచి 18బాలుర జట్లు, 9బాలికల జట్లతో పాటు 50మంది రెఫరీలు, కోచ్‌లు పాల్గొన్నారన్నారు. రాష్ట్ర స్థాయి టాలెంట్ హంట్ టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ కనిబర్చిన క్రీడాకారులను గుర్తించి వేసవి కాలం ముగిసిన తరువాత ప్రత్యేక క్యాంపునకు ఎంపిక చేసి, నిష్ణాతులైన కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణా శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. ఎండ వేడిమి కారణంగా గతంలో కంటే ఈ టోర్నీలో జట్లు తక్కువగా పాల్గొన్నాయన్నారు. ఇందులో పాల్గొన్న క్రీడాకారులకు భోజన, బస వసతులను ఏర్పాటు చేయడంతో పాటు మండుతున్న ఎండల కారణంగా రాత్రి వేళల్లో ఫ్లడ్‌లైట్ల వెలుతుర్ల నడుమ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమం ముందు కశ్మీర్‌లో ఉగ్రవాదులు దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకులకు, దివంగత నాయిని విశాల్‌రెడ్డి ఆత్మలకు శాంతి చేకూరాలని అతిథులు, క్రీడాకారులు శ్రద్ధాంజలి ఘటించారు.

ఈ కార్యక్రమంలో 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, హనుమకొండ, వరంగల్ జిల్లాల డీవైఎస్‌వోలు అశోక్‌కుమార్, సత్యవాణి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు నగరబోయిన సాంబశివరావు, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బైరబోయిన కైలాస్‌యాదవ్, వివిధ జిల్లాల హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, రెఫరీస్, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

25 ఏళ్లలో మహాశక్తిగా ఎదిగిన బీఆర్ఎస్

జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ▸ బీఆర్ఎస్ నేత రాకేష్‌రెడ్డి రూపొందించిన పాటల సీడీ ఆవిష్కరణ



పాటల సీడీని ఆవిష్కరిస్తున్న కవిత, రాకేష్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): 25 ఏళ్ల తెలంగాణ ఉద్యమంలో అన్ని శక్తులను తట్టుకొని నిలబడి మహాశక్తిగా బీఆర్ఎస్ ఎదిగిందని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. పార్టీ ప్రస్థానంలో కవులు, కళాకారులు చేసిన కృషి ఎంతో ఉన్నతమైందన్నారు. గురువారం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి రూపొందించిన 'ఎగిసెర భలే ఎగిసెర.. సారే రావాలంటూ ఓరుగల్లు పిలిచెరా..' అంటూ రిటైర్డ్ తహసీల్దార్ మహ్మద్ సిరాజొద్దీన్ రచించిన పాటల సీడీని పద్మశ్రీ గడ్డం సమ్మయ్యతో కలిసి కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్ సార్ ప్రస్తావన లేకుండా తెలంగాణ ఉండదని అన్నారు. టీఆర్ఎస్ ఏర్పడక ముందు తెలంగాణ యాస, భాషలో మాట్లాడలేని పరిస్థితులు ఉండేవని, కేసీఆర్ టీఆర్ఎస్ పార్టీ పెట్టి తెలంగాణ యాసలో మాట్లాడారని గుర్తు చేశారు. 14 ఏళ్ల పోరాటంలో, 10 ఏళ్ల పాలనలో తెలంగాణ భావజాలాన్ని బతికించిన నేత కేసీఆర్ అన్నారు. 25 ఏళ్ల బీఆర్ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు.

ఏనుగుల రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. వంద ప్రసంగాల సారాన్ని ఒక్క పాట చెబుతుందని అన్నారు. ఎంతోమంది కళాకారులు సభ విజయవంతం కోసం ఎన్నో పాటలు రూపొందిస్తున్నారని అన్నారు. పద్మశ్రీ గడ్డం సమ్మయ్య మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రం సాధించిన తర్వాత కళలకు పూర్వవైభవం వచ్చిందన్నారు. ఈ సందర్భంగా కవులు, కళాకారులను ఎమ్మెల్సీ కవిత శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సోదా కిరణ్, తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్, రజినీ సాయిచంద్, మానుకోట ప్రసాద్, కవులు, కళాకారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి కేయూ ఎస్డీఎల్‌సీఈ సైకాలజీ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కేయూ దూరవిద్య కేంద్రం అందిస్తున్న ఎంఎస్సీ సైకాలజీ మొదటి ఏడాది ఎక్స్ క్యాండిడేట్స్ ఇయర్‌వైజ్ పరీక్షలు, ఎంఎస్సీ సైకాలజీ ఫైనల్ ఇయర్ ఏప్రిల్ 28 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ కట్ల, కేయూ ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్‌ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పద్మజలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 28, 30, మే 2, 5వ తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. అలాగే 12, 13 తేదీల్లో ఉదయం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రాక్టికల్స్ పరీక్షలను నిర్వహిస్తామని షెడ్యూల్‌లో వెల్లడించారు. ఎంఎస్సీ ఫైనల్ ఇయర్ సైకాలజీ అభ్యర్థులకు ఏప్రిల్ 6 నుంచి 11వ తేదీ వరకు 10 నుంచి 1 వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు రెండు దఫాలుగా ప్రాక్టీకల్స్ పరీక్షలుంటాయని వివరించారు.

డిప్లొమా ఇన్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ పరీక్షలు

ఏప్రిల్ 24, 26, 28, తేదీల్లో కేయూ దూరవిద్య కేంద్రం డిప్లొమా ఇన్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ కోర్సుల పరీక్షలు జరుగుతాయని పరీక్షల నియంత్రణాధికారులు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఏప్రిల్ 29, 30 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోజుకు రెండు దఫాలుగా ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులందరూ గమనిచాలని కోరారు.

భవిష్యత్ కార్యాచరణపై సమీక్ష

రాంనగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాబోయే 5 నుంచి 10 ఏళ్ల కాలానికి సంబంధించిన కార్యాచరణపై టాన్స్‌కో, ఎన్పీడీసీఎల్ డైరెక్టర్స్, సీఈలతో సీఎండీ గురువారం నక్కలగుట్టలోని కార్పొరేట్ భవన్‌లో సమీక్ష నిర్వహించారు. రాబోయే కాలానికి అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించడానికి సమాయత్తం కావాలన్నారు. టాన్స్‌కో పరిధిలో కొత్తగా కరీంనగర్, మంచిర్యాల, జగిత్యాల, సిరిసిల్ల పరిధిలో లోడ్‌కు అనుగుణంగా కొత్తగా 132 బై 33 కేవీ సబ్‌స్టేషన్‌ల నిర్మాణానికి ఆవశ్యకత ఉందన్నారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లలో కొత్తగా కావాల్సిన సబ్‌స్టేషన్‌ల కోసం వివరణాత్మక నివేదిక అందజేయాలన్నారు. ఆసిఫాబాద్‌లోని కౌటాలలో 132బై 33 కేవీ సబ్‌స్టేషన్‌కు అనుమతి ఇచ్చామని, త్వరలోనే అందుబాటులోకి వస్తుందన్నారు. ఎల్సీ యాప్ టౌన్‌లలో చేపడుతున్నారని ఇంకా విస్తరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ కోడైరెక్టర్ జగత్‌రెడ్డి, ఎన్పీడీసీఎల్ డైరెక్టర్స్, టాన్స్‌కో, డిస్కం సీఈలు పాల్గొన్నారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి



ప్రసాద్ (ఫైల్)

జనగామ రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బతో వృద్ధుడు మృతి చెందిన సంఘటన జనగామలో గురువారం చోటు చేసుకుంది. గుండ్లగడ్డకు చెందిన అలిసెరి ప్రసాద్(63) చెప్పులు కుట్టుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. బాణాపురంలో నివాసం ఉంటున్న కుమారుడి వద్దకు ప్రసాద్ నడుచుకుంటూ వెళ్తుండగా ఎండ తీవ్రతకు కింద పడిపోయాడు. స్థానికులు జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ప్రసాద్ మృతి చెందాడని వైద్యులు పేర్కొన్నారు.

సమన్వయంతోనే శాస్త్రీయ ఆవిష్కరణలు

- సాక్ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాసాచార్య
- వరంగల్ నిట్‌లో జీవ విజ్ఞాన ఎక్స్‌పో

హనుమకొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : వివిధ శాఖల మధ్య సమన్వయంతోనే శాస్త్రీయ ఆవిష్కరణలు సాధ్యమవుతాయని వరంగల్ నిట్ విద్యార్థుల సంక్షేమ డీన్ డి.శ్రీనివాసాచార్య అన్నారు. గురువారం వరంగల్ ఎన్ఐటీలో ప్రపంచ డీఎన్ఏ దినోత్సవాన్ని పురస్కరించుకొని సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీ (సీఆర్ఐఎఫ్) ఆధ్వర్యంలో థెర్మోఫిషర్ సైంటిఫిక్ సహకారంతో ఏర్పాటు రేసిన జీవ విజ్ఞాన పరికరాల టెక్నాలజీ ఎక్స్‌పోను ప్రొఫెసర్ శ్రీనివాసాచార్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆవిష్కరణలను వేగవంతం చేయడంలో ఆధునిక పరిశోధనా పరికరాలు ఎంతో దోహదపడతాయన్నారు. వాటి ప్రాధాన్యతను ఎప్పటికప్పుడు గుర్తించాలని చెప్పారు. బయోటెక్నాలజీ, బయోమెడికల్ ఇంజనీరింగ్, అంతర్ శాఖల్లో ఉన్నత స్థాయి పరిశోధనలకు ఈ పరికరాలు కీలకభూమిక పోషిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌డీ ఇన్‌చార్జి డీన్ ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాసరావు, ఐ-స్టెమ్ చైర్మన్ ప్రొఫెసర్ వీరేశ్‌బాబు, సీఆర్ఐఎఫ్ విభాగాధిపతి ప్రొఫెసర్ పివి శ్రీలక్ష్మి, కార్యక్రమ సమన్వయకర్త, సాంకేతిక అధికారి డి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఎక్స్‌పోలో జీవశాస్త్రం, అణుజీవ శాస్త్ర రంగాల్లో అత్యాధునిక పరికరాలను ఫ్లోసైటో మీటర్లు, పీసీఆర్ వ్యవస్థలు, మల్టీమోడ్ రీడర్లు, ఫ్లోరసెన్స్, క్వాంటిఫికేషన్ వస్తువులపై ప్రత్యక్ష డెమోలను నిర్వహించారు. అధ్యాపకులు, సాంకేతిక అధికారులు, సిబ్బంది, పరిశోధకులు ఎక్స్‌పోలో చురుకుగా పాల్గొని సాంకేతిక నిపుణులతో పరస్పర చర్యలు జరిపారు.



నిట్‌లో జీవ విజ్ఞాన పరికరాల టెక్నాలజీ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న డీన్ శ్రీనివాసాచార్య

ఇంగ్లిష్ బోధకులు నైపుణ్యాలను పెంచుకోవాలి

- ఎల్టీ కన్సల్టెంట్ ప్రొఫెసర్ రమా మాథ్యూ
- వరంగల్ నిట్‌లో క్రియాత్మక పరిశోధన కాన్‌క్లేవ్ షురూ



నిట్‌లో యాక్షన్ రీసెర్చ్ మెంటరింగ్ స్కీమ్ కాంక్లేవ్‌ను ప్రారంభిస్తున్న వరంగల్ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఉమామహేష్

హనుమకొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఇంగ్లిష్ భాషా బోధనలో అధ్యాపకులు నైపుణ్యాలను పెంచుకోవాలని, ఈ రంగంలో జరిగే క్రియాత్మక పరిశోధనలోనూ పాలుపంచుకోవాలని ఢిల్లీ విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్, ప్రఖ్యాత ఎల్టీ కన్సల్టెంట్ ప్రొఫెసర్ కూడా అయిన రమా మాథ్యూ పిలుపునిచ్చారు. వరంగల్ ఎన్ఐటీలో గురువారం యాక్షన్ రీసెర్చ్ మెంటరింగ్ స్కీమ్ కాంక్లేవ్ -2025 ఘనంగా ప్రారంభమైంది.

బ్రిటిష్ కౌన్సిల్ మద్దతుతో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) సహకారంతో ఈ కాంక్లేవ్‌ను నిట్‌లోని రామన్ హాల్‌లో తరగతి గదిలో బహుభాషాత్మకత అనే ఇతివృత్తంపై దీనిని నిర్వహిస్తున్నారు. నిట్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్‌వీ ఉమామహేష్ మాట్లాడుతూ.. ఇంగ్లిష్ ప్రధాన భాషగా ఉన్న విద్యా సంస్థల్లో బహుభాషా బోధన అవసరాన్ని వివరించారు. ఎల్టా అధ్యక్షుడు టి.వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. సంస్థ నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలను వివరించారు. బ్రిటిష్ కౌన్సిల్ సీనియర్ మేనేజర్, మిస్ జూడిత్ హెంబ్రోమ్ ఆన్‌లైన్‌లో పాల్గొని ఇటువంటి కాంక్లేవ్‌ల నిర్వహణకు వరంగల్ నిట్ వంటి సంస్థల సహకారం ఎంతో అవసరం అన్నారు. హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ కె.మాధవి ఈ కార్యక్రమానికి ప్రాజెక్ట్ హెడ్‌గా వ్యవహరిస్తున్నారు. ఇంగ్లిష్ భాషా బోధనలో ఇటువంటి కార్యక్రమాల ప్రాధాన్యత వివరించారు. ఈ రెండు రోజుల కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం అంతటి నుంచి వచ్చిన ఆంగ్ల ఉపాధ్యాయులు, ట్రైనీ టీచర్లు, పరిశోధకులు, విద్యార్థులు 110 మందికిపైగా పాల్గొన్నారు.

అత్యాచారయత్నం ఘటనలో వ్యక్తి అరెస్టు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగురాలైన వృద్ధురాలిపై అత్యాచారయత్నం చేసిన వ్యక్తిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ రమణమూర్తి తెలిపారు. సీఐ తెలిపిన వివరాలిలా వున్నాయి. మండలానికి చెందిన దివ్యాంగురాలైన వృద్ధురాలు ఈ నెల 22న అర్ధరాత్రి ఆరుబయట నిద్రిస్తుండగా, అదే గ్రామానికి చెందిన వేల్పుల ప్రవీణ్ అనే వ్యక్తి అత్యాచారయత్నానికి ఒడిగట్టాడు. బాధితురాలు కేకలు వేయడంతో నిందితుడు పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ప్రవీణ్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

బాలిక కిడ్నాప్, అత్యాచారం ?

నర్సంపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన సమీప బంధువైన బాలికను కిడ్నాప్‌చేసి అత్యాచారానికి పాల్పడినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి తనకు సమీప బంధువైన బాలికకు మాయమాటలు చెప్పి తనతో పాటు వేరే ఊరికి తీసుకెళ్లాడు. బాలిక తల్లిదండ్రులు విచారణ చేయగా తమ బంధువే తీసుకెళ్లాడని తెలియడంతో నర్సంపేట పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. బాలికను కిడ్నాప్ చేసిన విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. నేడో, రేపో బాలికను కిడ్నాప్ చేసిన వ్యక్తిని అరెస్టు చేసేందుకు పోలీసులు రంగం సిద్ధం చేసినట్లు తెలియవచ్చింది.

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం



హరిప్రసాద్‌ను సత్కరిస్తున్న ఆర్యభట్ట స్కూల్ యాజమాన్యం

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన సివిల్స్ ఫలితాల్లో ర్యాంకు సాధించిన ఆర్యభట్ట పూర్వ విద్యార్థి పోతరాజు హరిప్రసాద్‌ను పాఠశాల చైర్మన్ నరేష్ చంద్ర భరత్, ప్రిన్సిపాల్ వీణ భరత్‌లు సత్కరించారు. గురువారం హనుమకొండలోని పాఠశాలకు హరిప్రసాద్‌ను ఆహ్వానించి శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. హరిప్రసాద్ మొదటి నుంచి చదువులో చురుకుగా ఉండేవాడని నరేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో విక్రాంత్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనంపై వెళ్తూ.. గుండెపోటుతో ఒకరి మృతి



రాపాక యాకయ్య (ఫైల్)

సంగెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుండెనొప్పి రావడంతో అపస్మారక స్థితికి చేరుకుని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని తీగరాజుపల్లిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని మేచరాజుపల్లి గ్రామానికి చెందిన రాపాక యాకయ్య (45) వృత్తిరీత్యా కరీంనగర్ జిల్లాలో గ్రానైట్ కంపెనీలో టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల కుటుంబంతో సహ పెండ్లికి హాజరై ఇనుగుర్తిలో తన అత్తగారి ఇంటి నుంచి బైక్‌పై కరీంనగర్‌కు బయలుదేరి వెళ్తున్నాడు. ఈ తరుణంలో మార్గంమధ్యలో ఓ వ్యక్తి లిఫ్ట్ అడిగి ఎక్కించుకోగా, అతడే బండి నడిపాడు. ఈ క్రమంలో తీగరాజుపల్లి వద్ద ఆరోగ్యం ఎలాగో ఉందంటూ ద్విచక్ర వాహనాన్ని ఆపాలని యాకయ్య కోరాడు. బండిని పక్కకు ఆపిన కొద్ది నిమిషాల్లోనే యాకయ్య అపస్మారక స్థితికి చేరుకోగా, చేతిలో తాళాలు, పెట్టి సీపీఆర్ చేశారు. కానీ అప్పటికే యాకయ్య మృతిచెందడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. భార్య రాపాక మంజుల వచ్చి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రికార్డు ధర పలికిన పత్తి

క్వింటాల్‌కు రూ.7,700

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పత్తి రికార్డు ధర నమోదైంది. పత్తి క్వింటాల్‌కు రూ.7,700లు అత్యధిక ధర పలికింది. ఈ సీజన్‌లో రూ. 7,700లు రికార్డు ధరగా చెప్పొచ్చు. పత్తి క్వింటాల్‌కు రూ.7,700లు పలుకడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సీజన్ మొత్తంలో రూ, 6500 నుంచి రూ.7,200 వరకు మాత్రమే చేరుకుంది. కేవలం ఈ పది రోజులలో పెరుగుతూ వచ్చి రూ.7,700లకు చేరుకుంది. కాగా ఇప్పటివరకు సుమారు 90శాతానికిపైగా రైతులు పత్తి పూర్తి స్థాయిలో అమ్ముకున్నారు. అత్యధిక ధర పలికినప్పటికీ ఇది కేవలం వ్యాపారస్థులకు మాత్రమే కలిసివచ్చే అంశంగా ఉంది. పత్తి అమ్మే సమయంలో ఈ ధర లభిస్తే బాగుండేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో.. 'సంస్థాగత' సందడి

(3వ పేజీ తరువాయి)

రాకపోతాయా అనే ఆశతో పదవుల పందేరంలోకి దిగుతున్నారు. ఇదిలా ఉంటే మారిన పరిస్థితుల దృష్ట్యా 2017 తర్వాత పార్టీలో చేరిన వారిలో కూడా చాలామంది తమకున్న పలుకుబడిని ఉపయోగించి పదవులు పొందేందుకు ప్రయత్నాలు చేస్తుండగా.. అధిష్ఠానం పెట్టిన నిబంధనలతో కొత్త వారి ఆశలు నెరవేరే పరిస్థితి లేదన్న చర్చ జరుగుతోంది.

జిల్లా అధ్యక్ష పదవులపై ఉత్కంఠ

కాంగ్రెస్ పార్టీలో మండల, బ్లాక్, జిల్లా అధ్యక్ష పదవులపై నేతల్లో పోటాపోటీ నెలకొంది. అయితే ప్రధానంగా జిల్లా అధ్యక్ష పదవులు ఎవరికి దక్కుతాయనే ఉత్కంఠ క్యాడర్‌లో నెలకొంది. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికలోనూ డీసీసీ సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షినటరాజన్ గాంధీభవన్‌లో పేర్కొనటంతో అందరి దృష్టి డీసీసీ కమిటీలపై పడింది. దీంతో కొందరు నేతలు తమ వారసులను డీసీసీ పీఠాలపై కూర్చోపెట్టేందుకు ప్రయత్నాలు కూడా చేస్తుండటం రాజకీయాలు ఆసక్తికరంగా మారగా, 2017 నిబంధన కూడా మరికొందరికి ఇబ్బందికరంగా మారే పరిస్థితి ఉందనే చర్చ జరుగుతోంది. మొత్తంగా కాంగ్రెస్ పదవుల పందేరంలో ఎవరికి ఏ పదవి దక్కుతుందో అనే ఉత్కంఠ క్యాడర్‌లో నెలకొంది.

● భూపాలపల్లి జిల్లా అధ్యక్ష పదవిని పీసీసీ అధికార ప్రతినిధిగా ఉన్న గాజర్ల అశోక్ ఆశిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే నుంచి కూడా హామీ ఉందనే చర్చ జరిగింది. అయితే అశోక్ 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరి, పరకాల అసెంబ్లీ టికెట్ ఆశించారు. దీంతో 2017 నుంచి పార్టీలో ఉన్నవాళ్లకు ప్రాధాన్యం ఇవ్వాల్సి వస్తే.. ఇతర పేర్లు తెరపైకి వస్తున్నాయనే చర్చ ఉంది.

● జనగామ డీసీసీ పీఠాన్ని పాలకుర్తి ఎమ్మెల్యే అత్త మామిండ్ల ఝాన్సీరెడ్డి ఆశించారు. అయితే ఝాన్సీరెడ్డి కూడా 2023 ఎన్నికల ముందే క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చారు. దీంతో ఇక్కడ మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుమారుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి పేరు తెరపైకి వస్తోంది. దీంతో ఝాన్సీరెడ్డికి జడ్పీ చైర్‌పర్సన్‌పై అధిష్ఠానం హామీ ఇవ్వాల్సి వస్తుందనే చర్చ జరుగుతోంది. తన వారసుడిని రాజకీయాల్లోకి తీసుకవచ్చేందుకు కొమ్మూరికి కూడా ఇదే అవకాశమని, ఇప్పటికే క్రియాశీలకంగా ఉన్న ప్రశాంత్‌రెడ్డికి డీసీసీ పగ్గాలు అప్పగిస్తారనే చర్చ మొదలైంది.

● ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవిపై మంత్రి సీతక్క కుమారుడు సూర్య పేరు వినిపిస్తుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పినపాక అసెంబ్లీ స్థానం నుంచి పోటీకి గ్రౌండ్ సిద్ధం చేసుకోగా.. అయితే పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి రావటంతో ఆయన అనుచరులకు టికెట్ ఇవ్వాల్సి రావటంతో సూర్యకు అవకాశం రాలేదు. ఈ నేపథ్యంలో డీసీసీ పీఠంపై సూర్యను కూర్చోపెట్టాలని మంత్రి ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. ఒకవేళ సూర్య కాదంటే ప్రస్తుత అధ్యక్షుడిని కొనసాగించటమా లేక సీనియర్ నేత గొల్లపల్లి రాజేందర్‌కు ఇవ్వటమా లేక మరెవరికైనా ఇవ్వటమా అనేది మంత్రి సీతక్క చేతిలో ఉందనే చర్చ జరుగుతోంది.

● మహబూబాబాద్ జిల్లా నుంచి పలువురు కీలక నేతలు పోటీ పడుతున్నా.. ఓసీ వర్గం నుంచే అధ్యక్షుడిని చేసే ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్టు సమాచారం. ఈ జిల్లాలో నలుగురైదుగురు డీసీసీ పీఠంపై ఆశతో ఉన్నారు. అయితే స్థానిక ఎమ్మెల్యేలతో పాటు సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి ఆశీస్సులు ఉన్నవారికే పీఠం దక్కే ఛాన్స్ ఉందనేది సమాచారం.

● వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్ష పదవుల కోసం డజను మందికి పైగా ఆశావాహులున్నారు. వీరిలో చాలామంది రెండు దశాబ్దాల నుంచి పని చేస్తున్నవారు కూడా ఉన్నారు. వరంగల్‌జిల్లా డీసీసీ అధ్యక్ష పదవిపై ఉత్కంఠ నెలకొంది. మంత్రి కొండా సురేఖతో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి రాజకీయంగా వైరం ఉంది. ఈ నేపథ్యంలో ఇద్దరికి ఆమోదయోగ్యమైన వ్యక్తిని అధ్యక్షుడిగా ఎంపిక చేయటం పీసీసీ పరిశీలకులకు కత్తిమీద సామే అనే చర్చ జరుగుతోంది. ఇక హనమకొండ జిల్లా కమిటీ అధ్యక్ష పీఠం ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ కూడా ఉంది. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తన అనుచరుడికి అధ్యక్ష పదవి ఇప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

మలేరియా తగ్గుముఖం

నేడు ప్రపంచ మలేరియా దినోత్సవం

- ఉమ్మడి జిల్లాలో రెండంకెల్లోకి కేసుల సంఖ్య
- ఆరోగ్య, పంచాయతీ, మున్సిపల్ శాఖల కృషి ఫలితం
- ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటికీ కాస్త ఎక్కువగానే వ్యాప్తి
- ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే శాశ్వత నిర్మూలన



హనుమకొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలో మలేరియా క్రమంగా తగ్గుముఖం పడుతోంది. గతంతో పోల్చితే ప్రస్తుతం ఈ మలేరియా పూర్తిగా అదుపులో ఉంది. డెంగ్యూ కేసులు కొంత మేరకు పెరుగుతున్నా మలేరియా విషయంలో విజయం సాధించినట్టేనని వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు చెబుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉంటే మలేరియాను పూర్తిగా నిర్మూలించడం సాధ్యమేనని అంటున్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని ఏటా ఏప్రిల్ 25న నిర్వహిస్తారు. మలేరియా నిర్మూలన, ప్రజలలో అవగాహన కలిపించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం. ప్రపంచ వ్యాప్తంగా 106 దేశాల్లో 3.3 మిలియన్ ప్రజలు మలేరియా బారిన పడుతున్నారు. 2007లో ప్రపంచ ఆరోగ్య సంస్థలోని సభ్య దేశాలన్నీ కలిసి ప్రపంచ మేలేరియా దినోత్సవాన్ని నిర్ణయించాయి. ఈ సంవత్సరం 2025 ప్రపంచ మలేరియా దినోత్సవం ఇతి వృత్తం.. మలేరియా మనతోనే అంతమవుతుంది. తిరిగి పెట్టుబడి పెట్టండి. తిరిగి ఊహించుకోండి. తిరిగి రగిలించండి. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో మలేరియా వ్యాప్తి, నమోదైన కేసులు, చికిత్స, నివారణకు తీసుకుంటున్న చర్యలపై కథనం.

తగ్గుతున్న మలేరియా కేసులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మలేరియా కేసులు నాలుగు సంవత్సరాలుగా క్రమంగా తగ్గుముఖం పడుతూ వస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతమైన ములుగు, అలాగే జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మాత్రం ఇప్పటికీ కాస్త ఎక్కువగానే నమోదు అవుతున్నాయి. హనుమకొండలో చాలా వరకు తగ్గిపోయాయి. 2030 నాటికి ఉమ్మడి జిల్లాలో మలేరియాను పూర్తిగా నిర్మూలించాలన్న లక్ష్యంతో వైద్య ఆరోగ్య శాఖ కృషి చేస్తోంది. ఈ మేరకు పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకుంటోంది. గతంలో మలేరియా కేసులు నమోదైన ఉమ్మడి జిల్లాలో వాటి సంఖ్య రెండంకెలకే పరిమితం కావడమే ఇందుకు ఉదాహరణ. హనుమకొండ జిల్లాలో 2022లో 26 మలేరియా కేసులు నమోదవగా.. 2023లో 12 కేసులు రికార్డయ్యాయి. 2024లో వాటి సంఖ్య నాలుగుకే పరిమితం అయింది. జనగామ జిల్లాలో 2022లో 7, 2023లో 4, 2024లో 6 కేసులు , మహబూబాబాద్ జిల్లాలో 2024లో 11 కేసులు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మలేరియా వ్యాప్తి కాస్త అధికంగానే ఉంది. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 10మలేరియా కేసులు నమోదయ్యాయి. వరంగల్ జిల్లాలో గతేడాది 3 మలేరియా కేసులు నమోదవగా ఉమ్మడి జిల్లాలో డెంగీ కేసులు మాత్రం ఏటా ఆందోళన కలిగించే స్థాయిలో నమోదు అవుతున్నాయి. గత సంవత్సరం మహబూబాబాద్ జిల్లాలో 419 కేసులు నమోదు అయ్యాయి. ఒక్క జనగామ జిల్లాలో 102 రికార్డయ్యాయి

ఏజెన్సీ ఏరియాలో..

ములుగు ఏజెన్సీ ప్రజలు ముఖ్యంగా గొత్తికోయ గూడెలలో ఏటా మలేరియా, డెంగీ పెద్ద ఎత్తున ప్రబలుతున్నాయి. అత్యధిక అటవీ ప్రాంతం ఉన్న ములుగు ఏజెన్సీలో సీజనల్ వ్యాధులు ప్రబలడం పరిపాటే. అయితే మండు వేసవిలో కూడా మలేరియా కేసులు నమోదు కావడం ఆందోళనకు కలిగిస్తోంది. తాడ్వాయి, కాటాపూర్, కొడిశాల, కన్నాయిగూడెం, వెంకటాపూర్, నాయినిగూడెం, పస్రా తదితర ప్రాంతాల్లో ఏటా ప్రబలడం సర్వసాధారణం. ఐలాపూర్, ఎడ్జర్లపల్లి, పెనుగోలు, రాపట్ల తదితర గ్రామాలు చిట్టచివరన ఉంటాయి. ఇక్కడికి వెళ్లడమే కష్టం. దీనితో ఈ ప్రాంతాల్లో ప్రబలిన మలేరియా, డెంగీ కేసులు ఆలస్యంగా వెలుగుచూస్తుంటాయి.

వర్షాకాలం వచ్చిందంటే..

వర్షాకాలం వచ్చిందంటే దోమలు, నీటి సంబంధిత కారణాల వ్యాధులు వ్యాపిస్తుంటాయి. మలేరియా, డయేరియా, డెంగీ, టైఫాయిడ్ తదితర జబ్బుల బారిన పడడం ఏటా జరుగుతూనే ఉంది. మలేరియాకు దోమలే ప్రధాన కారణమైనా వాటి పగడ్బందీ నిర్మూలనకు తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు నిల్వ ఉండే చోట దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్నా, అక్కడ పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉన్నా పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖలు పెద్దగా పట్టించుకోవడం లేదు. మలేరియా దోమకాటు వల్ల సోకుతుంది. మలేరియా ప్లాస్మోడియం జాతికి చెందిన ఏకకణ పరాన్న జీవి వల్ల కలిగే వ్యాధి. ఈ పరాన్న జీవి సోకిన దోమల కాటు ద్వారా మానవులకు వ్యాపిస్తుంది. మలేరియా ఉన్నవారు సాధారణంగా అధిక జ్వరం, చలితో వణుకుతూ చాలా అనారోగ్యంగా బాధపడుతుంటారు. మలేరియా సోకినవారిలో శ్వాస, హృదయ స్పందనలు కూడా ఎక్కువగా ఉంటాయి. చికిత్స ఆలస్యమైతే మలేరియా తీవ్రమై రక్తహీనత, సెరిబ్రల్ మలేరియా, కోమా, లేదా మరణం లాంటి తీవ్రమైన సమస్యలు సంభవించవచ్చు. అందుకే దోమకాటుకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటే మలేరియాకు దూరంగా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు. పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమని, దీనిపై అవగాహన పెంచుకోవాల్సి అవసరం ఉందని సూచిస్తున్నారు.

మలేరియా నిర్మూలనకు విస్తృత చర్యలు

డాక్టర్ మదన్ మోహన్‌రావు, అదనపు జిల్లా వైద్యశాఖాధికారి, హనుమకొండ



మలేరియా నిర్మూలనకు ప్రణాళికా బద్ధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అందువల్లే గతం కన్నా కేసుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ములుగు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో వ్యాప్తి కాస్త ఎక్కువగానే ఉన్నా మిగతా జిల్లాలో అంతగా లేవు. హనుమకొండ జిల్లానే తీసుకుంటే గతేడాది పట్టణ గ్రామీణ ప్రాంతాలను కలుపుకుంటే నమోదైన మలేరియా కేసులు నాలుగే. మిగతా జిల్లాల్లో కూడా ఇంచుమించు ఇదే పరిస్థితి ఉంది. 2030 నాటికి మలేరియా అంతమే లక్ష్యంతో పని చేస్తున్నాం. కేసులు తక్కువగా నమోదవతున్న జిల్లాల్లో ఉమ్మడి వరంగల్ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. మలేరియాను అరికట్టేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖతో పాటు పంచాయతీరాజ్, నగరపాలక సంస్థ, మున్సిపాలిటీలతో సమన్వయం చేసుకుంటూ సంయుక్త కార్యాచరణ అమలు చేస్తున్నాం. మరికొద్ది రోజుల్లో గతంలో మలేరియా, డెంగ్యూ కేసులు నమోదు ప్రాంతాల్లో అసిమ్టొమాటిక్ మలేరియా సర్వే నిర్వహించబోతున్నాం.

చిత్తశుద్ధి ఉంటే హామీలన్నీ నెరవేర్చాలి

- సభలో పల్లీలు, బఠానీలు అమ్ముకునేంత మంది లేరు కాంగ్రెస్‌లో..
- రాష్ట్ర ప్రజలకు బీఆర్‌ఎస్సే శ్రీరామ రక్ష
- జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కవిత
- ఎల్కతుర్తిలో రజతోత్సవ సభ ఏర్పాట్ల పరిశీలన


మీడియాతో మాట్లాడుతున్న కవిత, చిత్రంలో బీఆర్‌ఎస్ నేతలు

ఎల్కతుర్తి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఈనెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభ ఏర్పాట్లను ఆమె గురువారం పరిశీలించారు. సభ ప్రాంగణం, వేదిక, పార్కింగ్ స్థలాల వివరాలను అడిగి తెలుసుకున్న అనంతరం బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు బీఆర్‌ఎస్ నిత్యం శ్రీరామరక్షగా ఉంటుందని, తెలంగాణ సాధన కోసం కేసీఆర్ చేసిన పోరాట చరిత్రను నెమరవేసుకుంటూ 25 వసంతాల పండుగను జరుపుకోవడానికి ఎల్కతుర్తి వేదికైందన్నారు. 1969లో హింసతో అంతమైన ఉద్యమాన్ని, పిడికెడు మందిలో ఒకరైన ప్రొఫెసర్ జయశంకర్ సార్ లాంటి వారు కాపాడుతూ వచ్చిన ఉద్యమాన్ని ప్రజలకు పరిచయం చేసిన వ్యక్తి కేసీఆర్ అన్నారు. అస్తిత్వం అదృశ్యమై తెలంగాణ వాదులు సైతం ఉద్యమాన్ని మర్చిపోతున్న సమయంలో కేసీఆర్ పిడికిలి బిగించి రాష్ట్ర సాధనకు శ్రీకారం చుట్టి బయటకు వచ్చారని, తెలంగాణ యాస, భాష, పాట, పండుగలు, సంబరాలు, తెలంగాణ తల్లిని ప్రజలకు పరిచయం చేసి వారిలో స్ఫూర్తిని నింపడానికి 14 ఏళ్లు పట్టిందన్నారు. ఒక్క రక్తం చుక్క చిందించకుండా తెలంగాణ సాధిస్తానని చెప్పి.. చేసి చూపారన్నారు. ఉద్యమ సమయంలో పుట్టిన పిల్లలు.. నేడు ఓటు హక్కును వినియోగించుకునే స్థాయికి ఎదిగారని, తెలంగాణ చరిత్ర తెలిసినోళ్లే భవిష్యత్తును తెలుసుకోగలుగుతారన్నారు. ఎల్కతుర్తిలో జరుపుకునే గులాబీ పండుగ తెలంగాణ యువతలో స్ఫూర్తి నింపనుందని, వరంగల్ గడ్డ ఎంతో పవిత్రమైందని, జాతీయ స్థాయి నాయకులను కదిలించి తెలంగాణ ఉద్యమానికి మద్దతునిచ్చేలా చేసిందన్నారు.

అలాంటి ఓరుగల్లులో భాగమైన ఎల్కతుర్తిలో జరిగే చరిత్రలో మరో మైలురాయిగా నిలిచి పోనుందన్నారు. కుంభమేళా తరహాలో జరిగే ఈ సభకు కాంగ్రెస్ చేతిలో వంచనకు గురైన బిడ్డలు తరలి రావాలని పిలుపునిచ్చారు. తమ హయాంలో రైతులు గుండెలపై చేయి వేసుకుని నిద్రపోయే పరిస్థితిని కేసీఆర్ కల్పించారని, వరప్రదాయని అయిన కాళేశ్వరం ప్రాజెక్టును నిర్వీర్యం చేసి లక్షల ఎకరాలు ఎండ బెట్టి కాంగ్రెస్ రైతులను మోసగించిందని మండిపడ్డారు. వంచనకు గురైన రైతులు గులాబీ దండులా కదిలి కాంగ్రెస్ గుండెల్లో గుబులు పుట్టించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసాలకు గురికాని వారంటూలేరని.. కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలంటే కన్నబిడ్డలనే భావనే తప్ప ప్రజలు, ఓటర్లు అనే భావన ఉండదన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు మాత్రం ప్రజలను ఓటర్లుగానే భావిస్తారని సూచించారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకులు బీఆర్‌ఎస్ సభలో పల్లీలు, బఠానీలు అమ్ముకునేంత మంది ఉండరన్నారు. 2004లో గులాబీ కండువాతో పొత్తు పెట్టుకుని తెలంగాణ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ 14 ఏళ్ల ఆలస్యం చేసి వందలాది మంది చనిపోవడానికి కారణమైందని, తెలంగాణను ప్రేమతో ఇవ్వలేదని తప్పని పరిస్థితుల్లో ఇచ్చారని వ్యాఖ్యలు చేశారు. వారి కుట్రలను ఈ సభ ద్వారా ఎండగట్టాల్సిన అవసరం ఉందన్నారు. 16నెలల కాలంలోనే కాంగ్రెస్ మోసాలను ప్రజలు తెలుసుకున్నారన్నారని, మునిసిపాలిటీలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్, మార్కెట్ కమిటీల్లో ప్రవేశాలు కల్పించి చైర్మన్, వైస్ చైర్మన్లను చేసింది కేసీఆర్ ప్రభుత్వమేనన్నారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ, ఆడబిడ్డలకు 33 జిల్లాల పరిధిలో వసతి గృహలతో కూడిన డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేసింది కేసీఆరే అని, అలాగే మహిళలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఇంటింటికి అందజేశారని గుర్తుచేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లను సైతం మహిళ పేర రిజిస్ట్రేషన్ చేయించి అప్పగించి వారికి అండగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీలు తక్కళ్ళపెల్లి రవిందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బాలమల్లు, హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, రైతు విమోచన సమితి మాజీ చైర్మన్ నాగుర్ల వెంకన్న, రాష్ట్ర నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, పేర్యాల రవిందర్‌రావు, చింతం సదానందం, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మహిళా నాయకులతో కలిసి సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కవిత

మావోయిస్టులు లొంగిపోవాలి

రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుంది..

మల్టీజోన్ -1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

14 మంది ఛత్తీస్‌గఢ్ మావోయిస్టుల లొంగుబాటు

ఒక్కొక్కరికి రూ.25 వేల నగదు రివార్డు అందజేత


మీడియాతో మాట్లాడుతున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, సీపీ, ఎస్పీలు; చిత్రంలో రివార్డు అందుకున్న నక్సలైట్లు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసుల సమక్షంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితులై జనవరి నుంచి ఇప్పటి వరకు 250మంది మావోయిస్టులు లొంగిపోయారని, మిగతావారు కూడా వెంటనే లొంగిపోవాలని మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన 14 మంది మావోయిస్టులు గురువారం లొంగిపోయినట్లు తెలిపారు. గురువారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఐజీ వివరాలు వెల్లడించారు. రాష్ట్ర సరెండర్ పాలసీ నచ్చి 14 మంది లొంగిపోయారని, వారందరినీ జనజీవన స్రవంతిలోకి ఆహ్వానిస్తున్నామన్నారు. 14 మందిలో ఇద్దరు ఏరియా కమిటీ సభ్యులు, ఏడుగురు పార్టీ సభ్యులు, నలుగురు మిలిషీయా సభ్యులు, ఒక్కరు మిలిషీయా కమాండర్ ఉన్నాడన్నారు. పునరావాసం కింద ఏసీఎం ర్యాంకు వారికి ఒక్కొక్కరికి రూ.4 లక్షల రివార్డు, నలుగురు పార్టీ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.లక్ష అవార్డు, మిగతా సభ్యులకు ఒక్కొక్కరికి రూ.25 వేల అవార్డును అందజేస్తామన్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గాలికొండ ఏరియా కమిటీ మెంబర్ మడవి అంద ఆలియాస్ రాజేశ్, కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవికి చెందిన ప్రొటెక్షన్ టీమ్‌లో పనిచేసిన ఏరియా కమిటీ సభ్యురాలు సోడి కోసి, డివిజన్ కమిటీల్లో పనిచేసిన మరకం హిడుమే, మడకం జోగి ఆలియాస్ కోవాసి జోగి, పోడియం భూమిక ఆలియాస్ సోడి కోసి ఆలియాస్ వెన్నెల, సోడి బుద్రి ఆలియాస్ బద్రీ, మడవి పూజే, హేమ్లా, సోనూ, సోడి రమేశ్ ఆలియాస్ భీమా మిలిషీయా సభ్యులుగా పనిచేసిన అట్టం బుద్ర, కోవాసి ఇడుము, కోర్సా లాలు, హేమ్లా సుక్కు ఆలియాస్ అర్జున్, కోర్సా సుక్కు గురువారం లొంగిపోగా తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికి రూ.25 వేల నగదును అందజేశామన్నారు. ఏసీఎం, పార్టీ సభ్యులకు అందజేయాల్సిన మిగతా రివార్డు డబ్బులు వారి అకౌంట్‌లోకి పంపిస్తామన్నారు.

తెలంగాణలో లొంగిపోయిన వారిపై ఎలాంటి కేసులు నమోదు కాలేదని ఐజీ పేర్కొన్నారు. తెలంగాణ నుంచి ఇంకా 94 మంది అజ్ఞాతంలో ఉన్నారని, వారు కూడా జనజీవన స్రవంతిలో కలిస్తే పోలీస్‌శాఖ అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందజేస్తుందన్నారు. పక్క రాష్ట్రాల వారు వచ్చినా ఆహ్వానించి పునరావాసం కింద జీవనోపాధి కల్పిస్తామన్నారు. లొంగిపోవాలనుకేనే వారు ఎలాంటి భయాందోళన లేకుండా నేరుగా వచ్చి కలవచ్చన్నారు. కర్రెగుట్టలపై జరుగుతున్న పోలీసు ఆపరేషన్‌తో తెలంగాణ పోలీసులకు ఎలాంటి సంబంధంలేదని ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఐజీ బదులిచ్చారు. కేంద్ర బలగాలు, ఛత్తీస్‌గఢ్ పోలీసులు పహారాలో జరుగుతోందన్నారు. కాల్పుల విరమణ అనేది ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ సన్‌ప్రీత్ సింగ్, భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే, ములుగు ఎస్పీ శబరీష్, కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్, ఏఎస్పీ మనాన్‌భట్ తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల రారాజు దేవర్రాజు

- పద్య నాటకాలతో ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర
- బాల్యం నుంచే విభిన్న పాత్రల్లో రాణిస్తున్న రవీందర్‌రావు

వడ్డెపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పద్యనాటకాలంటే ఆయనకు పంచప్రాణాలు. రంగస్థల రారాజుగా 30 వసంతాలు పూర్తి చేసుకున్న దేవర్రాజు రవీందర్‌రావు విభిన్న పాత్రలు పోషించి ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. కమలాపురం మండలం మాధన్నపేట గ్రామానికి చెందిన దేవర్రాజు లక్ష్మణ్‌రావు- శాంతాదేవి దంపతులకు 1971లో జన్మించిన రవీందర్‌రావు ప్రాథమిక విద్యను మాధన్నపేటలో చదివారు. ఇక ఎంఏ పూర్తి చేసిన ఆయన హుజురాబాద్ ఆర్‌డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా విధులను నిర్వర్తిస్తున్నారు. తన తండ్రి లక్ష్మణ్‌రావు కూడా రంగస్థల నటుడు కాగా.. కృష్ణుడు, అర్జునుడు, కర్ణుడి పాత్రలను పోషించి గత ఐదు దశాబ్దాల పాటు ప్రేక్షకుల ఆదరాభిమానాలను చూరగొని ఔరా అనిపించుకున్నారు. రవీందర్‌రావు సోదరులు రాజేంద్రప్రసాద్‌రావు, రాఘవేందర్‌రావు కూడా కళాకారులే కావడం గమనార్హం.

బాల నటుడిగా అరంగేట్రం..

తన 12వ ఏటా 1992లో భక్త ప్రహ్లాద నాటకంలో లీలావతిగా అభినయాన్ని ప్రారంభించిన దేవర్రాజు రవీందర్‌రావు అల్లూరి సీతారామరాజుగా వికర్ణుడిగా పాత్ర పోషించి మెప్పించారు. హనుమకొండ, వరంగల్ తదితర ప్రాంతాల్లోని నాటక సమాజాల్లో తన నటన కౌశల్యాన్ని ప్రదర్శించి మెప్పించారు. గయోపాఖ్యానంలో అర్జునుడిగా, శ్రీనివాస కల్యాణంలో శ్రీవేంకటేశ్వరస్వామిగా, శ్రీకృష్ణ రాయబారంలో అర్జునుడిగా, శ్రీకృష్ణుడిగా, దుర్యోధనుడిగా, లవకుశ నాటకంలో శ్రీరాముడిగా, చింతామణి నాటకంలో భవాని శంకరుడిగా, బిల్వ మంగళుడిగా పాత్రలను అవలీలగా పోషించి ప్రేక్షక సమాజంతో చప్పట్లు కొట్టించుకొని ఆద్యంతం ఆకట్టుకున్నారు. రవీందర్‌రావు పద్యాల ఆలాపనకు నాటకాన్ని వీక్షించడానికి వచ్చిన ప్రేక్షకులు కొట్టిన వన్స్‌మోర్‌లతో నాటక ప్రదర్శన మందిరం మార్మోగేది. రెండున్నర నుంచి నాలుగున్నర శృతిలో కల్యాణి, భీంక్లాస్ , మాండు, మధ్యమావతి, వలజ, చక్రవాకం, అమృతవర్షిణి రాగాలతో ఆయన ఆలాపించే పద్యాలు ఆబాలగోపాలాన్ని అలరింపజేశాయి. పాత్రలో లీనమై ఆద్యంతం అలరించే ఆహార్యంతో నటనను ప్రదర్శించే దేవర్రాజు రవీందర్‌రావు రంగస్థల నటుడిగా ప్రజలందరికి సుపరిచితుడే.


శ్రీకృష్ణుడి పాత్రలో..


వేంకటేశ్వరస్వామిగా..


దుర్యోధనుడిగా ➤


లవకుశ నాటకంలో రాముడి పాత్రలో రవీందర్‌రావు (ఫైల్)

ఎన్నో అవార్డులు, రివార్డులు..

ఓరుగల్లుతో పాటు వేములవాడ, తిరుపతి, విజయవాడ నాటక సమాజాలతో కలిసి ఆయన విభిన్న పాత్రలను పోషించి ఆకట్టుకున్నారు. ఈ క్రమంలో ఆయన తిరుపతిలో అభినయ ఆర్ట్స్‌లో ప్రదర్శించి ఉత్తమ నటుడి అవార్డు, వరంగల్‌లో జాతీయ స్థాయి గరుడ అవార్డు, బంగారు గరుడ - ఉత్తమ నటుడి అవార్డు, తిరుపతిలో శ్రీనారాయణరెడ్డి - గుమ్మడి గోపాలకృష్ణ , చాట్ల శ్రీరాములు తదితరులతో ఎన్నో సన్మానాలు, సత్కారాలను పొందారు.

నాటక సమాజాలను పోషించాలి

దేవర్రాజు రవీందర్‌రావు, వరంగల్ స్టార్ బ్రదర్స్ సాంస్కృతిక కళా పరిషత్ అధ్యక్షుడు



నాటక సమాజాలతో పాటు రంగస్థలంలో నటించే నటులను ప్రభుత్వమే పోషించాలి. మండల స్థాయిలో కళాక్షేత్రాలను ఏర్పాటు చేసి కళాకారులకు శిక్షణ ఇప్పించి కళారంగం అంతరించిపోకుండా చూడాలి. రాష్ట్ర స్థాయి అవార్డులను ప్రదానం చేసి రంగస్థల నటులను ప్రభుత్వమే పోత్సహించాలి. వృద్ధ కళాకారులకు నెలకు రూ.12వేలు ఇవ్వాలి. ఇంటి స్థలాలు కేటాయించి, ఇల్లు ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలి.


◄ అర్జునుడిగా..

సుర్రుమంటోంది..

- ఉమ్మడి జిల్లాలో భానుడి భగభగలు
- భూపాలపల్లి జిల్లాలో అత్యధికం
- 43.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

హనుమకొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఎండ సుర్రుమంటోంది. భానుడి భగభగలకు ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులు బెంబేలెత్తిపోతున్నారు. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. మూడు, నాలుగు రోజులుగా ఉమ్మడి జిల్లాలో సరాసరి అత్యధిక పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా.. గురువారం రికార్డుస్థాయిలో 43డిగ్రీలను దాటింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. ఈ జిల్లాలోని రికార్డు స్థాయిలో చిట్యాలలో 43.7 డిగ్రీలు, హనుమకొండ జిల్లా దామెరలో 43.6 డిగ్రీలు, జనగామ జిల్లా బచ్చన్నపేటలో 43.4డిగ్రీలు, ములుగు జిల్లా కన్నాయిగూడెంలో 43.8 డిగ్రీలు, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడెంలో 42.9 డిగ్రీలు, వరంగల్ జిల్లా ఉర్సులో 42.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండల తీవ్రత వల్ల ఉమ్మడి జిల్లాలో వడదెబ్బ మరణాలు కూడా పెరుగుతున్నాయి. ఉపాధి కూలీలు, వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, పిల్లలు విలవిలలాడుతున్నారు. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు.


ఎండ నుంచి రక్షణగా వస్త్రాలు కప్పుకొని కాజీపేట ఫాతిమా బ్రిడ్జి పైనుంచి వెళ్తున్న ఓ కుటుంబం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు మే నెల మొత్తం వేసవి సెలవులు ఇవ్వాలని కోరుతూ గురువారం అంగన్‌వాడీ టీచర్లు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో అంగన్‌వాడీ యూనియన్ గౌరవ అధ్యక్షులు రాగుల రమేష్, నాంపల్లి శోభారాణి, జమున, అరుణ, సత్తమ్మ, తిరుమల, మమత, సునిత, స్వరూపతోపాటు పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కాలేజీని సందర్శించిన సాహితీవేత్తలు



ఆర్ట్స్ కళాశాలలో పాలమూరు సాహితీవేత్తలు

వరంగల్ ఎడ్యుకేషన్(వరంగల్ టౌన్), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ఆర్ట్స్అండ్‌సైన్స్ కళాశాలను పాలమూరుకు చెందిన పలువురు సాహితీవేత్తలు సందర్శించారు. పాలమూరు జిల్లాకు చెందిన 22 మంది తెలుగు సాహితీవేత్తలు కళాశాలను సందర్శించారు. వరంగల్‌లోని సాహితీవేత్తల జన్మ, నివాస స్థలాలను సందర్శించే కార్యక్రమంలో భాగంగా వారు ఆర్ట్స్ కళాశాలను సందర్శించారు. కార్యక్రమంలో కళాశాల మాజీ ప్రిన్సిపాల్ బన్న ఐలయ్య, రామశాస్త్రి, వీఆర్ విద్యార్థి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, గిరిప్రసాద్, ఆదిరెడ్డి, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి మృతులకు నివాళులు

పాల్గొన్న వివిధ సంఘాలు, రాజకీయ నాయకులు, ప్రజలు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్ పహల్గాం ప్రాంతంలో ఉగ్రవాద దాడిలో 28 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదకరమని హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. అమరులకు బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రం నుంచి సుబేదారి అమరవీరుల స్థూపం వరకు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● వడ్డెపల్లి: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన మారణకాండను నిరసిస్తూ స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో స్వదేశీ జాగరణ మంచ్ జిల్లా నేతలు గురజాల రవీందర్, సౌమిత్రి లక్ష్మణాచార్య, కంది శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మేయర్ టి. రాజేశ్వర్‌రావు, సుధీర్, చంచల అగర్వాల్, ఓంకార్‌సింగ్, పింగిళి ప్రవీణ్, వీసం రమణారెడ్డి, మాడిశెట్టి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● కాజీపేట: కాశ్మీర్‌లో ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి కాజీపేట చౌరస్తాలో తేజోమయ మాలకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. చౌరస్తాలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మర్యాల కృష్ణ, కోశాధికారి పప్పుల గోవర్ధన్, నాయకులు సీహెచ్ కొమ్మాలు , కేంద్ర నర్సింగరావు, సిరిల్ లాలెన్స్ తోపాటు స్థానికులు పాల్గొన్నారు.

● మడికొండ: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన నరమేధాన్ని నిరసిస్తూ మడికొండలోని మణికంఠ గ్రీన్‌హోమ్ అపార్ట్‌మెంట్ నివాసితులు గురువారం రాత్రి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు అనంతరం మణికంఠ గ్రీన్ హోం అపార్ట్‌మెంట్ వాసులు కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ నిర్వహించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని దేవున్ని ప్రార్థించారు.


మడికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న మణికంఠ గ్రీన్‌హోమ్ అపార్ట్‌మెంట్ వాసులు

● వడ్డెపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన మారణకాండను నిరసిస్తూ స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అమరులైన పర్యాటకులకు ఆత్మ శాంతి కలగాలని ప్రార్థించారు. కార్యక్రమంలో స్వదేశీ జాగరణ మంచ్ జిల్లా నేతలు గురజాల రవీందర్, సౌమిత్రి లక్ష్మణాచార్య, కంది శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మేయర్ టి.రాజేశ్వర్‌రావు, సుధీర్, చంచల అగర్వాల్, ఓంకార్‌సింగ్, పింగిళి ప్రవీణ్, వీసం రమణారెడ్డి, మాడిశెట్టి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

● వరంగల్ మెడికల్: జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) వరంగల్ తీవ్రంగా ఖండించింది. ఉగ్రదాడిలో ప్రాణాలను కోల్పోయిన మృతుల ఆత్మకు శాంతి కలుగాలంటూ గురువారం ఐఎంఏ వరంగల్ ద్వారా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎంఏ వరంగల్ కార్యాలయం నుంచి కాకతీయ వైద్య కళాశాల వరకు ఐఎంఏ నాయకులు, కాకతీయ వైద్య కళాశాల విద్యార్థులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ కె.నాగార్జునరెడ్డి, సెక్రటరీ డాక్టర్ అజిత్‌మహమ్మద్, డాక్టర్లు శిరీష్ కుమార్, మన్మోహన్‌రాజు, నరేష్‌కుమార్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ ఐఎంఏ నాయకులు డాక్టర్లు పి.విజయచందర్‌రెడ్డి, పి. కాశీప్రసాదరావు, ఎ.సుధాకర్, అశోక్‌రెడ్డి, బి.మోహన్‌రావు, శ్రీనివాస్, మల్లేశ్వర్, ఎం.శేషమాధవ్, సుదీప్, బాలాజీ, ఆనంద్ భోక్రె, అన్వర్‌మియా, పవన్, శ్రీధర్, సుమన్, సందీప్‌రెడ్డి, శ్రీనివాస్‌వర్మ, సురేందర్, వెంకన్న, కరుణాకర్, అన్వేషిణి, జట్టదార్ తదితరులు పాల్గొన్నారు.


హనుమకొండలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న వినయ్ భాస్కర్

పాఠశాలలను సెమీ రెసిడెన్సియల్స్‌గా మార్చాలి..



సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

వరంగల్ ఎడ్యుకేషన్(వరంగల్ టౌన్), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య అన్నారు. గురువారం హనుమకొండలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన హనుమకొండ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశంలో సోమయ్య మాట్లాడారు. అన్ని పాఠశాలల్లో ఉదయం పూట అల్పాహారం, పౌష్టికాహారంతో మధ్యాహ్న భోజనం, సాయంత్రం మళ్లీ స్నాక్స్, పాలు అందజేసి అక్కడే స్టడీ అవర్స్ నిర్వహించిన అనంతరం విద్యార్థులను ఇంటికి పంపించే పద్ధతిని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశ పెట్టాలన్నారు. అలా అయితేనే ప్రభుత్వ పాఠశాలల మనుగడ కొనసాగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తామంటున్న ఇంటిగ్రేటెడ్ పబ్లిక్‌స్కూల్ విధానం సరికాదన్నారు. ఈ పాఠశాలల వల్ల సామాజిక, ఆర్థిక అసమానతలు పెరిగే అవకాశముందన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి.లింగారెడ్డి, ఉపాధ్యక్షులు బాబుదొర, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సుమిత్రాదేవి, యాకయ్య, గోవిందరావు, ఆదిరెడ్డి, సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిపై కదం తొక్కిన న్యాయవాదులు

వరంగల్ లీగల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని హనుమకొండ, వరంగల్ జిల్లాల న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాద చర్య హేయమైనదని, అమానుషమని వారు పేర్కొన్నారు. గురువారం ఉభయ జిల్లాల న్యాయవాదులు అమాయక పర్యాటకులపై జరిగిన దాడిని తాము తీవ్రంగా పరిగణిస్తున్నామని వారు తెలిపారు. న్యాయవాదులు విధులు బహిష్కరించి తమ నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కోర్టు గేటు ముందు బైఠాయించి ఉగ్రవాద చర్యను పిరికి పంద చర్యగా పేర్కొంటూ ముక్త కంఠంతో బాధిత కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం కోర్టు నుంచి వరంగల్ జిల్లా కలెక్టరేట్‌కు, తర్వాత హనుమకొండ కలెక్టరేట్‌కు వందలాది మంది న్యాయవాదులు ర్యాలీగా వెళ్లి కలెక్టర్ సత్యశారదకు అందజేశారు. హనుమకొండ జిల్లా డీఆర్‌వోకు హనుమకొండ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లేఖ అందజేశారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ల అధ్యక్షులు వలుస సుధీర్, పులి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులు బి.రమాకాంత్, కొత్త రవి, రాష్ట్రబార్ కౌన్సిల్ సభ్యులు బైరపాక జయాకర్, దుస్స జనార్దన్, ఎన్.సహోదర్‌రెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం

హనుమకొండ కలెక్టరేట్: పహల్గామా టెర్రరిస్ట్ దాడిని ఖండిస్తూ హనుమకొండలోని కాళోజీ సెంటర్‌లో గురువారం సీపీఐ నాయకులు ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. టెర్రరిస్ట్ దాడి అత్యంత విషాదకరమైన సంఘటన అని, ఉగ్రమూకలకు ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజు, వేల్పుల సారంగపాణి, శంకర్, రాజేందర్, కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


వరంగల్ కలెక్టర్‌కు లేఖను అందజేస్తున్న న్యాయవాదులు

● ఉగ్రదాడి అమరులకు జిల్లా టీఎన్‌జీఓస్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి హనుమకొండ కలెక్టరేట్ నుంచి సుబేదారిలోని అమరుల కీర్తిస్థూపం వరకు ర్యాలీ తీసి కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్షులు ఎ.రాజేందర్, జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు వేణుగోపాల్, కోశాధికారి రాజేష్‌తోపాటు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజేష్ నాయక్‌పై పోలీసులకు ఫిర్యాదు

మడికొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్‌కు చెందిన రాజేష్‌నాయక్‌పై కాంగ్రెస్ పార్టీ నాయకులు మడికొండ పోలీసుస్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ సభాస్థలాన్ని పరిశీలించారు. సభ పేరుతో ఎల్కతుర్తి ప్రాంతంలోని రైతుల పంట చేలను, కాలువలు, చెట్లను నరికేయడాన్ని ధ్వంసం చేయడాన్ని ప్రశించారు. దీనిపై రాజేష్ నాయక్ అనే వ్యక్తి ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు బస్కె ప్రణయ్, కట్కూరి రేవంత్, బోగి కృష్ణ, ఎమ్డీ అమీర్, జక్కుల రాజు, నెరెళ్ల పవన్ తదితరులు పోలీసులను కోరారు.

విద్యార్థులను అభినందించిన కలెక్టర్

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్ వార్షిక ఫలితాలలో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన జిల్లాలోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులను కలెక్టర్ ప్రావీణ్య గురువారం కలెక్టరేట్‌లో శాలువాలు కప్పి అభినందించారు. ఇంటర్ ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చారన్నారు. రానున్న రోజుల్లో కూడా ఇదేవిధంగా జిల్లా పేరును ముందు నిలపాలన్నారు. ఆయా జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

● వడ్డెపల్లి: పింగిళి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులను ప్రతీ కళాశాల విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. ఇంటర్మీడియేట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో హనుమకొండ వడ్డెపల్లిలోని ప్రభుత్వ పింగిళి బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక రాష్ట్ర స్థాయి ర్యాంకులను సాధించారు. కళాశాల ప్రిన్సిపాల్ కవితతో పాటు ర్యాంకులు సాధించిన విద్యార్థినులు గురువారం జిల్లా కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. వీరందరినీ కలెక్టర్ ప్రావీణ్య శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినిలు నాజ్, నహీత, కిరణ్మయి, అఖిల, శ్రావ్య, శ్రీజ, నిచిత, అరుణతోపాటు లైబ్రేరియన్ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

పరిశోధకులు పరిష్కారాలు చూపాలి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): యువ పరిశోధకులు సామాజిక సమస్యలకు పరిష్కారాలను చూపాలని కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంహెచ్‌ఆర్ఎం విభాగం రిటైర్డు ప్రొఫెసర్ వి.శోభ అన్నారు. కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో విభాగాధిపతి ప్రొఫెసర్ పెద్దమళ్ళ శ్రీనివాసరావు అధ్యక్షతన పరిశోధకులకు రీసెర్చ్ మెథడాలజీపై నిర్వహిస్తున్న గురువారం 4వరోజు కార్యశాలకు శోభ హాజరై మాట్లాడారు. 'భారత దేశంలో సామాజిక శాస్త్ర పరిశోధనలో సమస్యలు సవాళ్లు' అనే అంశంపై మాట్లాడుతూ.. సామాజిక రుగ్మతలు, సమాజిక సమస్యలపై పరిశోధన చేయాలని అన్నారు. అలాగే సమస్యలకు పరిష్కారాలను చూపాలని కోరారు.

రిటైర్డు ప్రొఫెసర్ పింగిళి నరసింహారావు 'సామాజిక శాస్త్ర పరిశోధన వెనుకబాటుకు గల కారణాలు- సమకాలీన అధ్యయనం' అనే అంశంపై మాట్లాడుతూ.. పరిశోధకులు నిబద్ధతతో పని చేయాలని అన్నారు. నిరంతరం మార్పులకు లోనవుతున్న మానవ ప్రవృత్తిని అధ్యయనం చేయాలని అన్నారు. భౌతికశాస్త్రాల కంటే సామాజిక శాస్త్రాలు కష్టతరమైనవన్నారు. పరిశోధనకు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని అన్నారు. ప్రభుత్వాలు పరిశోధకులకు తగిన ప్రోత్సాహకాలను అందచేయాలని అన్నారు. ఈ కార్యశాలలో బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, చీకటి శ్రీను, బి.ఉమాశంకర్, బి.శ్రీనివాస్‌తోపాటు పరిశోధకులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు

డిగ్రీ పరీక్షలకు సహకరించండి

యాజమాన్యాలతో కేయూ అధికారుల సమావేశం

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ పరీక్షలకు ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు సహకరించాలని వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి కోరారు. ఈనెల 28 నుంచి కేయూ పరిధిలో నిర్వహించనున్న డిగ్రీ 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షల నేపథ్యంలో కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో గురువారం ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలతో వర్సిటీ ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్‌లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రైవేట్ కళాశాల యాజమాన్యాల బాధ్యులు తమకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి 4 ఏళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు రావడం లేదని విన్నవించారు. పరీక్షలను తాత్కాలికంగా వాయిదా వేసినట్లయితే ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగి తమకు డబ్బులు విడుదల చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. తమ ఆవేదన అర్థం చేసుకుని సహకరించాలని కోరారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ దృష్ట్యా పరీక్షలు జరగాలనే భావిస్తున్నామని, అయితే ఆర్థిక ఇబ్బందులతో తీవ్రంగా సతమతం అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డితో రాష్ట్ర ప్రైవేట్ యాజమాన్యాల బాధ్యులు సంప్రదింపులు జరుపుతున్నారని, ఒకవేళ తమకు అనుకూలంగా నిర్ణయం వస్తే పరీక్షలకు సహరిస్తామని పేర్కొన్నారు. వీసీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. పరీక్షలను నిర్వహిస్తామని, అందరూ సహరించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రైవేట్ కళాశాల యాజమాన్యల సంఘం రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, రామకృష్ణ, ఉపేందర్‌రెడ్డి, సదానందం, వేణుమాధవ్, పిచ్చిరెడ్డి, నవీన్, శ్రీధర్ రావు తదితర కళాశాలలకు చెందిన 250 కళాశాలకు చెందిన బాధ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల దీక్షలకు మద్దతు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కేయూ పరిపాలన భవనం ఎదుట వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 6వ రోజుకు చేరాయి. దీక్షలను మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి సూరం ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ నేత మందకుమార్ మాదిగలు సందర్శించి సంఘీభావం ప్రకటించి మద్దతు తెలిపారు. కాంట్రాక్టు అధ్యాపకులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, కేయూ రెండో గేటు వద్ద కాంట్రాక్టు అధ్యాపకుల డప్పు చప్పుళ్లతో జోరుగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. మానవహారం చేపట్టారు. ఈ దీక్షల్లో కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, సాదు రాజేశ్, డాక్టర్ మామిడి లింగయ్య, డాక్టర్ సంకినేని వెంకట్, కరుణాకర్‌రావు, సంకినేని వెంకన్న, కనుకయ్య, సతీశ్, నిరంజన్, సూర్యం, నాగయ్య, శ్రీదేవి, శ్రీలత, రేఖ, వీణ, సునిత, సుకన్య పాల్గొన్నారు.

పార్టుటైమ్ అధ్యాపకుల నిరసనలు

కేయూ పరిపాలన భవనం ఎదుట గురువారం కేయూ పార్టుటైమ్ అధ్యాపకులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని తమ అంతర్జాతీయ, జాతీయ పరిశోధన పత్రాల కాపీల ఫొటోలు పట్టుకుని నిరసన చేశారు. తక్కువ జీతాలతో ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు.

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. ఈకార్య క్రమంలో పార్టుటైమ్ అధ్యాపకుల సంఘం అధ్యక్షకార్యదర్శులు వై.రాంబాబు, నరేంద్రనాయక్, ఫణీంద్రకుమార్, సురేశ్, రమేశ్, సరిత, మాయురి, రాజేందర్, శ్రీధర్, సద్గుణ, కవిత మౌనిక, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రజల ఆస్తి అంబేద్కర్

రాంనగర్ ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఒక కులానికి, మతానికి చెందిన వారు కాదని, దేశ ప్రజల ఆస్తి అని మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ అన్నారు. అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం హంటర్‌రోడ్డులోని బీజేపీ పార్టీ కార్యాలయంలో జరిగిన సదస్సు ఏర్పాటు చేశారు. ముందుగా ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మశాంతి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆరూరి మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి పార్లమెంట్ వరకు పాలన సజావుగా సాగుతుందంటే అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే కారణమన్నారు. అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగా ప్రధాని మోదీ పేదల కోసం ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజేశ్వర్‌రావు, గజ్జెల శ్రీరాములు, శ్రీనివాస్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, తదితరులు పాల్గొన్నారు.

కాగా, బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి వివాహ వార్షికోత్సవం పురస్కరించుకొని ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో సంతోష్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సంతోష్‌రెడ్డి -రత్న దంపతుల ఫొటోను బహుకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మిద్దెల బాబు, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతి నాయక్, నానునాయక్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న అరూరి రమేశ్

ఎస్సార్‌యూలో యంత్ర-2025 ప్రాజెక్టు ఎక్స్‌పో

హసన్‌పర్తి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయంలో యంత్ర-2025 ప్రాజెక్ట్ ఎక్స్‌పో గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల అనేక కొత్త ఆవిష్కరణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా వివాదా హబ్ అనే మల్టీ లాంగ్వేజ్ వీడియో.. ట్రాన్స్‌ఫర్మేషన్ ప్లాట్‌ఫారమ్ జ్యూరీ సభ్యుల విశేషమైన ఆదరణ పొందింది. వివిధ భాషల వినియోగదారులకు వీడియోలు అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, మీడియా టెక్నాలజీలను సమన్వయం చేస్తూ ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తి చేయాలన్నదే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని విద్యార్థులు చెబుతున్నారు. ఈ సందర్భంగా ఎస్సార్ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ దీపక్ గార్గ్ హబ్ ప్రత్యేకతల గురించి వివరించారు. సంప్రదాయ అనువాద సేవలతో పోల్చితే 90శాతం ఖర్చు తగ్గుతుందని తెలిపారు. సింపుల్ వర్క్‌ఫ్లోతో వివదా హబ్ తక్కువ సమయంలో అత్యంత ప్రభావంతంగా పనిచేస్తుందన్నారు. వివదా హబ్ లాంటి ప్రాజెక్టులు భవిష్యత్తులో కంటెంట్ గ్లోబలైజేషన్‌కు మార్గం చూపుతాయన్నారు. విద్యార్థుల ఆవిష్కరణలు ప్రపంచ అవసరాలకు అనుగుణంగా ఉండేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సార్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.అర్చనారెడ్డి, ఏవీవీ సుధాకర్, ప్రాజెక్టు జ్యూరీ అధ్యక్షుడు బి.నాగేంద్రకుమార్, కళాశాల బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రాజెక్టుకు ఎంపికైన విద్యార్థులు

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

వడ్డెపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులపై అమలు చేస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి తెలంగాణ కొమురయ్య డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, అమాయక ఆదివాసీల ప్రాణాలను కాపాడాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ, చత్తీస్‌గఢ్‌తోపాటు మరికొన్ని రాష్ట్రాల్లో కొంత కాలంగా కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక గిరిజనులను, మావోయిస్టులను చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టులు చర్చలకు సిద్ధమని ప్రకటించినప్పటికీ వారితో చర్చలు జరుపకుండా కర్రె గుట్టల ప్రాంతాల్లో కేంద్ర బలగాలు మోహరించడం వలన ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీలు ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భయాందోళనతో బతుకుతున్నారని అన్నారు. ప్రజా సంఘాల జిల్లా నేతలు కలకోటి మహేందర్, మిర్యాల కుమార్, మంద రవి, వట్టం సాయికుమార్ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొదించుకోవాలి

రాంనగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఎంబీఏ విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొదించుకోవాలని కేయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ పి.అమరవేణి అన్నారు. మంత్ర -2025 పేరిట గురువారం కిషన్‌పురలోని వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు జాతీయ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన జెన్‌పాక్ట్ వైస్‌ప్రెసిడెంట్ విద్యా మాట్లాడుతూ.. ఎంబీఏ విద్యార్థులు కార్పొరేట్ అవసరాలకు తగ్గట్లు వారి మైండ్‌సెట్‌ను మార్చుకోవాలన్నారు. తెలంగాణ, ఏపీ, ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన 300కుపైగా విద్యార్థులు వివిధ మేనేజ్‌మెంట్ రంగాల్లో పోటీపడ్డారు.

ప్రతిభ కనబరిచిన వారి నగదు బహుమతి, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి ఎస్.మహేందర్, ప్రిన్సిపాల్ డాక్టర్ శేషాచలం, వైస్ ప్రిన్సిపాల్ హరిందర్‌రెడ్డి, ప్రొఫెసర్ కృష్ణమూర్తి, మంత్ర కన్వీనర్ రజినికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్వదినం

అలా ఆచరిస్తే ఫలాలు అక్షయం

వసంత ఋతువులో చైత్ర, వైశాఖ మాసాలు అక్షయుడైన మహా విష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైనవి. లక్ష్మీసమేతుడైన విష్ణువును ఈ మాసాలలో... ప్రధానంగా వైశాఖ శుద్ధ తదియనాడు భక్తి శ్రద్ధలతో పూజించడం శ్రేయోదాయకమని, ఆ రోజు చేసే వ్రతమైనా, జపమైనా, దానాలైనా అక్షయమైన ఫలితాలను ఇస్తాయని 'భవిష్యోత్తర పురాణం' చెబుతోంది. ఆ పవిత్రమైన రోజునే 'అక్షయ తృతీయ'గా నిర్వహించుకోవడం సంప్రదాయంగా స్థిరపడింది.





30న అక్షయ తృతీయ

'అక్షయం' అంటే 'నాశనం లేనిది', 'తరుగు లేనిది' అని అర్థం. అక్షయ తృతీయ... త్రేతాయుగాదిగా, పరశురామ జయంతిగా, బలరామ జయంతిగా ప్రసిద్ధి చెందింది.ఎన్నో పురాణ గాథలు ఈ పవిత్ర దినంతో ముడిపడి ఉన్నాయి.భాగవత పురాణంలో హిరణ్యాక్ష, హిరణ్య కశిపుల గాథ విశేషమైనది. ఆ సోదరులు ఇరువురు విష్ణు ద్వేషులు. వారిని సంహరించడానికి వరాహ, నారసింహ అవతారాలను శ్రీహరి దాల్చవలసి వచ్చింది. వరాహావతారంలో హిరణాక్షుడిని శ్రీహరి వధించాడు. హిరణ్యకశిపుడి కుమారుడు ప్రహ్లాదుడు తల్లి గర్భంలో ఉన్నప్పటి నుంచే నారాయణ భక్తుడు. లోకకంటకుడై, కుమారుణ్ణి సైతం ఎన్నో కష్టాలకు గురిచేసి, చంపాలని ప్రయత్నించిన హిరణ్యకశిపుణ్ణి నృసింహావతారంలో శ్రీహరి సంహరించాడు. ఉగ్రరూపుడైన నరహరి... ప్రహ్లాదుడి కోరికమేరకు శాంతించాడు. వరాన్ని కోరుకోమన్నాడు. హిరణ్యాక్ష, హిరణ్యకశిపులను వధించిన వరాహ, నారసింహ రూపాలలో... లక్ష్మీదేవితో కలిసి దర్శనం ఇవ్వాల్సిందిగా ప్రహ్లాదుడు ఆయనను వేడుకున్నాడు. అప్పుడు ఆ రెండు రూపాలను జోడించి, సతీ సమేతుడై... శ్రీ వరాహ లక్ష్మీ నారసింహుడిగా... శాంత వదనంతో ప్రహ్లాదుడి ముందు శ్రీహరి సాక్షాత్కరించాడు. సింహాచలంలో వెలిశాడు. ఆ రోజు అక్షయ తృతీయ.

సింహగిరిపై చందనోత్సవం

ప్రహ్లాదుడి అనంతరం స్వామి విగ్రహానికి పూజాదికాలు లేక మరుగునపడింది. దానిపై పుట్ట పెరిగింది. కొంతకాలం తరువాత... షట్చక్రవర్తులలో ఒకరైన పురూరవుడు... ఊర్వశితో కలిసి విహరిస్తూ, సింహగిరిపై విశ్రమించాడు. అతనికి స్వామి కలలో కనిపించి... తన విగ్రహాన్ని వెలికి తీసి, ఆలయం నిర్మించాలని ఆదేశించాడు. మరుసటిరోజు ఉదయం పురూరవుడు ఆ ప్రాంతంలోని పుట్టను తొలగించి, స్వామిని బయటకు తీసి, క్షీరంతో అభిషేకించి, పూజలు చేశాడు. ఆ రోజు వైశాఖ శుద్ధ తదియ. భక్తులకు ఏడాదిలో ఒక రోజు తన నిజరూపాన్ని దర్శనం చేసుకొనే వీలు కల్పించాలని, మిగిలిన రోజుల్లో... తన విగ్రహం దొరికిన పుట్ట బరువుకు సమానమైన చందనాన్ని తన విగ్రహానికి పూయాలని పురూరవుడికి స్వామి ఆదేశాన్ని ఇచ్చాడు. సింహగిరీశుడు ఆవిర్భవించిన ఆ రోజున సింహాచలంలో చందనోత్సవం జరుగుతుంది. ఆ రోజున స్వామి నిజరూపంలో కనిపిస్తారు. ఆ తరువాత... చందనాన్ని వైశాఖ శుద్ధ తదియ, వైశాఖ, జ్యేష్ఠ, ఆషాఢ పౌర్ణమి రోజుల్లో... నాలుగు విడతలుగా పూస్తారు. ఏడాది పొడవునా సింహగిరీశుడు లింగాకారంలో భక్తులకు దర్శనమిస్తారు.



ఇదే రోజున పూరీలో జగన్నాథ, సుభద్ర, బలభద్రుల ఆలయ సంప్రోక్షణ, ఆ తరువాత చందనోత్సవం జరుగుతాయి. ఆషాఢ శుద్ధ విదియనాడు నిర్వహించే రథోత్సవం నిమిత్తం... ఆ ముగ్గురు మూర్తులకు మూడు రథాలు నిర్మించడానికి అంకురార్పణ చేస్తారు. కాగా, శ్రీకృష్ణుడి ఆదేశం మేరకు సూర్యుణ్ణి ధర్మరాజు ప్రార్థించి అక్షయపాత్రను పొందడం, అర్జునుడు అక్షయ తూణీరాలను పొందడం, విశ్వామిత్రుడి ద్వారా సకల విద్యలతో పాటు అక్షయ తూణీరాలను అందుకోవడం లాంటి కథలు కూడా అక్షయ తృతీయతో ముడిపడి వినిపిస్తూ ఉంటాయి.

ఎన్నెన్నో విశ్వాసాలు...

అక్షయ తృతీయను అత్యంత శుభప్రదమైన రోజుగా పూర్వులు పేర్కొన్నారు. ఈ రోజు చేసే భక్తి శ్రద్ధలతో ఆచరించే ఏ పుణ్యకార్యమైన అనంతమైన పుణ్యఫలాలను ఇస్తుందన్న కారణంగానే పూర్వ ఋషులు ఈ పేరు పెట్టారని పెద్దలు చెబుతారు. కొత్త కార్యక్రమాలను ప్రారంభించడానికి అత్యంత పవిత్రమైనది భావిస్తారు. గృహిణులు వీసమెత్తు బంగారాన్నైనా కొని, లక్ష్మీదేవి ముందు ఉంచి పూజిస్తే... వారి సంపద అక్షయం అవుతుందనే నమ్మకం ఉత్తర భారతదేశంలో ఉంది. అది ఇప్పుడిప్పుడు దేశమంతటా వ్యాపించింది. ఈ రోజు లక్ష్మీ నారాయణులను, గౌరీ శంకరులను అర్చిస్తే త్వరగా వివాహం అవుతుందనే విశ్వాసం కూడా ఉంది. అలాగే అక్షయ తృతీయ రోజున సంపద్గౌరీ వ్రతాన్ని ఆచరిస్తే... సౌభాగ్యం, సంపదలు లభిస్తాయనేది పురాణ వచనం. కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయ పనులను ఈ రోజున ప్రారంభిస్తారు. దీనివల్ల పలసాయం సమృద్ధిగా లభిస్తుందనే నమ్మకం ఉంది.

• ఆయపిళ్ళ రాజపాప

ఆ తత్త్వం ఊహాతీతం

చింతన

శివతత్త్వం నిగూఢమైనది, ఊహాతీతమైనది. దాన్ని పూర్తిగా, లోతుగా అర్థం చేసుకోవడం సులభం కాదు. బ్రహ్మదేవుడు సృష్టిస్తాడు, విష్ణువు నడిపిస్తాడు. శివుడు లయం చేసుకుంటాడు. 'లయం చేసుకోవడం' అంటే ముక్తిని ప్రసాదించడం. ఆ ముక్తి కోసమే మునులు నిరంతరం తపస్సు చేస్తారు. ఆదిదేవుడు చాలా అమాయకుడు. భక్తులు అడిగినవన్నీ... అర్హత కూడా చూడకుండా ఇచ్చేస్తూ ఉంటాడు. దాన్ని సజ్జనులు ముక్తిని పొందడానికి ఉపయోగించుకుంటారు. దుర్మార్గులు దాన్ని స్వలాభం కోసం వాడుకొని... వికృత చేష్టలు, చెడ్డ పనులు చేస్తూ, విలాసాలలో గడిపేస్తారు. శంకరుడు త్యాగశీలి. అందుకే క్షీరసాగర మథనంలో పుట్టిన హాలాహలాన్ని స్వీకరించి, తన గళంలో బంధించాడు. మహావిష్ణువేమో అతిలోక సౌందర్యవతి, సంపద స్వరూపమైన లక్ష్మీదేవిని స్వీకరించాడు.

నిరాడంబరుడు...

లోకాలను ఏలే విశ్వనాథుడికి తలపై కిరీటం కూడా ఉండదు. ఒంటికి బూడిద రాసుకొని, పులిచర్మాన్ని వస్త్రంగా ధరించి, ఎద్దును వాహనంగా చేసుకొని, కొండల మీద నిత్యం ధ్యానం చేస్తూ ఉంటాడు. ఆయనకు సర్పాలే ఆభరణాలు. జటాజూటమే అలంకారం. ఇలాంటి వేషధారణతోనే పార్వతీదేవిని పెళ్ళి చేసుకోవడానికి వెళ్ళాడు. అందరూ ఆశ్చర్యపోయారు. "ఈ అర్ధనగ్న పురుషుడా... లోకోత్తర సౌందర్యవతి అయిన పార్వతీదేవికి కాబోయే భర్త" అని. చివరకు పార్వతీదేవి కూడా కాస్త చిరాకుపడింది. అప్పుడు సాక్షాత్తూ శ్రీమహావిష్ణువు ఆ పరమేశ్వరుడి పాదాలకు నమస్కరించి, పవిత్ర జలాలతో కాళ్ళు కడిగి, భక్తిపూర్వకంగా పెళ్ళి పీటలపైకి నడిపించాడు. మహా జ్ఞాని అయిన విష్ణువుకు తెలుసు... ముల్లోకాలూ పరమేశ్వరుడి పాదధూళికి సరిపోవని. శివుణ్ణి ప్రసన్నం చేసుకోవాలంటే... మన ఆత్మ పరిశుద్ధంగా ఉండాలి. ద్వేషం, కోపం ఉన్నచోట ఆయన ఉండలేడు. దయ, క్షమాగుణం ఉన్న చోటే ఈశ్వరుడు ఉంటాడు. ఈ గుణాలు లేకుండా... 'నేను ప్రతిరోజూ పంచాక్షరీ పారాయణం చేస్తాను, పక్కింట్లో కోసిన పూలతో పూజ చేస్తాను, బిందెల కొద్దీ నీళ్ళతో అభిషేకం చేస్తాను' అంటే కుదరదు. అది శుద్ధ దండుగ. ఈశ్వరుడు ఎంత అభిషేక ప్రియుడైనా... ఆయనకు కమండలంలో కాసిన్ని నీళ్ళు చాలు. ఇక పూలంటే అర్థం 'నీ హృదయం అనే పుష్పం' అని. అంతేతప్ప - దొరుకుతున్నాయి కదా అని ఓ బండెడు పూలు, పత్రాలు తెచ్చి స్వామి ఆలయాన్ని నింపెయ్యకూడదు.

> లోకాలను ఏలే విశ్వనాథుడికి తలపై కిరీటం కూడా ఉండదు. ఒంటికి బూడిద రాసుకొని, పులిచర్మాన్ని వస్త్రంగా ధరించి, ఎద్దును వాహనంగా చేసుకొని, కొండల మీద నిత్యం ధ్యానం చేస్తూ ఉంటాడు. ఆయనకు సర్పాలే ఆభరణాలు.

అర్ధనారీశ్వర పరమార్థం

ఇక, అర్ధనారీశ్వర తత్త్వంలోని పరమార్థం ఏమిటంటే... అది భార్యాభర్తల మధ్య ఉండవలసిన ప్రేమానురాగాలకు ప్రతీక. ఏ కాపురంలో భార్యాభర్తల మధ్య సాన్నిహిత్యం, ప్రేమానురాగాలు ఉంటాయో... అక్కడ పరమేశ్వరుడు ఏదో ఒక రూపంలో ఉంటాడు. పార్వతికి శివుడు తన ఎడమవైపే ఎందుకు స్థానం ఇచ్చాడు? మన శరీర భాగాలలో అత్యంత విలువైనది గుండె (హృదయం) అని మనకు తెలుసు. అందుకే పార్వతిని తన హృదయంలో దాచుకున్నాడు. అంతేకాదు, హృదయ స్థానం మాతృమూర్తికి ప్రతీక. అందుకే తల్లిని గౌరవించే ఎవరికైనా ఈశ్వర కృప మెండుగా ఉంటుంది.



• డాక్టర్ కసుమర్తి నాగేశ్వరరావు

రాష్ట్ర వ్యాప్తంగా బిల్డ్ నౌ

- భవన నిర్మాణ అనుమతులు ఇక ఆ ప్లాట్‌ఫామ్ ద్వారానే
- గురువారం సాయంత్రం నుంచి అమల్లోకి తెచ్చిన ప్రభుత్వం
- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలో సానుకూల ఫలితాలతో నిర్ణయం



హైదరాబాద్, ఏప్రిల్, 24(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియను సులభతరం చేస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన అప్లికేషన్ 'బిల్డ్ నౌ' రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి వచ్చింది. గురువారం సాయంత్రం 5 గంటల నుంచి అన్ని మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థల పరిధిలో ఉన్న పట్టణ ప్రణాళిక విభాగాలు బిల్డ్‌నౌ ద్వారానే భవన నిర్మాణ అనుమతులు జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశామని డీటీసీపీ దేవేందర్ రెడ్డి తెలిపారు. ఈ అధునాతన అప్లికేషన్ బిల్డ్‌నౌను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్చి 20న ప్రారంభించారు. కృత్రిమ మేధ(ఏఐ), బ్లాక్‌చైన్ టెక్నాలజీ, ఆగ్యుమెంటెడ్ రియాలిటీ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భవన నిర్మాణ అనుమతులు ఇచ్చేలా బిల్డ్‌నౌ ప్లాట్‌ఫాంను రూపొందించారు. తొలుత ఈ విధానాన్ని జీహెచ్ఎంసీ పరిధిలో అమలు చేసి 950 దరఖాస్తులకు అనుమతించారు. సానుకూల పలితాలు ఇవ్వడంతో ఏప్రిల్ 19 నుంచి హెచ్ఎండీఏ పరిధిలో అమలు చేశారు. భవన డ్రాయింగ్స్(మ్యాప్, ప్లాన్)పరిశీలనను నూతన విధానం సులభతరం చేసింది. టీజీ బిపాస్ పోర్టల్ ద్వారా గతంలో డిజైన్ల అనుమతుల కోసం రోజుల తరబడి వేచి ఉండే పరిస్థితి ఉండేది. కానీ, బిల్డ్‌నౌ ద్వారా 30 సెకన్ల వ్యవధిలో డిజైన్ల పరిశీలన పూర్తి చేస్తున్నారు. ప్రయోగాత్మకంగా ఖాజాగూడ సర్కిల్ పరిధిలో వివిధ నిర్మాణాలకు అనుమతులిచ్చారు. సాంకేతిక పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకపోవడంతో గురువారం సాయంత్రం నుంచి బిల్డ్‌నౌను రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ విధానాన్ని అమలు చేసేందుకు పట్టణ ప్రణాళిక విభాగంలో సుమారు 1500 మందికి శిక్షణ కూడా ఇచ్చారు. కాగా, గతంలో టీజీ బిపాస్ ద్వారా దరఖాస్తుల పరిశీలనకు నెల రోజుల పాటు వేచి ఉండే పరిస్థితి ఉండేదని, బిల్డ్‌నౌ ద్వారా 5 నిమిషాలలోనే దరఖాస్తుల పరిశీలన పూర్తవుతుందని అధికారులు కూడా చెబుతున్నారు.

లోకం తీరు



స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

- పార్టీ శ్రేణులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపు



ఖమ్మం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో అతి త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇందుకోసం సిద్ధంగా ఉండాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మంలో మంత్రి క్యాంపు ఆవరణలో గురువారం జరిగిన ఖమ్మం నియోజకవర్గ స్థాయి కార్యకర్తలు, నాయకులు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తిప్పి కొట్టాలని.. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సీతమ్మ సాగర్, సీతారామ ప్రాజెక్టులకు సంబంధించి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) నుంచి అనుమతులు లభించాయని, మూడేళ్లలో పనులన్నీ పూర్తిచేసి తీరుతామని తుమ్మల ప్రకటించారు.

పంచాయతీలకు ఎన్నికల్లేవు.. అభివృద్ధికి నిధుల్లేవు!

- ఢిల్లీ పార్టీల మోసాలను ప్రజలు గమనిస్తున్నారు: కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా స్థానిక సంస్థలకు ఎన్నికల్లేవు.. అభివృద్ధికోసం నిధుల్లేవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ పాలనలో 'పల్లె ప్రగతి'ని గురువారం ఎక్స్ వేదికగా ఆయన గుర్తుచేసుకున్నారు. ఢిల్లీ పార్టీలను నమ్మిన పాపానికి పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. స్థానికంగా పాలకవర్గం లేకపోవడంతో కేంద్రం ఇవ్వాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కావడం లేదన్నారు. దీంతో గ్రామాల్లో కనీస వసతులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. చివరికి పంచాయతీ సిబ్బందికి వేతనాలు, ఉపాధిహామీ కూలీలకు పనిదినాలు లేకపోవడం బాధాకరమని కేటీఆర్ అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉండి తీవ్ర అన్యాయం చేస్తున్న బీజేపీకి, పచ్చని పల్లెలను సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని కేటీఆర్ హెచ్చరించారు.

జోగులాంబ ఆలయ అర్చకుడిపై సస్పెన్షన్ వేటు

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అలంపూర్ జోగులాంబ ఆలయ ఉప-ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మను సస్పెండ్ చేస్తూ ఆలయ ఈవో ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల అర్చకుడిపై వచ్చిన విధి నిర్వహణలో నిర్లక్ష్యం, పలు ఇతర ఆరోపణల నేపథ్యంలో దేవాదాయ శాఖ విచారణ చేపట్టి ఈ నిర్ణయం తీసుకుంది. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా జిల్లా వదిలి వెళ్లకూడదని, ఆలయానికి సంబంధించి అర్చకుడి వద్ద ఉన్న ఆభరణాలు, వస్తువులు అధికారులకు అప్పగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సస్పెన్షన్ వేటుపై అర్చకుడు ఆనంద్ శర్మ స్పందించారు. తనపై ఏ ఆరోపణలతో ఈ చర్యలు తీసుకున్నారో అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొనలేదని, ఎలాంటి ఆర్థిక నేరాలకు పాల్పడలేదని అంటూనే సస్పెండ్ చేయడం సరికాదన్నారు.

నిప్పుల కొలిమి

రాష్ట్రంలో రోజురోజుకి అధికమవుతున్న ఎండలు



నల్లగొండ ఎన్జీ కళాశాల ఎదుట ట్రాఫిక్ కూడలిలో ఎండ నుంచి రక్షణకు ఏర్పాటు చేసిన తెర

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో రోజురోజుకి ఎండలు అధికమవుతున్నాయి. 45 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతూ చాలా ప్రాంతాలు నిప్పులకొలిమిని తలపిస్తున్నాయి. ఎండల తీవ్రత, వేసవి తాపం తాళలేక వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. జగిత్యాల జిల్లాలోని చాలా ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్‌లో, నిర్మల్ జిల్లా తానూరులో గురువారం అత్యధికంగా 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆ తర్వాత జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అయిలాపూర్, గొల్లపల్లిలో, నిజామాబాద్ జిల్లాలోని సీహెచ్ కొండూరు, మల్కాపూర్‌లో 45.3 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గోదూర్ నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి, ఆదిలాబాద్ జిల్లా తాంసిలో 45.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం, మంచిర్యాల జిల్లా భీమిని మండలం, నిజామాబాద్ జిల్లా మోస్రాలో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిజామాబాద్ జిల్లా మగ్గిడి, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరిలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతనమోదైంది. హనుమకొండ, ములుగు, మహబూబాబాద్, మంచిర్యాల, కుమరం భీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, జోగుళాంబ గద్వాల, రాజన్న సిరిసిల్ల, నిర్మల్, నిజామాబాద్, యాదాద్రి భువనగిరి, వనపర్తి, ఉమ్మడి మెదక్ తదితర జిల్లాల్లో 40 డిగ్రీలకు పైబడిన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వడదెబ్బతో నలుగురి మరణం

వడదెబ్బ వల్ల రాష్ట్రంలో గురువారం నలుగురు మరణించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం గాంధీనగరం గ్రామానికి చెందిన తాటి లక్ష్మడు(60), పెనుబల్లి మండలంలోని కొత్తకారాయిగూడెంకు చెందిన నెల్లూరి బోధనాచారి(37), జనగామకు చెందిన అలిసెరి ప్రసాద్(63), జగిత్యాల జిల్లా గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన కొల్లూరి గంగారాం (65)తో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందారు.

గోడ కూలి గర్భిణి మృతి



శ్రావణి (ఫైల్)

మునిపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో గురువారం సాయంత్రం కురిసిన అకాల వర్షం ఓ గర్భిణి ఉసురు తీసింది. గర్భం దాల్చాననే సంగతి తెలుసుకుని భర్తతో కలిసి ఆనందంగా స్వగ్రామానికి వెళుతూ భోజనం చేసేందుకు ఓ రెస్టారెంట్‌లో ఆగడమే ఆమె పాలిట శాపమైంది. గాలివాన దెబ్బకు రెస్టారెంట్ గోడ కూలి మీద పడడంతో గాయపడి గర్భిణి ప్రాణాలు కోల్పోయింది. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుదేరా చౌరస్తాలో జరిగిన ఈ దుర్ఘటనలో శ్రావణి (22) అనే గర్భిణి చనిపోగా, ఆమె భర్త విజయ్‌కుమార్ గాయపడ్డాడు. మునిపల్లి మండలం పోల్కంపల్లికి చెందిన విజయ్‌కుమార్, శ్రావణికి ఏడాది క్రితం వివాహమవ్వగా.. ఇరువురు వైద్యపరీక్షల నిమిత్తం గురువారం సదాశివపేటకు తమ వాహనంలో వెళ్లారు. స్కానింగ్ ద్వారా శ్రావణి నాలుగు నెలల గర్భిణి అని తేలింది. అనంతరం ఇద్దరు తిరిగి స్వగ్రామానికి వస్తూ బుదేరా చౌరస్తాలోని తాజ్ రెస్టారెంట్‌లో భోజనం చేసేందుకు ఆగారు. అదే సమయంలో గాలివాన ప్రారంభమవ్వగా.. ఇద్దరూ రెస్టారెంట్‌లోకి వెళుతుండగా గోడ కూలి శిథిలాలు వారిపై పడ్డాయి. తీవ్రంగా గాయపడిన శ్రావణిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయింది.

వికారాబాద్, సంగారెడ్డిలో గాలివాన

వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో గురువారం భారీ వర్షం, ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండం బిల్కల్ గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న చెట్లు విరిగి పడడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలం నిల్వ ఉంచిన ఉల్లి, జొన్న పంటలు, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలో సంగారెడ్డి-నర్సాపూర్ రోడ్డులో చెట్లు విరిగి పడ్డాయి. గుండ్లమాచునూర్ గ్రామ సమీపంలో విద్యుత్ తీగలు చెట్లపై తెగి పడటంతో గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

తెలంగాణను ప్రపంచానికి చూపిద్దాం!

- మే 18న సచివాలయంపై 'తెలంగాణ గ్రోత్ స్టోరీ' 3డీ షో
- ట్యాంక్‌బండ్‌పై నైట్‌కార్నివాల్
- మిస్ వరల్డ్ పోటీల వేళ కార్యక్రమాలు

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ వేదికగా జరగనున్న ప్రపంచ సుందరి పోటీలను తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటే ఓ గొప్ప వేదికగా రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో మిస్ వరల్డ్ పోటీలు జరిగే సమయంలో పర్యాటక శాఖతో కలిసి ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికలు చేస్తోంది. మే 7 నుంచి 31 వరకు మిస్ వరల్డ్ పోటీలు జరగనుండగా మే 18న హైదరాబాద్‌లోని సచివాలయం, ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్ ప్రాంతాల్లో నైట్ కార్నివాల్ నిర్వహించనుంది. అలాగే, తెలంగాణ గ్రోత్ స్టోరీ పేరిట రూపొందించిన ప్రత్యేక వీడియోను ఆ రోజు సాయంత్రం 3డీ ప్రొజెక్షన్ మ్యాపింగ్ విధానంలో సచివాలయంపై ప్రదర్శించనున్నారు. ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డులో ఎక్కడ నుంచి చూసినా ఈ ప్రదర్శన కనిపించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. నాటి నుంచి నేటి వరకు తెలంగాణ చరిత్రలో ముఖ్య విషయాలు, రాష్ట్ర ప్రగతి, అభివృద్ధికి సంబంధించిన అంశాలు, ప్రముఖ ప్రాంతాలు, వాటి విశేషాలు తెలంగాణ గ్రోత్ స్టోరీలో ఉండనున్నాయి. అలాగే, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలు, ఇతర దేశాల నుంచి ఇప్పటికే వచ్చిన పెట్టుబడుల వివరాలు కూడా ఉండే అవకాశం ఉంది. దీంతో మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే సుందరీమణులు, 140 దేశాలకు చెందిన మీడియా ప్రతినిధులు ఈ ప్రదర్శనలను తిలకించనున్నారు. దీంతో తెలంగాణ ఖ్యాతి ప్రపంచవ్యాప్తం అవుతుందని, తద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు రాబట్టవచ్చనేది ప్రభుత్వ ఆలోచన.

విద్యార్థి వీసాల రద్దుకు బ్రేకులు!

(మొదటిపేజీ తరువాయి)



తమ వీసాతో పాటు సెవిస్ రికార్డులు రద్దు చేయడంపై వీరు కోర్టులో దావా వేశారు. చట్టాలను ఉల్లంఘించిన ఘటనలతో వీరికి సంబంధం ఉందని ప్రభుత్వ సంస్థలు చెబుతున్నప్పటికీ వీరిలో చాలమందికి ఎలాంటి నేర చరిత్ర లేదు. తీవ్ర నేరాలు చేయకపోయినా విదేశీ విద్యార్థుల వీసాలు. సెవిస్ రికార్డులను రద్దు చేయడం అన్యాయమని, ఈ నిర్ణయంతో వారంతా చట్టపరమైన హోదాను కోల్పోయారని ఇమిగ్రేషన్ న్యాయవాదులు వాదించారు. కాగా, అమెరికా విదేశాంగ మంత్రి మార్క్ రూబియో 'క్యాచ్ అండ్ రివోక్' కార్యక్రమం కింద చర్యలకు ఆదేశించిన తర్వాత విద్యార్థి వీసాలు రద్దు చేయడం మొదలైంది. దీనిలో భాగంగా స్టూడెంట్ వీసాదారులపై ఏఐ సాయంతో నిఘా పెట్టడంత పాటు వారి సోషల్ మీడియా ఖాతాలను అధికారులు జల్లెడ పడుతున్నారు. ఈ కార్యక్రమంలో 300 మందికి పైగా విద్యార్థుల వీసాలు రద్దు చేసినట్లు రూబియో గతంలో ప్రకటించారు.

4,736 మంది సెవిస్ రికార్డులు రద్దు

అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్(ఏఐఎల్ఏ) నివేదిక ప్రకారం.. 2025 జనవరి 20 నుంచి మొత్తం 4,736 మంది సెవిస్ రికార్డులను ఐసీఈ రద్దు చేసింది. ఇందులో 327 మందికి సంబంధించిన సమగ్ర నివేదికలు తమకు అందాయని, వారిలో దాదాపు 50శాతం మంది భారత్‌కు చెందిన విద్యార్థులేనని ఏఐఎల్ఏ ప్రకటించింది. బాధితుల్లో చైనా, నేపాల్, దక్షిణ కొరియా, బంగ్లాదేశ్ విద్యార్థులు కూడా ఉన్నారని పేర్కొంది. కాగా, అమెరికాలో ఉన్న భారతీయ విద్యార్థుల్లో చాలామంది ఓపీటీ (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్)లో ఉన్నారు. ఎఫ్-1 వీసాలపై ఉన్న విదేశీ విద్యార్థులు తమ చదువుకు సంబంధించిన రంగాల్లో 12నెలల వరకూ పని చేయడానికి ఓపీటీ ప్రోగ్రామ్ అనుమతిస్తుంది. స్టెమ్ గ్రాడ్యుయేట్లు ఈ వ్యవధిని మరో 24 నెలలు పొడిగించుకోవడం ద్వారా మూడేళ్ల వరకూ అమెరికాలో ఉండే అవకాశం ఉంది. హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తు చేసే సమయంలో ఈ పని అనుభవం వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ట్రంప్ ప్రభుత్వ నిర్ణయాలతో ఓపీటీ హోదాను కోల్పోవడం వల్ల వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

చిన్న కారణాలతోనే తీవ్ర చర్యలు: ఏఐఎల్ఏ

ట్రాఫిక్ నిబంధనలు, వర్సిటీ నిబంధనల ఉల్లంఘనల వంటి చిన్న చిన్న కారణాలతో చాలామంది విద్యార్థుల వీసాలు రద్దు చేస్తున్నారని ఏఐఎల్ఏ నివేదిక వెల్లడించింది. ఒక విద్యార్థిపై గృహహింస కేసు నమోదవడంతో అతడి వీసా రద్దు చేశారని తెలిపింది. మొత్తం 327 మంది విద్యార్థుల్లో ఇద్దరికి మాత్రమే రాజకీయ కార్యకలాపాలతో సంబంధం ఉన్నట్లు ప్రస్తావించారని పేర్కొంది. ప్రభుత్వ చర్యలను ఇమిగ్రేషన్ న్యాయవాదులు ఖండిస్తున్నారు. బాధిత విద్యార్థులకు అమెరికా విదేశాంగ శాఖ, ఐసీఈ జారీ చేసిన లేఖల్లో వీసా రద్దుకు సంబంధించి నిర్దిష్ట నియమ నిబంధనలేమీ లేవని స్పష్టం చేస్తున్నారు. అమెరికాలో నిరసనలు తెలపడం చట్టవిరుద్ధం ఏమీ కాదని, అస్పష్టమైన ఆరోపణల కారణంగా విద్యార్థులు సర్వం కోల్పోవాల్సి వస్తుందని ఓ న్యాయవాది ఆవేదన వ్యక్తం చేశారు.

హెచ్-1బీ వీసాల్లో కొత్త చిక్కులు

అమెరికాలో హెచ్-1బీ వీసా దరఖాస్తుదారులకు కొత్త చిక్కులు మొదలయ్యాయి. వీసా ముంజూరు కోసం అభ్యర్థుల ఇంటి చిరునామా, బయోమెట్రిక్ డేటాను అమెరికా పౌరసత్వ, వలస సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్) అధికారులు కోరుతుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం.. హెచ్-1బీ వీసా కేసుల్లో ఇమిగ్రేషన్ అధికారులు రిక్వెస్ట్ ఫర్ ఎవిడెన్స్ (ఆర్ఎఫ్ఈ)ను కోరుతున్నారు. దీనిలో భాగంగా దరఖాస్తుదారులు వారి ఇంటి చిరునామా, బయోమెట్రిక్ డేటాతో పాటు వ్యక్తిగత సమాచారం కూడా సమర్పించాల్సి ఉంటుంది. అయితే దీని వెనుక యూఎస్‌సీఐఎస్ ఉద్దేశం ఏమిటనే సందేహాలను ఇమిగ్రేషన్ నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.

డీఎస్-160 ఫాం సమర్పిస్తేనే వీసా ఇంటర్వ్యూ

అమెరికా వీసా కోసం దరఖాస్తు చేసేవారు ఇకపై ఇంటర్వ్యూ స్లాట్ బుక్ చేసుకోవడానికి ముందే డీఎస్-160 ఫాంను తప్పనిసరిగా సమర్పించాలి. ఈ మేరకు ఆన్‌లైన్ ఫాం, షెడ్యూల్ ప్రక్రియలో అమెరికా విదేశాంగ శాఖ మార్పులు చేసింది. పలు దేశాల్లోని అమెరికా రాయబార కార్యాలయాలు, కాన్సులేట్లలో ఈ నిబంధన అమలులోకి వచ్చింది. ఏప్రిల్ 1 తర్వాత వీసా ఇంటర్వ్యూకు హాజరయ్యే వారందరికీ ఇది వర్తిస్తుంది. దీని ప్రకారం దరఖాస్తుదారులు ధ్రువీకరించిన డీఎస్-160 ఫాం గానీ 'ఏఏ'తో ప్రారంభమయ్యే బార్‌కోడ్ నంబరును గానీ ఇంటర్వ్యూకు తీసుకురావాల్సి ఉంటుంది. అమెరికాలోకి తాత్కాలిక ప్రవేశానికి వీసా కోసం దరఖాస్తు చేసుకొనే వారందరూ డీఎస్-160 ఆన్‌లైన్ నాన్-ఇమిగ్రెంట్ వీసా దరఖాస్తు పూర్తి చేయాల్సి ఉంటుంది. గతంలో దరఖాస్తుదారులు ఈ ఫాంను సమర్పించడానికి ముందే స్లాట్ బుక్ చేసుకొనే అవకాశం ఉండేది. ఇది కొన్నిసార్లు దరఖాస్తు ప్రాసెసింగ్‌లో జాప్యానికి, ఇతర సమస్యలకు కారణమవుతోంది. ఈ నేపథ్యంలో తాజా నిర్ణయం తీసుకున్నారు. కొత్త నిబంధన ప్రకారం అపాయింట్‌మెంట్ షెడ్యూల్ చేయడానికి ముందే ఈ ఫాంను నింపి, సబ్మిట్ చేయాలి. దీనిద్వారా దరఖాస్తుదారులకు సంబంధించిన కచ్చితమైన, సమగ్ర సమాచారం కాన్సులర్ అధికారులకు అందుబాటులో ఉంటుందని విదేశాంగ శాఖ పేర్కొంది. బీ1/బీ2, హెచ్-1బీ, ఎఫ్-1, జే-1 తదితర వీసా కేటగిరీలకు కొత్త డీఎస్-160 ఫాం నిబంధనలు వర్తిసాయి.

హిండెన్‌బర్గ్‌తో రాహుల్‌కు సంబంధాలు?

అదానీ-మోదీలే లక్ష్యంగా సహకారం

మొస్సాద్ ఆపరేషన్‌లో బహిర్గతమైందన్న స్పుత్నిక్ ఇండియా..

ఆ నివేదికను ఉటంకిస్తూ 'మనీకంట్రోల్' కథనం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: అదానీ గ్రూప్‌పై గతంలో సంచలన ఆరోపణలు చేసిన అమెరికా షార్ట్ సెల్లర్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్‌తో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సంబంధాలపై ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ ఆధారాలు సేకరించిందని స్పుత్నిక్ ఇండియా పేర్కొంది. రాహుల్ సన్నిహితుడు, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్మన్ శ్యామ్ పిట్రోడా హోం సర్వర్లను లక్ష్యంగా చేసుకొని మొస్సాద్ ఓ రహస్య ఆపరేషన్ నిర్వహించినట్లు తన నివేదికలో వెల్లడించింది. అదానీ, ప్రధాని నరేంద్ర మోదీలను అణగదొక్కాలనే లక్ష్యంతో రాహుల్ హిండెన్‌బర్గ్‌తో సంబంధాలు పెట్టుకున్నట్లు బహిర్గతమైనట్లు వివరించింది. వ్యాపార వార్తలను అందించే ప్రముఖ వెబ్‌సైట్ 'మనీకంట్రోల్' తన కథనంలో ఈ విషయాల్ని వెల్లడించింది. అలాగే వీటిని తాము ధ్రువీకరించట్లేదని కూడా స్పష్టం చేసింది. కాగా, అదానీ గ్రూప్ తన షేర్ల ధరలను కృత్రిమంగా పెంచిందని, అకౌంటింగ్ మోసాలకు పాల్పడిందంటూ 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ విడుదల చేసిన నివేదిక సంచలనం రేపిన సంగతి తెలిసిందే. దీంతో అదానీ గ్రూప్ షేర్ల ధరలు భారీగా పడిపోగా.. అదానీ-మోదీ సంబంధాలపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఇటు ఈ ఏడాది మొదట్లోనే హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థను మూసేశారు.

చిత్రజ్యోతి

SINCE 1965

కొత్త దర్శకుడితో గోపీచంద్



గోపీచంద్ హీరోగా సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో ఇటీవలే ఓ సినిమా ప్రారంభమైన విషయం తెలిసిందే. తాజాగా గోపీచంద్ హీరోగా నటించబోతున్న మరో చిత్రం గురువారం లాంఛనంగా ప్రారంభమైంది. సాయి కుమార్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. శ్రీ వేంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. మలయాళ నటి మీనాక్షి దినేశ్ హీరోయిన్. థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కనున్న ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.

కొత్తవారికి అవకాశం కల్పించాలనే..



'కొత్తవాళ్లకు ఒక వేదికను ఏర్పాటు చేయాలనేది నా కల. అది ఎప్పటి నుంచో ఉంది. అందుకే సినీ నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టాను. నాకు సంపాదన మీద దృష్టి లేదు' అని అన్నారు దర్శకుడు నక్కిన త్రినాధరావు. ఆయన నిర్మాణంలో వస్తున్న తొలి చిత్రం 'చౌర్యపాఠం'. ఇంద్రరామ్, పాయల్ రాధాకృష్ణ హీరో హీరోయిన్లు. నిఖిల్ గొల్లమారి తెరకెక్కించారు. నేడు సినిమా విడుదలవుతున్న సందర్భంగా త్రినాధరావు మీడియాతో మాట్లాడుతూ 'ఓ చిలిపి దొంగతనం కేసు గురించి విన్నప్పుడు ఆసక్తిగా అనిపించింది. ఈ కథతో సినిమా చేయమని కార్తిక్‌ని అడిగితే సరే అన్నాడు. అలా ఈ కథ పట్టాలెక్కింది. అయితే ఆ కేసును స్ఫూర్తిగా తీసుకొని పూర్తి సినిమాటిక్‌గా తెరకెక్కించాం. మా ప్రొడక్షన్ హౌజ్ నుంచి వస్తున్న తొలి చిత్రం గనుక నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడలేదు. ఈ చిత్రంలో ప్రతి ఒక్కరు అద్భుతంగా నటించారు. మూవీలో క్యారెక్టర్స్ తప్ప ఆర్టిస్టులు కనిపించరు. అంత సహజంగా పాత్రల్లో ఒదిగిపోయారు. ఇందులోని అన్ని పాటలు హిట్ అయ్యాయి' అని తెలిపారు.

కొరగజ్జ దేవత కథ



కర్నాటక, కేరళలోని కరావళి ప్రాంతాల్లో, ముంబైలోని కొన్ని ప్రదేశాల్లో పూజలు అందుకొనే ప్రధాన దేవత కొరగజ్జ కథ ఆధారంగా రూపుదిద్దుకుంటున్న చిత్రం 'కొరగజ్జ'. సుధీర్ అత్తవర్ దర్శకుడు. నాటి ఆచారాలు, సంప్రదాయాలను అర్థం చేసుకుని, కొంత పరిశోధన చేసి ఈ చిత్రానికి పాటలు స్వరపరిచారు సంగీత దర్శకుడు గోపీసుందర్. సినిమాలో ఆరు పాటలు ఉంటాయనీ, వాటిని వివిధ శైలి, భాషల్లో స్వరపరిచినట్లు ఆయన తెలిపారు. ఈ పాటలకు దర్శకుడు సుధీర్ అత్తవర్ సాహిత్యాన్ని అందించారు.

ఇన్ ప్రోగ్రెస్

హారర్.. థ్రిల్లర్



'శ్రీరాముడింట శ్రీకృష్ణుడంట', 'నివాసి' చిత్రాల తర్వాత గాయత్రి ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం 'కాళంకి భైరవుడు'. హారర్, థ్రిల్లర్ జోనర్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో రాజశేఖర్ వర్మ, పూజా కిరణ్ జంటగా నటిస్తున్నారు. హరిహరన్ దర్శకుడు. దాదాపు షూటింగ్ పూర్తయి, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకొంటున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను సీనియర్ హీరో డాక్టర్ రాజశేఖర్ లాంచ్ చేశారు. త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాతలు కె.ఎన్.రావు, శ్రీనివాసరావు ఆర్ చెప్పారు.

భారతీయత నా రక్తంలోనే ఉంది

- ఇమాన్వీ



జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో 'ఫౌజీ' హీరోయిన్ ఇమాన్వీ ఇస్మాయిల్ కుటుంబం పాకిస్థాన్‌కు చెందినదని, ఆమె తండ్రి గతంలో పాకిస్థాన్ సైన్యంలో పనిచేశారని, ఇమాన్వీని 'ఫౌజీ' నుంచి తొలగించాలంటూ నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇమాన్వీ స్పందించారు. తాను పాకిస్థాన్ అమ్మాయిని కాదంటూ సుదీర్ఘ వివరణను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. 'నా పైనా, నా కుటుంబ నేపథ్యంపైనా జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ఖండించాలనుకుంటున్నాను. మా కుటుంబంలో ఏ ఒక్కరికీ పాకిస్థాన్ సైన్యంతో ఎలాంటి సంబంధం లేరు. మీడియా నిజానిజాలు తెలుసుకోకుండా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం నన్ను నిరుత్సాహానికి గురిచేసింది. నేను ఇండియన్ అమెరికన్‌ని అని గర్వంగా చెబుతున్నా. హిందీ, తెలుగు, గుజరాతి, ఆంగ్ల భాషలు మాట్లాడగలను. లాస్ ఏంజెల్స్‌లో జన్మించాను. మా తల్లిదండ్రులు ఆమెరికాకు వలస వచ్చారు. అక్కడే యూనివర్శిటీ విద్యను పూర్తి చేశాను. నటిగా, కొరియోగ్రాఫర్‌గా, డ్యాన్సర్‌గా రాణిస్తున్నాను. ఈ రంగంలో చాలా కాలం పనిచేసిన తర్వాత భారత చిత్ర పరిశ్రమలో అవకాశాలు రావడం గర్వంగా భావిస్తున్నాను. సినిమా నా వ్యక్తిత్వంపై గొప్ప ప్రభావం చూపించింది. భారతీయత, భారత సంస్కృతి నా రక్తంలోనే ఉంది. సోషల్ మీడియాను మంచి కోసం ఉపయోగించండి' అని ఇమాన్వీ పేర్కొన్నారు.

'అబిర్ గులాల్' పై నిషేధం?



పాకిస్థాన్ నటుడు ఫవాద్ ఖాన్, వాణీకపూర్ జంటగా నటించిన బాలీవుడ్ చిత్రం 'అబిర్ గులాల్'ని భారత్‌లో విడుదల కాకుండా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ నిషేధించింనట్లు సమాచారం. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి నేనథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మే 9న సినిమాను విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించగానే నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత మొదలైంది. ఈ చిత్రాన్ని బ్యాన్ చేయాలంటూ డిమాండ్ చేశారు. దాడి జరిగిన రోజునే ప్రమోషన్‌ను ప్రారంభించడంపై వాణీకపూర్‌పై కూడా విమర్శలు వెల్లువెత్తాయి. కాగా, ఈ సినిమాలోని పాటలను యూట్యూబ్(ఇండియా) నుంచి తొలగించారు.

మేడిన్ దక్షిణ కొరియా..!

» పన్నులు ఎగ్గొట్టేందుకు చైనా కంపెనీల ఎత్తుగడ

» తమ వస్తువులనే కొరియా పేరిట అమెరికాకు ఎగుమతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతున్న వేళ.. డ్రాగన్ దేశానికి చెందిన కొన్ని కంపెనీలు భారీగా సుంకాలు ఎగ్గొట్టేందుకు కొత్త మార్గాలను ఎంచుకుంటున్నాయి. తమ దేశంలో తయారైన వస్తువులనే దక్షిణ కొరియా ఉత్పత్తులుగా పేర్కొంటూ వాటిని అమెరికాకు ఎగుమతి చేస్తున్నాయని, తద్వారా భారీగా సుంకాలు ఎగవేస్తున్నాయని జపాన్ వార్తా సంస్థ నిక్కీ ఆసియా తెలిపింది. కొరియా కస్టమ్స్ సర్వీస్ ప్రకారం.. జనవరి-మార్చి మధ్యకాలంలో దక్షిణ కొరియాలో తయారైనట్టు తప్పుడు లేబుల్స్‌తో ఉన్న రూ.175 కోట్ల విలువైన ఉత్పత్తులు ఎగుమతి అవ్వగా.. వాటిలో అమెరికాకు ఎగమతయ్యే వస్తువుల వాటానే 97 శాతం ఉన్నట్టు తెలిసింది. గతేడాది మొత్తం వెలుగుచూసిన మోసాలతో పోలిస్తే.. 2025లో ఈ మూడు నెలల్లో బయటపడిన మోసాలు 85 శాతంగా ఉన్నాయి. టారిఫ్ వ్యయాలను తగ్గించుకునేందుకు కొన్ని సందర్భాల్లో వస్తువుల ధరలను కూడా ఉద్దేశపూర్వకంగానే తగ్గిస్తున్నారని కొరియా కస్టమ్స్ సర్వీస్ నివేదిక చెబుతోంది. అమెరికాలో యాంటీ డంపింగ్ డ్యూటీకి లోబడి ఉన్న చైనా తయారీ పరుపులు దక్షిణకొరియా నుంచి రవాణా అవుతున్న కేసులు సహా ఇటీవల ఈ తరహా అనేక కేసులను కొరియా కస్టమ్స్ సర్వీస్ హైలైట్ చేసింది. రీఛార్జబుల్ బ్యాటరీల్లో ఉపయోగించే పదార్థాలను తొలుత చైనా నుంచి రవాణా చేసి.. దక్షిణ కొరియాలో వాటిని మరోసారి నకిలీ లేబుల్స్‌తో ప్యాకింగ్ చేసి ఎగుమతి చేస్తున్నారని పేర్కొంది. అలాగే నిఘా కెమెరాల విడిభాగాలను కూడా దక్షిణ కొరియా నుంచి దిగుమతి చేసుకుని.. చైనాలో వాటిని అసెంబుల్ చేసి వాటిని తిరిగి దక్షిణకొరియా తయారీ వస్తువులుగానే ఎగుమతి చేశారని గుర్తించినట్టు తెలిపింది. ఈ తరహా మోసాలను గుర్తించి, వాటిపై ఉక్కుపాదం మోపేందుకు దక్షిణ కొరియా కస్టమ్స్ ఏజెన్సీ తాజాగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది.

'సీతారామ'కు సాంకేతిక అనుమతి

(మొదటి పేజీ తరువాయి)



తెలంగాణ అధికారులు తెలిపారు. జల విద్యుత్ ఉత్పాదనకు సంబంధించిన పనులేవీ చేపట్టడం లేదని, దీన్ని కేంద్ర విద్యుత్ సంస్థ (సీఈఏ) చూస్తుందని తెలిపారు. పర్యావరణ అనుమతి (ఈసీ) పెండింగ్‌లో ఉందని, బ్యారేజీ నిర్మాణ పనులు చేపట్టరాదని ఆదేశాలు ఉన్నాయి కదా అని దేబశ్రీ ముఖర్జీ అడగ్గా.. పర్యావరణానికి జరిగిన నష్టానికి పరిహారం కింద రూ.53 కోట్లు జమ చేశామని తెలంగాణ అధికారులు తెలిపారు. దాంతో ఈసీ కోసం అదనపు టర్మ్ అండ్ రిఫరెన్స్ (టీఓఆర్) జారీ అయిందని, దాని ప్రకారం పర్యావరణ అనుమతి సాధించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. దాంతో జల విద్యుత్ డిజైన్లు, పర్యావరణ అనుమతికి లోబడి క్లియరెన్స్ ఇస్తున్నామని దేబశ్రీ ముఖర్జీ తెలిపారు. మైక్రో ఇరిగేషన్‌పై ఆరా తీయగా కొన్ని డిస్ట్రిబ్యూటరీల కింద ఆయిల్‌పామ్‌తో పాటు ఇతర పంటల కోసం పైప్డ్ ఇరిగేషన్ విధానం అమలు చేయనున్నామని తెలంగాణ అధికారులు వివరించారు. దాంతో అన్ని అంశాలు సరిగ్గానే ఉన్నాయంటూ తెలంగాణ అధికారులను అభినందించారు.

ఫలించిన ఉత్తమ్ వ్యూహం

ఈ ప్రాజెక్టుకు నీటి కేటాయింపులపై నిర్ణయంతో పాటు పలు అంశాలపై అధికారులకు దిశా నిర్దేశనం చేస్తూ నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి అనుసరించిన వ్యూహం ఫలించింది. తెలంగాణ రాష్ట్రం వచ్చాకా గోదావరి బేసిన్‌లో పలు ప్రాజెక్టులకు అనుమతులు తెచ్చుకోగా... కాళేశ్వరం ఎత్తిపోతల పథకం తర్వాత ఇదే అతిపెద్ద ప్రాజెక్టు. కాళేశ్వరం ప్రాజెక్టులో లింక్-1లోని కాంపోనెంట్లన్నీ రెండున్నరేళ్లకు పైగా నిరుపయోగంగా ఉండగా... కీలకమైన బ్యారేజీల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. దాంతో గోదావరి బేసిన్‌లో సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు కీలకం కానుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 67.05 టీఎంసీల నీటిని ప్రాజెక్టుకు కేటాయిస్తూ మంత్రి ఉత్తమ్ నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతి కోసం అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ ప్రాజెక్టు కింద భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో 7.87 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. పాలేరు, వైరా రిజర్వాయర్ల కింద సాగర్ ఆయకట్టును స్థిరీకరించడం కూడా ప్రాజెక్టు లక్ష్యాల్లో ఒకటి. సీతమ్మసాగర్ బ్యారేజీలో 282.80 మెగావాట్ల సామర్థ్యం జల విద్యుత్ కేంద్రాలు కూడా నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం రూ.19,955 కోట్లు కాగా... ఇప్పటిదాకా 57 శాతం మేర అంటే రూ.11,320 కోట్లు వెచ్చించారు. 2026 రబీ నాటికి ప్రాజెక్టును పూర్తిచేయాలన్నది ప్రభుత్వం లక్ష్యం.

ఇక పీఎంకేఎస్‌వై కింద అనుమతి కోసం...

కీలకమైన సాంకేతిక అనుమతి సాధించడంతో ఈ ప్రాజెక్టుకు ప్రధాన మంత్రి కృషి సించాయ్ యోజన (పీఎం కేఎస్‌వై, సత్వరసాగు నీటి ప్రయోజన పథకం-ఏఐబీపీ) కింద అనుమతి కోసం దరఖాస్తు చేసుకోనున్నారు. దీని కింద మరో రూ.8635 కోట్లు వెచ్చించాల్సి ఉండగా... కేంద్ర సహాయం అందితే 60 శాతం నిధులు సమకూరనున్నాయి. ఈ ప్రాజెక్టు గిరిజన/కొండ ప్రాంతాల్లో ఉండటంతో కేంద్ర సహాయానికి మరింత అనుకూలతలు ఏర్పడనున్నాయి.

లక్షలాది ఎకరాలు సాగులోకి వస్తాయి: భట్టి

సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతి రావడంపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్షలాది ఎకరాలు సాగులోకి వస్తాయన్నారు. ఈ ప్రాజెక్టుకు 67 టీఎంసీల నీటిని కేటాయించి... దానికి చట్టబద్ధత సాధించిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని ఆయన అభినందించారు. రెండు దశాబ్దాల సుదీర్ఘ పోరాటం తర్వాత అనుమతులు వచ్చాయన్నారు.

పనులను పరుగులు పెట్టిస్తాం: తుమ్మల

ఖమ్మం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు గోదావరిపై దుమ్ముగూడెం వద్ద నిర్మిస్తున్న సీతమ్మ సాగర్ బ్యారేజీ పనులకు, ఇప్పటికే ప్రారంభించిన సీతారామ ఎత్తిపోతల పథకానికి అనుమతులు లభించడంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. సీతారామ ఎత్తిపోతల పథకంలో 104 కిలోమీటర్ల ప్రధాన కాలువ నిర్మాణం పూర్తయిందని తెలిపారు. మిగిలిన 125 కిలోమీటర్ల మేర పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. 8 డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీ పనులకు టెండర్లు పూర్తయ్యాయని, భూసేకరణ సర్వే జరుగుతోందని తెలిపారు. సాంకేతిక అనుమతులు లభించడంతో ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టిస్తామన్నారు.

చెప్పకుండా విదేశాలకు ఎందుకెళ్లారు?

» జవాబివ్వకుంటే క్రమ శిక్షణ చర్యలు తప్పవు

» ఐపీఎస్ సునీల్‌కుమార్‌కు ప్రభుత్వం హెచ్చరిక

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ జమానాలో అనుమతి లేకుండా విదేశాల్లో అనధికారిక పర్యటనలు చేసిన సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌పై రాష్ట్రప్రభుత్వం అభియోగాలు నమోదు చేసింది. ప్రభుత్వం ఆమోదించి అనుమతిచ్చిన ట్రావెల్ ప్లాన్‌కు విరుద్ధంగా దుబాయ్, జార్జియా, యూఏఈ, యూకే, అమెరికా దేశాలకు వెళ్లినందుకు చర్యలకు ఉపక్రమించింది. అనుమతి తీసుకోకుండా ఎందుకు విదేశాలకు వెళ్లారో నెల రోజుల్లోగా సముచిత సమాధానం చెప్పాలని, లేదంటే తప్పు చేసినట్లు భావించి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీచేసింది. 2019-24 మధ్య ఆయన జార్జియా పర్యటనంటూ యూఏఈకి.. అమెరికా వెళ్తున్నానని చెప్పి యూకే పర్యటనకు వెళ్లడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి.. గత నెల మొదటి వారంలో సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే.

రిస్క్‌లో కోట్లాది మంది జీమెయిల్ యూజర్లు..!

» నకిలీ మెయిల్స్‌తో బురిడీ కొట్టిస్తున్న హ్యాకర్లు

» లింక్ క్లిక్ చేస్తే ప్రమాదమంటున్న నిపుణులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: గూగుల్‌లోని లొసుగులను ఉపయోగించుకుని కోట్లాది మంది జీమెయిల్ వినియోగదారులను హ్యాకర్లు బురిడీ కొట్టిస్తున్నారు. అచ్చం గూగుల్ నుంచి వచ్చినట్టుగా కనిపించే ఈమెయిల్స్‌ను పంపి వారి వద్ద నుంచి లాగిన్ సమాచారాన్ని రాబడుతున్నారు. దీన్ని ఒక సైబర్ దాడిగా నిపుణులు పేర్కొంటున్నారు. దీన్ని ఎథేరియం నేమ్ సర్వీస్ (ఈఎన్ఎస్) ప్రధాన డెవలపర్ నిక్ జాన్సన్ ఇటీవల వెలుగులోకి తెచ్చారు. సెక్యూరిటీ అలర్ట్‌ల పేరిట గూగుల్ పంపిన సందేశాల్లాగే కనిపించే ఈ మెయిల్స్‌ను చూసిన వినియోగదారులకు ఎక్కడా అనుమానం రాదు. అయితే వివరాలు తెలుసుకునేందుకు వారు ఇచ్చిన లింక్‌ను క్లిక్ చేయగానే అది 'అకౌంట్స్.గూగుల్.కామ్'కు బదులుగా 'సైట్స్.గూగుల్.కామ్' పేజీకి తీసుకెళ్తుందని, అక్కడ మన లాగిన్ వివరాలను నమోదు చేయగానే.. అవన్నీ హ్యాకర్ల చేతికి వెళతాయని నిక్ జాన్సన్ తెలిపారు. ఈ చిన్నపాటి తేడాను గుర్తించలేని వినియోగదారులు సైబర్ ఉచ్చులో చిక్కుకునే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. కాగా, జీమెయిల్ వినియోగదారులపై ఈ తరహా సైబర్ దాడిని గుర్తించామని గూగుల్ ధ్రువీకరించింది. అయితే దీనికి అనుమతించే మార్గాన్ని మూసివేసినట్టు వెల్లడించింది. ఇలాంటి దాడి బారిన పడకుండా రెండంచెల అథెంటికేషన్, పాస్ కీలను వినియోగించాలని వినియోగదారులకు సూచించినట్టు పేర్కొంది.

నక్సల్స్‌కు పేలుడు సామగ్రి ఇచ్చిన ముగ్గురికి ఏడేళ్ల జైలు శిక్ష

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: ఛత్తీస్‌గఢ్‌లో నక్సలైట్లకు పేలుడు సామగ్రి అందజేసిన ముగ్గురికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ అక్కడి కోర్టు తీర్పు ఇచ్చిందని గురువారం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) వర్గాలు తెలిపాయి. సుకుమా జిల్లాకు చెందిన సెమల్ దీపక్, నారా భాస్కర్, తేలం ముత్తాలకు ఈ జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధిస్తూ జగదల్‌పూర్‌లోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు తీర్పు చెప్పింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న పుట్టి పాపిరెడ్డిని అంతకుముందే నిర్దోషిగా విడుదల చేసింది. మావోయిస్టులకు ఎలక్ట్రానిక్ డిటనేటర్లు, జిలిటెన్ స్టిక్స్, కార్డెటెక్స్ వైర్లు అందజేశారన్న ఆరోపణలపై 2023లో ఛత్తీస్‌గఢ్ పోలీసులు వారిని అరెస్టు చేశారు. 2024 ఫిబ్రవరిలో ఈ కేసు ఎన్ఐఏకు బదిలీ అయింది. మావోయిస్టు దళాలకు రోజువారీ ఆహార పదార్థాలతో పాటు పేలుడు సామగ్రి కూడా సరఫరా చేసినట్టు ఎన్ఐఏ ఆధారాలు చూపించడంతో కోర్టు శిక్ష వేసింది.

ఫిట్జీ కార్యాలయాల్లో ఈడీ సోదాలు

» కోచింగ్ సంస్థపై కేసు నమోదు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పోటీ పరీక్షల కోసం విద్యార్థులకు కోచింగ్ ఇస్తున్న ప్రముఖ కోచింగ్ సంస్థ ఫిట్జీకి చెందిన పలు కార్యాలయాలపై గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. సంస్థ ప్రమోటర్లు సహా.. ఢిల్లీ, నొయిడా, గురుగ్రామ్ సహా ఢిల్లీ-దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) పరిధిలోని సంస్థ కార్యాలయాల్లో ఈ తనిఖీలు కొనసాగాయి. గత జనవరిలో అర్థంతరంగా కోచింగ్ కేంద్రాలు మూసేసి, తమ పిల్లల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసినందుకు ఫిట్జీ యాజమాన్యానికి వ్యతిరేకంగా ఢిల్లీ, నొయిడా పోలీసులకు పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదులు చేశారు. ఫిట్జీ సంస్థ దేశవ్యాప్తంగా 73 కేంద్రాలు నిర్వహిస్తోంది.

ఉత్తమ పంచాయతీగా మాల్

» ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న పంచాయతీ కార్యదర్శి



ప్రధాని మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పంచాయతీ కార్యదర్శి వైపీ.రాజు

యాచారం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ చేతుల మీదుగా రంగారెడ్డి జిల్లా మాల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి వైపీ రాజు ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డును అందుకున్నారు. బిహార్‌లోని మదుబన్ నగరంలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని ఆత్మనిర్భర్ భారత్ పథకం కింద ఎంపికైన ఉత్తమ గ్రామా ల కార్యదర్శులకు అవార్డులను ప్రదానం చేశారు. అవార్డుతో పాటు కోటి రూపాయల నగదు బహుమతి గ్రామానికి అందనుంది. గత నెలలో కేంద్ర బృందం గ్రామంలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించింది. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తున్న అధికారులను అభినందించింది, గ్రామాన్ని ఈ అవార్డుకు ఎంపిక చేసింది. గ్రామంలో నిర్వహించే సంత ద్వారా ఏడాదికి రూ.80 లక్షల ఆదాయం గ్రామానికి వస్తోంది. మాల్ గ్రామానికి అవార్డు రావడం తమపై మరింత బాధ్యతను పెంచిందని ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీలత, పంచాయతీ కార్యదర్శి రాజు అన్నారు. వీరి వెంట డీఎల్‌పీవో సాధన ఉన్నారు.

కౌశిక్ రెడ్డికి హైకోర్టులో స్వల్ప ఊరట

» రూ.50 లక్షలు ఇవ్వాలని క్వారీ యజమానిని బెదిరించిన కేసులో ఈ నెల 28 వరకు అరెస్టు చేయొద్దని ఆదేశం

హైదరాబాద్/వరంగల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఓ గ్రానైట్ క్వారీ యాజమానిని రూ.50 లక్షలు ఇవ్వాలని బెదిరించిన కేసులో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి స్వల్ప ఊరట లభించింది. ఈ నెల 27న బీఆర్ఎస్ సభలో పాల్గొనడానికి వీలుగా ఈ నెల 28 వరకు ఆయనను అరెస్ట్ చేయవద్దని హైకోర్టు ఆదేశించింది. బీఆర్ఎస్ సభ కోసం రూ.50 లక్షలు ఇస్తేనే క్వారీ నడుస్తుందని కౌశిక్ రెడ్డి ఆ క్వారీ యాజమాని అయిన తన భర్త మనోజ్ రెడ్డిని బెదిరిస్తున్నారని కట్టా ఉమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై హనుమకొండ సుబేదారి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. హనుమకొండకు చెందిన మనోహర్ రెడ్డికి కమలాపూర్ మండలం వంగపల్లి, గుండేడు గ్రామాల మధ్య ఈ క్వారీ ఉంది. ఈ కేసును కొట్టేయడంతో పాటు అరెస్టు, దర్యాప్తుపై స్టే ఇవ్వాలని కోరుతూ కౌశిక్ రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది వాదిస్తూ అనుమతి లేకుండా క్వారీ నిర్వహిస్తున్నట్లు స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయడంతోనే ఆయన క్వారీ వ్యాపారికి ఫోన్ చేసినట్లు తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ 'అన్ని సమస్యలను ఎమ్మెల్యేనే పరిష్కరిస్తారా? అలాగైతే నియోజకవర్గంలో ప్రభుత్వ వ్యవస్థలను ఎత్తేయండ'ని వ్యాఖ్యానించింది. పోలీసుల దర్యాప్తునకు కౌశిక్‌రెడ్డి సహకరించాలని ధర్మాసనం ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని ఫిర్యాదుదారు, పోలీసులకు నోటీసులు జారీచేసింది.

గొర్రెల కాపరికి సివిల్స్‌లో 551వ ర్యాంకు

» జీవాలతో ఆనందం పంచుకున్న బీరప్ప



గొర్రెతో బీరప్ప

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): అతనిది ఓ సాధారణ గొర్రె కాపరుల కుటుంబం. మహారాష్ట్రలోని కొల్హాపుర జిల్లా తన్నూరు ఎమగె గ్రామం స్వస్థలం. జీవిక కోసం కర్ణాటకకు వలస వచ్చారు. బెళగావి జిల్లా నానావాడి గ్రామంలో తాత్కాలిక స్థిర నివాసం. పట్టుదలతో సివిల్స్ పరీక్ష రాశాడు. 551వ ర్యాంకుతో ఠీవిగా నిలబడ్డాడు. అతనే సిద్ధప్ప, బావ్వ దంపతుల మూడో కుమారుడు బీరప్ప సిద్ధప్ప ఢోని. ఆయన ప్రాథమిక విద్య మొత్తం మహారాష్ట్రలోని స్వగ్రామం తన్నూరు ఎమగెలోనే సాగింది. మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. తపాలా శాఖలో ఉద్యోగం సాధించాడు. వెంటాడుతున్న అసంతృప్తిని తప్పించుకోలేక ఉద్యోగానికి రాజీనామా చేశాడు. సివిల్స్‌పై దృష్టి సారించాడు. మూడో ప్రయత్నంలో జాతీయ స్థాయి 551వ ర్యాంకు సాధించాడు. తొలి ప్రయత్నంలో 30 మార్కుల్లో, రెండో ప్రయత్నంలో కేవలం 3 మార్కుల్లో అవకాశాన్ని కోల్పోయినా నిరాశకు లోనుకాలేదు. పట్టు విడవకుండా మూడో ప్రయత్నంలో ర్యాంకు సాధించాడు. గొర్రెలు కాసే యువకుడు సివిల్స్ సాధించడంతో నానావాడి గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. విజేతను అభినందించారు. మూలలను మరిచిపోని బీరప్ప తన ఆనందాన్ని బంధుమిత్రులు, గ్రామస్థులతోనే కాదు... తను నిత్యం ప్రేమగా చూసుకొనే గొర్రెలతో కూడా పంచుకున్నారు.

3 బ్యారేజీలు ప్రమాదంలోనే!

(మొదటి పేజీ తరువాయి)



మేడిగడ్డ ప్రాజెక్టు (ఫైల్)

ఒత్తిడి ఎక్కువైతే మొత్తం పూర్తి బ్యారేజీలకే ప్రమాదమని పేర్కొంది. మూడు బ్యారేజీల్లోని ప్రతి ఒక్కటి ఈ ప్రమాదపుటంచులో ఉంటాయని తెలిపింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు దెబ్బతిన్న నేపథ్యంలో ఏం చేయాలన్న దానిపై ఎన్‌డీఎస్ఏను నివేదిక ఇవ్వాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం గతంలో కోరిన సంగతి తెలిసిందే. పలు పరీక్షలు చేసిన అనంతరం, దాదాపు 14 నెలల అధ్యయనం తర్వాత ఎన్‌డీఎస్ఏ తన నివేదికను గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి పంపించింది. నివేదికలో అనేక కీలక సిఫార్సులు చేసింది. సమగ్ర పునర్ నిర్మాణ డిజైన్ చేయాలని, జియో ఫిజికల్ పరీక్షలు, జియో టెక్నికల్ పరీక్షలు చేసి, ఆధునిక హైడ్రాలిక్ నమూనా లు(నీటి ప్రవాహ ఒత్తిడికి సంబంధించిన నమూనాలు)ను ఉపయోగించి ఈ పునర్ నిర్మాణ రీడిజైన్ చేయాలని చెప్పింది. కాళేశ్వరం ప్రాజెక్టు స్థిరత్వం, స్థితిస్థాపకతను నిర్ధారించేందుకు... అన్ని విభాగాల మధ్య సహకారం చాలా కీలకమని స్పష్టం చేసింది. నిర్మాణ సమయంలో నాణ్యతను తనిఖీ చేసే మంచి వ్యవస్థ లేదని, ప్రత్యేకించి కటాఫ్ గోడలు నీటి ఒత్తిడిని తట్టుకునేలా నిర్మించలేదని తెలిపింది. ర్యాఫ్ట్‌కు, కటాఫ్ వాల్స్‌కు నేరుగా సంబంధం ఉందని చెప్పింది. బ్యారేజీలు దెబ్బతినడానికి ఈ రెండూ ప్రధాన కారణాలని తెలిపింది. బ్యారేజీపై అదే ఒత్తిడి పడితే మొత్తం బ్యారేజీ అంతా ప్రమాదంలో పడుతుందని వెల్లడించింది. మిగతా రెండు బ్యారేజీల పరిస్థితి కూడా అదే విధంగా ఉన్నట్లు తెలిపింది.

కటాఫ్ గోడల్లో రంధ్రాలు...మిగతా బ్లాక్‌లకు ప్రమాదమే

"మేడిగడ్డ బ్యారేజీ ఎగువ భాగంలో 20-21 పియర్స్ దగ్గర, దిగువ భాగంలో 7వ పియర్ దగ్గర భారీ రంధ్రాలు పడ్డాయి. బ్యారేజీ కటాఫ్ గోడల్లో ఇంకా కనిపించని అదనపు రంధ్రాలు ఉండి ఉండొచ్చు. ప్రాజెక్టు ఖాళీగా ఉంది కాబట్టి ఇప్పుడు అవి బయటపడవు. ఒకసారి నీళ్లతో నిండితే అవన్నీ బయటపడతాయి. అప్పుడు బ్యారేజీలోని అన్ని బ్లాకులూ ప్రమాదంలో పడే అవకాశం ఉంటుంది. దీనిపై లోతుగా అధ్యయనం చేయాలి' అని నివేదికలో పేర్కొన్నారు.

మేడిగడ్డ ఎందుకు కుంగిందంటే

మేడిగడ్డలో బ్లాక్ 7 కుంగడానికి, ర్యాఫ్ట్ కింద పెద్ద గుంతలు ఏర్పడటానికి అక్కడున్న మట్టి నీటి ఒత్తిడికి కొట్టుకుపోవడమే కారణమని నివేదిక తెలిపింది. పియర్ కుంగడానికి అక్కడున్న గేటు ఎత్తడం, నీరు రావడం కారణం కాదని తేల్చింది. 7వ బ్లాక్ గేట్లు అసలు పెద్దగా ఎత్తిందే లేదని, అక్కడి రికార్డుల్లో ఈ విషయం నమోదై ఉందని గుర్తు చేసింది. గేట్ల నుంచి వచ్చిన నీరే కారణమై ఉంటే 6, 7 బ్లాకుల్లోని పియర్లు కూడా కుంగిపోయేవని చెప్పింది. ఏడో బ్లాక్‌లోని గేట్ల కంటే ఆరో బ్లాక్ గేట్లనే ఎక్కువసార్లు తెరిచారని ప్రస్తావించింది. గేట్లను ఎత్తి నీళ్లు వదలడం వల్ల సీకెంట్ ఫైల్స్ కుంగలేదని స్పష్టం చేసింది. నీళ్లు పడడం, సీకెంట్ ఫైల్ కుంగిపోవడం రెండూ సంబంధం లేని రెండు అంశాలని తేల్చిచెప్పింది.

బ్లాక్ 7 కుంగడానికి ప్రధాన కారణం నాణ్యతా లోపమేనని స్పష్టత ఇచ్చింది.

సీడబ్ల్యూసీ అనుమతి తీసుకున్నాకే మేడిగడ్డ ఏడో బ్లాకు పూర్తిగా నిరుపయోగంగా మారిందని, ఇవే రకమైన సమస్యలు మిగిలిన బ్లాకుల్లోనూ ఉన్నాయని నివేదిక పేర్కొంది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని వివరించింది. మూడు బ్యారేజీలు ప్రస్తుత స్థితిలో నిరుపయోగంగా మారాయని తేల్చింది. "అన్ని రకాల పరీక్షలు/అధ్యయనాలు చేశాక దీర్ఘకాలిక ప్రయోజనాల రీత్యా ఈ బ్యారేజీలను పునరుద్ధరణ చేపట్టాలి. ఈ బ్యారేజీల పునరుద్ధరణ కోసం ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసి, దీన్ని కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) అనుమతులు తీసుకొని అమలు చేయాలి" అని ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీ తేల్చిచెప్పింది. ఈ పరిశోధనలు/అధ్యయనాల కోసం దేశంలోని ప్రతిష్ఠాత్మక సంస్థల సేవలను వినియోగించుకోవాలని సూచించింది. మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి నిర్మాణ, నిర్వహణ, డిజైన్ లోపాలే కారణమని స్పష్టం చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ సమయంలో భూభౌతిక, భూసాంకేతిక పరీక్షలు చేయలేదని నివేదిక ప్రస్తావించింది. ఆ పరీక్షలు చేయకుండానే రెండు బ్యారేజీల నిర్మాణ ప్రాంతాలను మార్చారని ఆక్షేపించింది. 2016లో బ్యారేజీల నిర్మాణం ప్రారంభించగా, 2019లో పూర్తయిందని, పూర్తయిన రోజు నుంచి కుంగిపోయే దాకా ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్ ఎం) పనులే చేయలేదని ప్రస్తావించింది. కనీసం బ్యారేజీలను ఏ విధంగా నిర్మించాలనే ప్రమాణాలకు సంబంధించిన వివరాలు కూడా లేవని తప్పుపట్టింది. ఏడో బ్లాకు కుంగుబాటుకు సీకెంట్ పైల్స్ అమరిక సరిగ్గా లేకపోవడమే కారణమని, బ్యారేజీల్లో నీటి నిల్వతో ఒత్తిడి పెరిగి, పిల్లర్ల కింది నుంచి ఇసుకంతా జారి, ఏడో బ్లాకు కుంగిందని వివరించింది. మేడిగడ్డలో భారీ వరదను నిర్వీర్యం చేసే వ్యవస్థలు లేవని తెలిపింది. గేట్ల నుంచి వేగంగా దూకే వరదలో తీవ్రమైన పీడనశక్తి ఉంటుందని, ఆ శక్తిని నిర్వీర్యం చేయడానికి దిగువన టెయిల్‌పాండ్‌ను డిజైన్‌లోనే ప్రతిపాదించ లేదని వెల్లడించింది. దీనివల్ల బ్యారేజీ దిగువభాగంలో రక్షణ వ్యవస్థలన్నీ దెబ్బతిని, బ్యారేజీ వైఫల్యం చెందిందని చెప్పింది. అన్నారం, సుందిళ్లలోనూ ఇదే పరిస్థితి ఉందని వెల్లడించింది. "నిరంతర వరదలు, బ్యారేజీ ర్యాఫ్ట్(పునాది) కింద రక్షణ కోసం ఇసుక మైనింగ్ జరుగకుండా కట్టడి చేయలేకపోవడం వల్ల సీపేజీల కట్టడి కోసం వినియోగించిన సీకెంట్ పైల్స్ వరకు గుంతలు విస్తరించాయి. దాంతో సీకెంట్ పైల్స్ దెబ్బతినడంతో ర్యాఫ్ట్ కింద నుంచి ఇసుక కొట్టుకుపోయి బుంగలు ఏర్పడ్డాయి" అని తెలిపింది. ఏడో బ్లాకు కుంగుబాటుకు ఇదే కారణమని గుర్తు చేసింది. మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి సరైన కారణాలు తెలుసుకోవడానికి జియో ఫిజికల్/జియో టెక్నికల్ పరీక్షలు చేయాల్సి ఉందని, గ్రౌటింగ్ చేయడంతో వాస్తవాలు తెలుసుకోలేక పోయామని చెప్పింది. మేడిగడ్డ బ్యారేజీలోని కుంగిన బ్లాకు-7 అంతా తొలగించాలని సిఫారసు చేసింది.

పరీక్షలు లేకుండానే అన్నారం, సుందిళ్ల స్థలాల మార్పు

"బ్యారేజీల నిర్మాణం చేయడానికి నిర్మాణ ప్రదేశాల్లో భూసారం తెలుసుకోవడానికి తగిన పరీక్షలు చేయాలి. అయితే అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఒకచోట ప్రతిపాదించి, మరో చోటికి మార్చారు. ఈక్రమంలో భూభౌతిక, భూసాంకేతిక పరీక్షలు చేయకుండానే నిర్మాణం చేపట్టారు. ప్రాజెక్టుల డీపీఆర్‌కు అనుమతి రాకముందే నిర్మాణం చేపట్టారు" అని నివేదిక ఆక్షేపించింది.

వానాకాలానికి ముందు, తర్వాత రిపోర్టుల్లేవు

"జాతీయ ఆనకట్టల భద్రత చట్టం-2021 ప్రకారం వానాకాలానికి ముందు, తర్వాత బ్యారేజీలు ఏ విధంగా ఉన్నాయనే దాన్ని పరిశీలించాలి. 2022 వరదల కన్నా ముందు, తర్వాత బ్యారేజీలు ఏ విధంగా ఉన్నాయనే దాన్ని పరిశీలించలేదు. నిబంధనల ప్రకారం ఈ రిపోర్టులు తయారుచేసే బాధ్యత డ్యామ్ ఓనర్‌దే(మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల చీఫ్ ఇంజనీర్). అయితే డ్యామ్ సేఫ్టీ చట్టం ప్రకారం బ్యారేజీలను పరిశీలించనే లేదు. మూడు బ్యారేజీల్లోనూ హైడ్రో మెకానికల్ లోపాలున్నాయి" అని నివేదిక గుర్తు చేసింది.

ఏడో బ్లాకునంతా తొలగించాల్సిందే

మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాకును పూర్తిగా తొలగించాల్సిందేనని ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. డిజైన్, నిర్మాణ లోపాలతో ఈ బ్లాకు నిరుపయోగంగా మారిందని తేల్చింది. బ్యారేజీల వైఫల్యానికి ప్రధాన కారణాలు.

- భీకర వరదను తట్టుకునే/నిర్వీర్యం చేసే ఏర్పాట్లు బ్యారేజీల దిగువ భాగంలో లేవు.
- బ్యారేజీల రేడియల్ గేట్లు సరిగ్గా లేవు. దీనివల్ల హైడ్రాలిక్ జంప్‌లు చోటు చేసుకున్నాయి.
- బ్యారేజీ నిర్మాణంలో షీట్‌పైల్స్ వినియోగించాలి. సీకెంట్ ఫైల్స్ వాడారు. సరైన అమరిక లేకపోవడంతో వీటిలో నుంచి నీరు జారి... క్రమంగా పిల్లర్ల కింది నుంచి ఇసుక జారి, బ్యారేజీ కుంగింది.
- బ్యారేజీల నిర్మాణ ప్రదేశాల్లో భూభౌతిక(జియో ఫిజికల్), భూసాంకేతిక(జియో టెక్నికల్) పరీక్షలు చేయలేదు.
- మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు గల కారణాలు సమగ్రంగా విశ్లేషణ చేయడానికి బోర్‌హోల్స్ వేసి, సమగ్రంగా వివరాలు సేకరించాల్సి ఉండగా... గ్రౌటింగ్ చేయడంతో వాస్తవాలు వెలుగులోకి రాలేదు.
- 2019 నుంచి అన్నారం, సుందిళ్ల బ్యారేజీల దిగువ భాగంలో సిమెంట్ కాంక్రీట్ బ్లాకులన్నీ చెల్లాచెదురు అవుతున్నాయి. 2020, 2021లో సీపేజీ కట్టడికి తాత్కాలికంగా చర్యలు తీసుకున్నా ఫలితం లేదు. సీపేజీలకు శాశ్వత పరిష్కారం చూపకుండా తాత్కాలిక చర్యలు తీసుకోవడం విచారకరం.



భర్తను కోల్పోయిన సోహిని అధికారి

నాన్న ఎక్కడమ్మా?

తల్లికి మూడేళ్ల బాలుడి ప్రశ్న

బిడ్డకు ఏమీ చెప్పలేక ఏడ్చిన మాతృమూర్తి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: ఆ భయానక దృశ్యాన్ని కళ్లారా చూశాడు కాబోలు.. తల్లి పొత్తిళ్లలో ఆదమరిచి నిద్రపోయిన ఆ మూడేళ్ల బాలుడు అర్ధరాత్రి ఉన్నట్టుండి నిద్రలేచాడు. బాబు ఒళ్లు కంపిస్తోంది. భయం కళ్లలోనూ కనిపిస్తోంది... రెండు చేతులతో తల్లి చేతులను గట్టిగా పట్టుకొని.. 'నాన్న ఎక్కడమ్మా?' అని వణుకుతున్న గొంతుతో ప్రశ్నించాడు. బిడ్డకు సమాధానం చెప్పలేక ఆ తల్లి కన్నీళ్లు ఆపుకోలేక ఏడ్చేసింది! పెహల్గాం ఉగ్రదాడిలో తన తండ్రి బితాన్ అధికారిని కోల్పోయిన మూడేళ్ల బిడ్డ గురించే ఇదంతా! మా కుటుంబాన్ని ఉగ్రవాదులు ఛిద్రం చేశారని సోహిని అధికారి కన్నీళ్లు పెట్టుకున్నాడు. అర్ధరాత్రి నిద్రలేచి నాన్న ఎక్కడ? అని అడిగిన నా బిడ్డకు.. 'మీ నాన్న ఎప్పటికీ తిరిగిరాడు' అనే చేదు నిజాన్ని ఎలా చెప్పగలను? అని సోహిని వాపోయింది. మూడేళ్ల బాబు చూస్తుండగానే.. తన భర్తను ఉగ్రవాదులు కాల్చి చంపారని ఆమె చెప్పింది.



పాకిస్థాన్ హైకమిషన్‌లోకి 'కేక్'..!

పహల్గాం దాడి నేపథ్యంలో.. ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ కార్యాలయంలోకి ఓ వ్యక్తి కేక్ బాక్సుతో వెళ్తున్న వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఈ దృశ్యాలను రిపబ్లిక్ టీవీ సహా.. పలు మీడియా సంస్థలు చిత్రీకరించాయి. "సంబురాలు జరుపుకొనేందుకు ఆ కేక్‌ని పాక్ హైకమిషన్ కార్యాలయానికి తీసుకెళ్తున్నారా?" అని విలేకరులు అడిగిన ప్రశ్నకు.. ఆ వ్యక్తి ఎలాంటి సమాధానం చెప్పకుండా ముందుకు సాగడం వీడియోలో కనిపిస్తుంది.



వ్యాపారుల నిరసనలు

పహల్గాం దాడితో తమకే తీవ్ర నష్టం జరుగుతోందని జమ్మూకశ్మీర్‌లోని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధ, గురువారాల్లో వారు ముక్తకంఠంతో ఈ దాడిని ఖండించారు. దాల్ సరస్సులో లాంచీలు, పడవలు నడిపేవారు కూడా పహల్గాం మృతులకు సంతాపం తెలుపుతూ.. ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. సరస్సులో పడవలను వరుసగా పెట్టి.. ప్లకార్డులతో తమ ఆందోళనను వ్యక్తపరిచారు. ఉగ్రదాడులు తమ జీవనోపాధిని దెబ్బతీస్తాయని వారు వ్యాఖ్యానించారు.



పెళ్లి ఆగిపోయింది

పాకిస్థాన్‌పై భారత్ విధించిన ఆంక్షలతో ఓ యువకుడి పెళ్లి నిలిచిపోయింది. రాజస్థాన్‌కు చెందిన సైతాన్‌సింగ్‌కు అట్టారీ సరిహద్దు అవతల.. పాకిస్థాన్‌లో ఉన్న యువతితో వివాహం నిశ్చయమైంది. శుక్రవారం పెళ్లి. అయితే.. వరుడి తరఫు వారు కొందరు ఇప్పటికే పాకిస్థాన్‌కు వెళ్లగా.. సైతాన్‌సింగ్ ఇక్కడే ఉండిపోయాడు. సరిహద్దులను మూసివేయడంతో.. ఇప్పుడేంచేయాలో పాలుపోవడంలేదని ఆయన మీడియాతో వాపోయారు.



ఉగ్రవాదులకు గుణపాఠం నేర్పాలి

- పర్యాటకుల మతం తెలుసుకుని పాశవికంగా కాల్చి చంపారు
- ఉగ్రవాదులకు పాకిస్థాన్ మద్దతు: ఒవైసీ

హైదరాబాద్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్ పహల్గాంలో పర్యాటకుల ప్రాణాలు తీసిన ఉగ్ర మూకలకు తగిన గుణపాఠం నేర్పాలని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు. శాంతి భద్రతలను కాపాడేందుకు కేంద్రం తీసుకునే చర్యలకు మద్దతు ఇస్తామన్నారు. పర్యాటకుల మత విశ్వాసాలను తెలుసుకుని ఉగ్రవాదులు పాశవికంగా కాల్చి చంపారని, వీరి తూటాలకు ఓ ముస్లిం యువకుడు కూడా ప్రాణాలు కోల్పోయాడని ఒవైసీ తెలిపారు. ఉగ్రవాదులకు పాకిస్థాన్ మద్దతు ఉందని ఒవైసీ ఆరోపించారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించే చర్యలకు మజ్లిస్ మద్దతు ఇస్తుందన్నారు.

అంతమొందించేందుకు ఎంతవరకైనా..



(మొదటిపేజీ తరువాయి)

మౌనం పాటించి, మృతులకు అంజలి ఘటించారు. అనంతరం దాడి గురించి ప్రధాని స్పందించారు. పాకిస్థాన్‌కు పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు. "పహల్గాంలో దాడికి పాల్పడిన ఉగ్రవాదులను, ఈ కుట్రకు సహకరించిన వారిని.. వారు కలలో కూడా ఊహించని విధంగా శిక్షిస్తాం" అని మోదీ స్పష్టం చేశారు. సాధారణంగా హిందీ, ప్రాంతీయ భాషల్లో ప్రసంగాన్ని ఆరంభించే ప్రధాని.. గురువారం హఠాత్తుగా కొద్దిసేపు ఆంగ్లంలో మాట్లాడారు. "మిత్రులారా.. బిహార్ గడ్డపై నుంచి యావత్ ప్రపంచానికి నేను ఒక్కటే చెబుతున్నా. అమాయకుల ప్రాణాలు తీసిన ప్రతి ఉగ్రవాదినీ భారత్ వెతికి పట్టుకుంటుంది. వారి వెనక ఉన్నవారినీ వదిలిపెట్టబోం. అందరినీ కఠినంగా శిక్షిస్తాం. వారి అంతు చూసేందుకు ఎంతవరకైనా వెళ్తాం. భారతదేశ స్ఫూర్తిని ఉగ్రవాదం ఎప్పటికీ విచ్ఛిన్నం చేయలేదు. ఉగ్రవాదాన్ని క్షమించే ప్రసక్తే లేదు" అని పేర్కొన్నారు. ఉగ్రవాదంపై పోరులో భారత్ వెనక్కి తగ్గదన్న సందేశాన్ని, ముష్కరులకు హెచ్చరికనూ మోదీ ప్రపంచానికి తెలియజేసేందుకే ఆంగ్లంలో మాట్లాడారు. అనంతరం ఆయన హిందీలో ప్రసంగించారు. "బాధితులకు న్యాయం చేసేందుకు అన్ని రకాలుగా ప్రయత్నిస్తాం. యావత్ దేశం దీనికి కట్టుబడి ఉంటుంది. మానవత్వంపై నమ్మకం ఉన్న ప్రతి ఒక్కరూ మనతోనే ఉన్నారు. ఈ కష్ట సమయంలో అనేక దేశాల ప్రజలు, నేతలు మనకు మద్దతుగా నిలిచారు. వారందరికీ ధన్యవాదాలు" అని ప్రధాని చెప్పారు. 140 కోట్ల మంది భారతీయుల సంకల్పం ఉగ్రవాదం వెన్ను విరిస్తుందన్నారు. పహల్గాంలో ఉగ్రవాదులు 26 మంది అమాయకులను పొట్టనపెట్టుకున్న దారుణ ఘటనను దేశమంతా ఖండిస్తోందని, బాధితుల కుటుంబాలకు అండగా నిలుస్తోందని చెప్పారు. క్షతగాత్రులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఈ ఉగ్రదాడి కారణంగా ఓ తల్లి కుమారుడిని, ఓ మహిళ సోదరుడిని, మరో మహిళ జీవిత భాగస్వామిని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. "కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతి ఒక్కరిలోనూ బాధ, ఆగ్రహం ఉన్నాయి. ఇది కేవలం పర్యాటకులపై జరిగిన దాడి కాదు. భారత ఆత్మపై దాడి చేసేందుకు శత్రువులు చేసిన దుస్సాహసం" అని ప్రధాని పేర్కొన్నారు. ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు దేశం మొత్తం దృఢ సంకల్పంతో ఉందన్నారు. ఉగ్రవాదుల స్వర్గధామాన్ని నిర్వీర్యం చేసేందుకు సమయం ఆసన్నమైందని మోదీ స్పష్టం చేశారు.

ఉగ్ర క్యాంపులను..

నాశనం చేయాల్సిందే!

మోదీ సర్కారు ఏ చర్య తీసుకున్నా మద్దతుగా నిలుస్తాం

- ఉగ్రవాదంపై కలసికట్టుగా పోరాడుదాం
- అఖిలపక్ష సమావేశం ప్రకటన



గురువారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి హాజరైన వివిధ పార్టీల నేతలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): దేశంలో కల్లోలం రేపుతున్న పాక్ ప్రేరేపిత ఉగ్రవాద క్యాంపులను నాశనం చేయాల్సిందేనని అఖిలపక్షం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. పహల్గాం దాడి నేపథ్యంలో మోదీ సర్కారు ఏ చర్య తీసుకున్నా పూర్తి మద్దతు ఇస్తామని ప్రకటించింది. జాతీయ భద్రత విషయంలో రాజకీయాలకు తావు లేదని, ఉగ్రవాదంపై కలసికట్టుగా పోరాడుతామని స్పష్టం చేసింది. గురువారం పార్లమెంట్ ప్రాంగణంలో అఖిలపక్ష సమావేశం జరిగింది. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో కేంద్ర మంత్రులు అమిత్ షా, జైశంకర్, నిర్మల సీతారామన్, కిరెణ్ రిజిజు ప్రభుత్వం నుంచి పాల్గొనగా.. ప్రతిపక్షాల నుంచి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే, బీజేడీ నేత సస్మిత్ పాత్రా, ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్, తృణమూల్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ, టీడీపీ నేత లావు కృష్ణదేవరాయలు, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తదితరులు పాల్గొన్నారు. తొలుత ఉగ్రదాడి మృతులకు అంతా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఉగ్రదాడి ఘటన గురించి, దానిపై ఇప్పటివరకు తీసుకున్న చర్యల గురించి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వివరాలు వెల్లడించారు. అఖిలపక్షంలో పాల్గొన్న నేతలందరూ ప్రభుత్వానికి మద్దతు తెలిపారు. జాతీయ భద్రత విషయంలో రాజకీయాలకు తావు లేదని, కలిసికట్టుగా నిలుద్దామని చెప్పారు.

కఠిన చర్యలు చేపట్టే ఉద్దేశంతో ప్రభుత్వం..

అఖిలపక్షం అనంతరం కిరెణ్ రిజిజు మాట్లాడారు. ఉగ్రదాడి అంశంలో అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ భేటీలో వెల్లడించారని చెప్పారు. దాడి వెనుక పాక్ హస్తం ఉందని, వారికి ఎలా గుణపాఠం చెప్పాలని అనుకుంటున్నదీ వివరించారని తెలిపారు. ప్రభుత్వానికి అన్ని విధాలా మద్దతు ఇస్తామని తనతో సహా ప్రతిపక్ష నేతలంతా ముక్తకంఠంతో చెప్పారని రాహుల్‌గాంధీ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఉగ్ర దాడిని తీవ్రంగా ఖండించారని మల్లికార్జున ఖర్గే చెప్పారు. సాధ్యమైనంత త్వరగా జమ్ముకశ్మీర్‌లో శాంతి ఏర్పడటం అవసరమన్నారు. ఉగ్రదాడిలో గాయపడి అనంతనాగ్‌లో చికిత్స పొందుతున్న వారిని రాహుల్ గాంధీ శనివారం పరామర్శించనున్నారని తెలిపారు. ఇక భద్రతా వైఫల్యంపై చర్చించామని, తగిన చర్యలు తీసుకోవాలని కోరామని ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్, తృణమూల్ ఎంపీ సుదీప్ వివరించారు.

రాజకీయాలకు తావు లేదు: లావు శ్రీకృష్ణ

గత పదేళ్లలో కశ్మీర్‌లో భద్రతను ఎంతగా పెంచారో, ఉగ్రవాద చర్యలు ఎలా తగ్గుముఖం పట్టాయో అఖిలపక్షంలో కేంద్రం వివరించిందని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. దేశ భద్రతలో రాజకీయాలకు తావు లేదని చెప్పారు. ఢిల్లీలో అఖిలపక్ష భేటీ అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. "కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదం, జాతీయ భద్రతపై ఎంత దూరం వెళ్లినా మద్దతుగా నిలుస్తాం. టీడీపీ తరఫున పూర్తి సహకారం ఉంటుంది. నేను పదిరోజుల క్రితమే కశ్మీర్‌లోని గుల్మార్గ్ వెళ్లి స్థానికులను కలిశాను. గత ఐదారేళ్లలో టూరిజం ఎంతో అభివృద్ధి చెందిందని, తమకు ఉపాధి గణనీయంగా పెరిగిందని వారు సంతోషం వ్యక్తం చేశారు. పదిరోజులు కాకముందే ఉగ్రదాడితో పరిస్థితి మారిపోయింది. ఉగ్రవాదాన్ని నిర్మూలించడమేకాదు.. కశ్మీర్ పట్ల నెలకొన్న భయానక వాతావరణాన్ని తొలగించాల్సిన బాధ్యత మనపై ఉందని టీడీపీ తరఫున అఖిలపక్షంలో వివరించాను. ఉగ్రదాడి జరిగిన బైసరన్ వద్ద నెలన్నర తర్వాత పర్యాటకాన్ని ప్రారంభించనున్నారు. కానీ ఇంతలోనే ఎటువంటి సమాచారం లేకుండానే, కొందరు అక్కడికి టూరిస్టులను తీసుకెళ్లారు. సమాచార లోపంతో సమస్య తలెత్తింది. ఏదేమైనా ఉగ్రదాడి బాధాకరం" అని శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. కాగా, ఉగ్రవాదాన్ని తుదముట్టించడంలో కేంద్రానికి అన్ని విధాలుగా మద్దతుగా నిలుస్తామని వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఉగ్రవాదంపై యుద్ధం జరగాలన్నారు.

భద్రతా వైఫల్యం నిజమే!?

పహల్గాం ఉగ్రదాడి వెనుక భద్రతా వైఫల్యం కూడా ఉందని అఖిలపక్ష భేటీలో కేంద్ర ప్రభుత్వం అంగీకరించినట్టు సమాచారం. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల పత్రిక ఇండియా టుడే ఈ వివరాలను వెల్లడించింది. బైసరన్ ప్రాంతంలో భద్రతా బలగాలు ఎందుకు లేవని ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నించగా.. "అక్కడ ఎలాంటి తప్పూ జరగకపోతే.. మనం ఇక్కడ ఎందుకు భేటీ అవుతాం. ఏవో అంశాల్లో వైఫల్యం జరిగింది. అదేమిటో తేల్చాల్సి ఉంది. అమర్‌నాథ్ యాత్ర మొదలయ్యే వరకు కూడా బైసరన్ ప్రాంతంలో నిషేధం ఉంటుంది. కానీ స్థానిక అధికారులు భద్రతా బలగాలకు సమాచారం ఇవ్వకుండానే.. పర్యాటకులను అనుమతించారు." అని ఈ భేటీలో ప్రభుత్వం తరఫున పాల్గొన్న నేత వెల్లడించినట్టు సమాచారం.

తుడిచి పెట్టేయాల్సిందే..!

లాడెన్‌కు, పాక్ ఆర్మీ చీఫ్‌కు తేడా లేదు

అమెరికా రక్షణ శాఖ మాజీ అధికారి రూబెన్

న్యూఢిల్లీ/శ్రీనగర్, ఏప్రిల్ 24: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో దేశంతో పాటు అంతర్జాతీయంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. పాకిస్థాన్‌ను ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే చేసే దేశంగా అధికారిక ముద్ర వేయాలని అమెరికా ప్రభుత్వానికి ఆ దేశ రక్షణ శాఖ మాజీ అధికారి మిచెల్ రూబెన్ అన్నారు. పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌పై ధ్వజమెత్తారు. ఆయనకు, బిన్ లాడెన్‌కు తేడా లేదని, ఉగ్రవాదానికి మద్దతు ఇస్తున్నారని అన్నారు. ఉగ్రవాదుల మారణకాండకు భారత్ కూడా ప్రత్యక్షంగా తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. 'హమాస్ దాడి తర్వాత ఇజ్రాయెల్ చూపిన అదే స్పష్టతతో భారత్ ప్రతిస్పందించాలి' అని కోరారు. స్పష్టంగా చెప్పాలంటే.. హమాస్ విషయంలో ఇజ్రాయెల్ వ్యవహరించిన విధంగానే.. పాకిస్థాన్, పాక్ ఐఎస్ఐ విషయంలో చేయడం ప్రస్తుతం భారత్ విధి అని అన్నారు. 'కశ్మీర్ పాకిస్థాన్ జీవనాడి' అంటూ ఇటీవల పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ చేసిన వ్యాఖ్యలను ఆయన ప్రస్తావించారు. ఆయన చేసిన ప్రసంగం ఉగ్రవాదానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు ఉందన్నారు. 'భారత్ ఇప్పుడు చేయాల్సింది ఆ జీవనాడిని కత్తిరించడమే..' అని స్పష్టం చేశారు.

తిరగబడాలి: జమ్మూ కశ్మీర్ మాజీ డీజీపీ

పహల్గాం ఉగ్రదాడిని 'పుల్వామా-2 ఘటన'గా జమ్మూకశ్మీర్ మాజీ డీజీపీ శేష్ పాల్ పోల్చారు. అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి చేసిన విధంగానే ఇది కూడా ఉందన్నారు. పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ ఇటీవల చేసిన 'హిందూ వ్యతిరేక' ప్రసంగం గురించి ప్రస్తావించారు. ఇజ్రాయెల్ చేసినట్లుగానే భారత ప్రభుత్వం కూడా ప్రతిస్పందించాలని, పాకిస్థాన్‌ను నాలుగు ముక్కలు చేయాలని ఆయన కోరారు. భారత ప్రభుత్వం పాక్ ఆర్మీ వెన్ను విరిచేయాలని, పాకిస్థాన్‌ను 4 ముక్కలు చేయాలని పాల్ అన్నారు.

పీవోకేలో హమాస్ నేతలు

2023, అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడికి, తాజాగా పహల్గాంలో ఉగ్రవాదుల మారణకాండకు పోలికలున్నాయని భారత్‌కు ఇజ్రాయెల్ రాయబారి రువెన్ అజార్ అన్నారు. రెండు ఘటనల్లోనూ సాధారణ పౌరులను లక్ష్యంగా చేసుకున్నారని పేర్కొన్నారు. పీవోకేలో ఇటీవల హమాస్ నేతలు పర్యటించారని, అక్కడ జైషే మహ్మద్ ఉగ్రవాదులను కలిసినట్లు తెలిసిందని తెలిపారు. ఆ తర్వాతనే జరిగిన పహల్గాం దాడి అనుమానాలకు తావిస్తోందన్నారు.

పోటాపోటీ క్షిపణి పరీక్షలు

ఎంఆర్-ఎస్ఏఎంను పరీక్షించిన భారత నౌకాదళం

ఒకటి రెండు రోజుల్లో పరీక్షలకు పాక్ నోటమ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడితో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తలు తారస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో అరేబియా సముద్ర ప్రాంతంలో ఇరు దేశాలూ పోటాపోటీగా క్షిపణి పరీక్షలు నిర్వహించాయి. తాము క్షిపణి పరీక్షలు చేపడతామంటూ పాకిస్థాన్ మిలటరీ నోటమ్ జారీ చేసిన క్రమంలో.. భారత నౌకాదళం సైతం అరేబియా సముద్రంలో క్షిపణి పరీక్షను విజయవంతంగా చేపట్టింది. నేవీకి చెందిన స్వదేశీ గైడెడ్ క్షిపణి విధ్వంసక నౌక ఐఎన్ఎస్ సూరత్ నుంచి సీ స్కిమ్మింగ్ టార్గెట్లను ఛేదించే సత్తా కలిగిన క్షిపణిని పరీక్షించింది. 70 కిలోమీటర్ల పరిధిలో టార్గెట్లను ఛేదించగలిగిన మీడియం రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్(ఎంఆర్-ఎస్ఏఎం)ను పరీక్షించారు. ఈ సందర్భంగా లక్ష్యాన్ని అది అత్యంత కచ్చితత్వంతో ఛేదించిందని భారత నౌకాదళం గురువారం వెల్లడించింది. కాగా, ఈ ఏడాది జనవరిలో ప్రధాని మోదీ ముంబైలోని నేవల్ డాక్‌యార్డులో ఐఎన్ఎస్ సూరత్‌ను ప్రారంభించారు. ఇదొక పీ15బీ క్షిపణి విధ్వంసక యుద్ధనౌక.

నోటమ్ జారీ చేసిన పాక్

పహల్గాం ఉగ్రదాడి అనంతరం తాము ఉపరితలంపై నుంచి ఉపరితలంపైకి ప్రయోగించే క్షిపణి పరీక్షలను చేపడతామంటూ పాకిస్థాన్ మిలటరీ నోటమ్ (నోటీస్ టు ఎయిర్ మెన్/మెరైనర్స్) జారీ చేసింది. గురు, శుక్ర వారాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తామని అందులో పేర్కొంది. కానీ.. అదే సమయంలో ఐఎన్ఎస్ సూరత్ నుంచి భారత నౌకాదళం సీ స్కిమ్మింగ్ టార్గెట్లను ఛేదించే మీడియం రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్‌ను పరీక్షించడం గమనార్హం. వాస్తవానికి ఉపరితలంపై నుంచి ఉపరితలంపైకి ప్రయోగించే క్షిపణులపై ఎంఆర్-ఎస్ఏఎంలు ప్రభావవంతంగా పనిచేస్తాయి. కాగా, అరేబియా సముద్ర ప్రాంతంలో పాక్ నేవీ నావికాదళ విన్యాసాలు ప్రారంభించిందని, దీనిలో క్షిపణి పరీక్ష కూడా ఉందని భారత రక్షణ, భద్రత వర్గాలు తెలిపాయి. పాక్ తన గగనతల రక్షణ వ్యవస్థను అప్రమత్తం చేసిందని, భారత విమానాల కదలికలను ట్రాక్ చేయడానికి వారి అవాక్స్ నిరంతర నిఘా పెట్టిందని ఆ వర్గాలు వెల్లడించాయి.

అరేబియా జలాల్లోకి ఐఎన్ఎస్ విక్రాంత్



పహల్గాం దాడి అనంతరం.. పాకిస్థాన్ అరేబియా సముద్ర ప్రాంతంలో క్షిపణి ప్రయోగాలు ప్రారంభించింది. దీనికి ప్రతిస్పందనగా భారత నౌకాదళం కూడా విమాన వాహక యుద్ధనౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌ను రంగంలోకి దింపింది. ఇది కర్ణాటకలోని కార్వార్ నావల్ బేస్ నుంచి అరేబియా సముద్రంలోకి వెళ్తున్నట్టు ఉపగ్రహ చిత్రాల ద్వారా నిర్ధారణ అయింది. దేశీయంగా నిర్మించిన ఐఎన్ఎస్ విక్రాంత్ 262 మీటర్ల పొడవు, 59 మీటర్ల వెడల్పు ఉంటుంది. ఇది 40 ఫైటర్ జెట్లను మోసుకెళ్లగలదు. ఈ యుద్ధనౌకలో 2 స్క్వాడ్రన్ల మిగ్-29 యుద్ధవిమానాలు, పది కమోవ్ కేఏ-31 హెలికాప్టర్లు ఉన్నాయి. ఈ యుద్ధనౌక స్ట్రైక్ ఫోర్స్ పరిధి 1500 కి.మీ.

మూడంచెల భద్రత మధ్య ఉండే చోట

ఇంత దారుణమా?

- నిఘా వైఫల్యాలపై సమగ్ర విచారణ చేయాలి
- ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేందుకు.. బీజేపీ ఈ ఘటనను వాడుకోవడం బాధాకరం
- సీడబ్ల్యూసీ సమావేశంలో తీర్మానం



సీడబ్ల్యూసీ సమావేశంలో సోనియా, ఖర్గే, రాహుల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్ర దాడి పిరికిపందల చర్య అని, అది నేరుగా భారత ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. మూడంచెల భద్రత మధ్య ఉండే ప్రాంతంలో దారుణం జరిగిందని, ఇందులో నిఘా వైఫల్యాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. అందరం ఐక్యంగా ఉండాల్సిన ఈ సమయంలో.. ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తుండటం బాధాకరమని విమర్శించింది. ఉగ్రదాడికి నిరసనగా, మృతులకు నివాళిగా శుక్రవారం దేశవ్యాప్తంగా కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. పహల్గాం ఘటన నేపథ్యంలో గురువారం ఢిల్లీలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం నిర్వహించింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో.. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉగ్రదాడి మృతులకు నివాళిగా మౌనం పాటించారు.

అంతా సంయమనం పాటించాలి..

"పహల్గాం ఉగ్రదాడితో షాక్‌కు గురయ్యాం. ఇది నేరుగా ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి. దీనికి పాకిస్థానే ప్రధాన సూత్రధారి. దేశంలో ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకు ఉద్దేశపూర్వకంగా హిందువులను లక్ష్యంగా చేసుకుని దాడికి తెగబడ్డారు. ఇలాంటి సమయంలో అందరం కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. పహల్గాం మూడంచెల భద్రతా ఏర్పాట్ల మధ్య ఉండే ప్రాంతం. కేంద్ర పాలిత ప్రాంతం. అయినా ఉగ్రదాడి జరగడం బాధాకరం. నిఘా వైఫల్యాలు, భద్రతా లోపాలపై సమగ్ర విశ్లేషణ జరగాల్సిన అవసరం ఉంది. ఉగ్రదాడిని అన్ని రాజకీయ పార్టీలు, అన్ని వర్గాలు ఖండించిన తీరు హర్షణీయం. అయితే, ప్రజలను విభజించేలా, విద్వేషాన్ని ప్రోత్సహించేలా బీజేపీ వ్యవహరిస్తున్న తీరు బాధాకరం. బీజేపీ సోషల్ మీడియా వేదికల ద్వారా ఐక్యతను దెబ్బతీసేలా ప్రచారం చేయడం దిగ్భ్రాంతిని కలిగిస్తోంది" అని తీర్మానంలో కాంగ్రెస్ పేర్కొంది. ఉగ్రదాడి ఎన్నో ప్రశ్నలను లేవనెత్తుతోందని జమ్మూకశ్మీర్ సీఎల్పీ నేత గులామ్ అహ్మద్ మిర్ పేర్కొన్నారు. ఎప్పుడూ భద్రత ఉండే 'బైసారన్' పర్యాటక ప్రాంతంలో దాడి జరిగిన రోజున భద్రత ఎందుకు లేదని ఆయన ప్రశ్నించారు.

రెండున్నర గంటలు పరుగెడుతూనే ఉన్నాం

- మా కళ్ల ముందే చంద్రమౌళిని కాల్చేశారు
- మమ్మల్ని ఆ దేవుడే కాపాడాడు
- 'ఆంధ్రజ్యోతి'తో రెడ్డి శశిధర్, సుమిత్రాదేవి

విశాఖపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): 'పహల్గాంలో మమ్మల్ని దేవుడే కాపాడాడు. లేకుంటే అక్కడే చనిపోయేవాళ్లం. సుమారు రెండున్నర గంటలు కొండపై నుంచి కిందికి పరుగెడుతూనే ఉన్నాం'. విశాఖ నుంచి కశ్మీర్ పర్యటనకు వెళ్లి పహల్గాం కాల్పుల ఘటనలో ప్రాణాలతో బయటపడిన రెడ్డి శశిధర్, సుమిత్రాదేవి దంపతులు చెప్పిన సంగతులివీ. వీరితో కలిసి ఆ పర్యటనకు వెళ్లిన రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ చంద్రమౌళి ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన సంగతి తెలిసిందే. చంద్రమౌళికి వీరు అత్యంత సన్నిహితులు. విశాఖపట్నం లాసన్స్‌బే కాలనీలో నివసిస్తున్నారు. బుధవారం రాత్రి విశాఖపట్నం చేరుకున్న ఈ దంపతులను 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' గురువారం పరామర్శించింది. ఈ సందర్భంగా వారు చెప్పిన వివరాలు వారి మాటల్లోనే...'మేం మొత్తం పదిమంది కశ్మీర్ పర్యటనకు ఈ నెల 18వ తేదీన వెళ్లాం. 22న పహల్గాం వెళ్లాం. మధ్యాహ్నం 1.20 గంటల సమయంలో మేం ఇద్దరం, మరో నలుగురు కలిసి వాష్‌రూమ్‌కు వెళ్లాం. ఆ తర్వాత పది నిమిషాలకే కాల్పుల శబ్దం వినిపించింది. బయటకు వచ్చి చూస్తే సువిశాలమైన కొండపై సుమారుగా 400 మంది పర్యాటకులు అటూ ఇటూ పరుగులు తీస్తున్నారు. వారిని కొందరు తుపాకులతో వెంబడిస్తున్నారు. ఇదేదో ఉగ్రవాద చర్యలా ఉందని వెంటనే పక్కనే ఉన్న ఫెన్సింగ్ కింద నుంచి అటువైపు దిగిపోయి పరుగెత్తడం ప్రారంభించాం. మాతో పాటు చంద్రమౌళి, ఆయన భార్య నాగమణి కూడా ఉన్నారు. తలా ఒక దిక్కుకు పరుగెత్తి చెట్ల వెనుక దాక్కున్నాం. వెనక్కి తిరిగి చూస్తే చంద్రమౌళిని మోకాళ్ల మీద కూర్చోమంటూ ఓ సాయుధుడు గద్దిస్తున్నాడు. ఆ దృశ్యం చూడలేక కళ్లు మూసుకున్నాం. కొద్దిక్షణాలకే మళ్లీ కాల్పుల శబ్దం వినిపించింది. ప్రాణ భయంతో అక్కడి నుంచి కిందకు పరుగు తీస్తూనే ఉన్నాం. సాయంత్రం నాలుగు గంటలకు కొండ దిగువకు చేరుకున్నాం. అక్కడ భారత సైనికులు కనిపించారు. చంద్రమౌళి కాల్పుల్లో చనిపోయారని ఆరోజు రాత్రే మాకు తెలిసింది. కానీ, ఆయన భార్య నాగమణికి చెప్పలేదు.' అని రెడ్డి శశిధర్, సుమిత్రాదేవి దంపతులు వివరించారు.



బొట్టు కడిగేసుకున్నా

ఉగ్రవాదులు హిందువులనే టార్గెట్ చేశారని, ముస్లింలైతే వదిలేస్తున్నారని మా ఆయన నన్ను బొట్టు చెరిపేసుకోమన్నారు. అక్కడి వాగు నీళ్లతో బొట్టు చెరిగిపోయేలా ముఖం కడిగేసుకున్నా. ఎంతో బాధ అనిపించింది. ప్రాణాలు ముఖ్యం కాబట్టి ఆ పని చేయక తప్పలేదు.

- సుమిత్రాదేవి

సిమ్లా ఒప్పందం నిలిపివేత

భారత్ తీసుకున్న కఠిన నిర్ణయాలపై పాకిస్థాన్ ప్రతిచర్యలు



సిమ్లా ఒప్పందంపై సంతకాలు చేస్తున్న భుట్టో, ఇందిర

ఇస్లామాబాద్, ఏప్రిల్ 24: పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో సింధు జలాల ఒప్పందం నిలిపివేత సహా భారత్ తీసుకున్న పలు కఠిన నిర్ణయాలపై.. పాక్ ప్రతీకార చర్యలకు ఉపక్రమించింది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలో జాతీయ భద్రత కమిటీ గురువారం భేటీ అయి.. అచ్చంగా భారత్ తీసుకున్న నిర్ణయాల తరహాలోనే కొన్ని నిర్ణయాలు తీసుకుంది. పాక్ త్రివిధ దళాధిపతులు, మంత్రులు సైతం హాజరైన ఈ భేటీ ముగిసిన అనంతరం.. అందులో తీసుకున్న నిర్ణయాలతో ఆ దేశ ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనను విడుదల చేసింది. 1972లో కుదుర్చుకున్న సిమ్లా ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్టు అందులో వెల్లడించింది. భారత్, అట్టారీ సరిహద్దును మూసివేయగా.. పాక్ వాఘా సరిహద్దును మూసేస్తున్నట్టు వెల్లడించింది. సార్క్ వీసా మినహాయింపు పథకం కింద జారీ చేసిన అన్ని వీసాలనూ రద్దు చేసింది. వాణిజ్యపరంగా తెగతెంపులు చేసుకుంది. దౌత్య సంబంధాల స్థాయిని తగ్గించింది. మన విమానాలకు తన గగనతలంలోకి ప్రవేశాన్ని నిషేధిస్తున్నట్టు ప్రకటించింది. భారతదేశం పాకిస్థాన్‌లో ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందని.. సీమాంతర హత్యలకు పాల్పడుతోందని.. ఆగ్రహం వ్యక్తం చేసింది.అంతేకాదు.. సింధు జలాల ఒప్పందం కింద పాకిస్థాన్‌కు రావాల్సిన నీటిని మళ్లించే ఎలాంటి ప్రయత్నాన్నయినా యుద్ధచర్యగా (యాక్ట్ ఆఫ్ వార్)గా పరిగణిస్తామని హెచ్చరించింది.

- వాఘా సరిహద్దును తక్షణమే మూసివేస్తున్నామని.. అన్ని అనుమతులతో ఆ దారి గుండా ఇప్పటికే పాకిస్థాన్‌లోకి ప్రవేశించిన భారతీయులంతా ఏప్రిల్ 30లోగా వెళ్లిపోవాలని ఆదేశించింది.
- సిక్కు మత యాత్రికులకు తప్ప.. సార్క్ వీసా మినహాయింపు పథకం (ఎస్‌వీఈఎస్) కింద భారతీయులకు జారీ చేసిన అన్ని వీసాలూ తక్షణమే రద్దవుతున్నట్టు ప్రకటించింది. ఆ వీసాపై వచ్చిన భారతీయులంతా 48 గంటల్లోగా దేశం విడిచి వెళ్లాలని ఆదేశించింది.
- తమ దేశంలోని భారత రాయబార కార్యాలయంలో ఉన్న భారత సైనిక, నౌకా దళ, వైమానిక దళ సలహాదారులను అవాంఛిత వ్యక్తులుగా పేర్కొంటూ ఆ పోస్టులు రద్దయినట్టుగా భావించాలని పేర్కొంది. ఆయా సలహాదారులతోపాటు వారి సహాయక సిబ్బంది సైతం ఏప్రిల్ 30లోగా పాకిస్థాన్‌ను విడిచివెళ్లాలని ఆదేశించింది.
- ఏప్రిల్ 30 నుంచి ఇస్లామాబాద్‌లోని భారత రాయబార కార్యాలయంలో సిబ్బంది సంఖ్యను 30కి కుదిస్తున్నట్టు ప్రకటించింది.
- భారత దేశానికి చెందిన, భారతీయులు నడిపే విమానయాన సంస్థల విమానాలకు పాక్ గగనతలాన్ని తక్షణం మూసివేస్తున్నట్టు పేర్కొంది.
- భారత్‌తో అన్ని రకాల వాణిజ్య సంబంధాలూ నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. అంతేకాదు.. భారత్ నుంచి పాకిస్థాన్ గుండా వేరే దేశానికి/ ఇతర దేశాల నుంచి తమ భూభాగం గుండా భారత్‌కు జరిగే వాణిజ్య కార్యకలాపాలనూ అనుమతించబోమని తేల్చిచెప్పింది. కాగా, సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తూ భారత్ తీసుకున్నది ఏకపక్ష నిర్ణయమని.. దాన్ని తాము తిరస్కరిస్తున్నామని పాక్ ప్రకటించింది. సింధుజలాలు 24 కోట్ల పాకిస్థానీయులకు జీవరేఖ అని, తమ హక్కులను కాపాడుకోవడానికి కట్టుబడి ఉన్నామని పేర్కొంది.

చుట్టుతిరిగి వెళ్లాల్సిందే!

పాక్ నిర్ణయంతో అంతర్జాతీయ విమాన ప్రయాణాలపై ప్రభావం



తమ గగనతలంలోకి భారత విమానాలకు ప్రవేశాన్ని నిషేధిస్తూ పాకిస్థాన్ తీసుకున్న నిర్ణయంతో.. మన విమానయాన సంస్థలకు చెందిన అంతర్జాతీయ విమాన ప్రయాణాలపై ప్రభావం పడుతోంది. అమెరికా, ఇంగ్లండ్ తదితర దేశాలకు తాము నడుపుతున్న విమానాలపై ఆ ప్రభావం ఇప్పటికే పడుతోందని.. వాటిని దారి మళ్లించాల్సి వస్తోందని ఎయిరిండియా, ఇండిగో సంస్థలు వెల్లడించాయి. ఇకపై ఆయా దేశాలకు వెళ్లే విమానాలను అరేబియా సముద్రం మీదుగా సుదూర మార్గాల గుండా నడిపించాల్సి ఉంటుందని సీనియర్ పైలట్లు తెలిపారు. (విమాన టికెట్ల ధరలు పెరిగి ఆ భారం ప్రయాణికులపై పడుతుందని వారు పేర్కొన్నారు.



భేటీకి హాజరైన జీ-20 దేశాల రాయబారులు

పహల్గాం దారుణం మిత్ర దేశాల దృష్టికి..

- జీ-20 రాయబారులకు వివరించిన విదేశాంగ కార్యదర్శి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దారుణాన్ని భారత్ మిత్ర దేశాలకు వివరించింది. విదేశీవ్యవహారాల కార్యదర్శి విక్రం మిస్రి జీ-20 కూటమిలోని దేశాల రాయబారులకు ఈ దాడికి సంబంధించిన సమాచారాన్ని వివరించారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ దాడికి, సీమాంతర ఉగ్రవాదంతో ఉన్న సంబంధాన్ని వారి దృష్టికి తీసుకొచ్చారు. ఉగ్రవాదాన్ని క్షమించబోమన్న విధానాన్ని అనుసరిస్తున్నట్టు చెప్పారు. పాకిస్థాన్‌తో 1960లో కుదిరిన సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్టు, అత్తారీ సరిహద్దును మూసివేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించిన మరుసటి రోజునే రాయబారులతో మిస్రి భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకొంది. ఈ భేటీలో జీ-20 కూటమిలోని అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, రష్యా. ఆస్ట్రేలియా, ఇండోనేషియా, చైనా దేశాల రాయబారులు హాజరయ్యారు. వారితో పాటుగా వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం ఉన్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతర్, మలేసియా దేశాల రాయబారులు కూడా పాల్గొన్నారు. మిత్రదేశాలతో భేటీ అయిన విదేశీ వ్యవహారాల కార్యదర్శి వాస్తవ పరిస్థితులను, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు.



బెంగళూరు ఎయిర్‌పోర్టులో దిగిన పర్యాటకులు

కశ్మీర్ నుంచి బెంగళూరుకు సురక్షితంగా 178మంది ప్రయాణికులు

బెంగళూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో టెర్రరిస్టుల దాడి నేపథ్యంలో కశ్మీర్‌లో చిక్కుకున్న 178 మంది కన్నడిగులను సురక్షితంగా రాష్ట్రానికి తీసుకువచ్చారు. కార్మిక శాఖ మంత్రి సంతోష్‌లాడ్ రెండురోజులపాటు కశ్మీర్‌లో ఉంటూ అధికారుల బృందంతో కలిసి కన్నడిగులను గుర్తించారు. వారందరినీ గురువారం బెంగళూరుకు తీసుకువచ్చారు. కశ్మీర్‌లోని వివిధ ప్రాంతాలలో గడిపేందుకు వెళ్లిన కన్నడిగులను మంగళవారం సాయంత్రం నుంచి గుర్తించడం ప్రారంభించారు. అందరినీ సురక్షితంగా శ్రీనగర్ విమానాశ్రయానికి తీసుకువచ్చి అక్కడి నుంచి బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు తీసుకువచ్చారు.

అనుకోకుండా సరిహద్దుదాటిన బీఎస్ఎఫ్ జవాన్

- అదుపులోకి తీసుకున్న పాక్ రేంజర్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: అనుకోకుండా సరిహద్దును దాటిన సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) జవాన్‌ను పాకిస్థాన్ రేంజర్లు అదుపులోకి తీసుకున్నారు. దీంతో మన జవాన్‌ను సురక్షితంగా విడుదల చేసేందుకుగాను ఇరు బలగాల మధ్య చర్చలు జరుగుతున్నాయని గురువారం అధికారులు తెలిపారు. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ సరిహద్దులో ఈ ఘటన జరిగింది. 182వ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ పీకే సాహు.. నీడలో విశ్రాంతి తీసుకోవడానికి రైతులతో పాటు వెళ్లాడు. ఆ తరుణంలో అతన్ని బుధవారం పాక్ రేంజర్లు అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో జవాన్ యూనిఫాంను ధరించి ఉండటమేకాకుండా తన సర్వీస్ రైఫిల్‌ను కూడా కలిగి ఉన్నారు. జవాన్‌ను విడుదల చేయడానికి ఇరు దేశాల బలగాల మధ్య ఫ్లాగ్ సమావేశం జరుగుతోందని అధికారులు తెలిపారు.



భరత్‌భూషణ్ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న సీఎం సిద్దరామయ్య

ఇద్దరి మృతదేహాలు స్వస్థలాలకు

- బెంగళూరు ఎయిర్‌పోర్టులో కుటుంబ సభ్యులకు అప్పగింత

బెంగళూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రవాదుల కిరాతక దాడిలో బలైన ఇద్దరు కన్నడిగుల మృతదేహాలు గురువారం తెల్లవారు జామున బెంగళూరుకు చేరుకున్నాయి. శివమొగ్గ పట్టణానికి చెందిన మంజునాథ్‌రావ్, బెంగళూరుకు చెందిన భరత్‌భూషణ్ మృతదేహాలను కార్గోవిమానంలో ఎయిర్‌పోర్టుకు తీసుకువచ్చారు. కేంద్రమంత్రి సోమణ్ణ నివాళులర్పించి, బంధువులను ఓదార్చారు. మంజునాథ్‌రావ్ మృతదేహాన్ని తుమకూరు మీదుగా శివమొగ్గకు తరలించారు. బెంగళూరు నగరం మత్తికెరె ప్రాంతానికి భరత్‌భూషణ్ మృతదేహాన్ని తీసుకువచ్చారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, సీఎం సిద్దరామయ్య భరత్‌భూషణ్ మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

పాక్‌లో 'పహల్గాం' సూత్రధారులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24 : పాకిస్థాన్‌లో సూత్రధారులు కూర్చొని కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిని జరిపించినట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. పహల్గాం దాడి జరుగుతున్నంతసేపూ ఆ సూత్రధారులకు, ఉగ్రవాదులకు మధ్య రియల్ టైమ్ ఇంటెలిజెన్స్ సంబంధాలు కొనసాగినట్టు కనుగొన్నారు. ప్రాథమికంగా తమ దర్యాప్తులో తేలిన అంశాలు, దొరికిన ఆధారాలు, రికార్డు చేసిన సంభాషణలను బట్టి వారు ఈ నిర్ధారణకు వచ్చారు. పాకిస్థాన్‌లోని కరాచీ, ముజఫరాబాద్‌ల్లో దీనికి సంబంధించిన డిజిటల్ మూలాలను పసిగట్టినట్టు ఓ ఇంగ్లీష్ న్యూస్ వెబ్‌పోర్టల్ కథనం పోస్టు చేసింది. పహల్గాం దాడిలో పాల్గొన్న ఉగ్రవాదుల సంఖ్యపై ఇంకా స్పష్టత రాలేదుగానీ వారు నలుగురు నుంచి ఆరుగురి వరకు ఉండొచ్చునని, వారంతా పాకిస్థానీయులని, అందరూ ఉర్దూ మాట్లాడారని పోలీసులు చెబుతున్నారు. అంతర్గత నిఘా సమాచారం, స్థానికుల మాటలను బట్టి వారు ఈ నిర్ధారణకు వచ్చారని ఆ కథనం తెలిపింది. ఇంకా.. ఈ కథనాన్ని అనుసరించి, దాడిలో పాల్గొన్నవారిలో ఆదిల్ హుస్సేన్, ఆసిఫ్ షేక్‌లను అనంత్‌నాగ్‌లో కొద్దిరోజులుగా చూస్తున్నామని స్థానికులు తెలిపారు. 2018లో పాకిస్థాన్‌కు వెళ్లిన ఆదిల్ ఈ ఏడాదే తిరిగి వచ్చాడని ఇంటెలిజెన్స్ నివేదికలు తెలుపుతున్నాయి.

నియంత్రణ రేఖ వెంబడి 42 లాంచ్ ప్యాడ్స్

- సరిహద్దు దాటేందుకు 200 మంది ఉగ్రవాదులు సిద్ధం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: నియంత్రణ రేఖ వెంబడి పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 42 ఉగ్రవాద లాంచ్ ప్యాడ్స్ సిద్ధంగా ఉన్నాయని నిఘావర్గాల సమాచారం. ఇక్కడ శిక్షణ పొందిన 200మంది ఉగ్రవాదులు ఏ క్షణమైనా భారత సరిహద్దులోకి అక్రమంగా ప్రవేశించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిసింది. సరిహద్దు దాటించేందుకు పాకిస్థాన్ సైన్యం వీరికి సహకరిస్తోంది. శిక్షణ పొందుతున్న ఉగ్రవాదుల్లో 115 మంది పాక్ జాతీయులున్నట్లు సమాచారం. వీరుకాక జమ్మూకశ్మీర్‌లో హిజ్బుల్ ముజాహిదీన్, జైష్ ఎ మహ్మద్, లష్కర్ ఎ తైబా తదితర ఉగ్రవాద సంస్థలకు చెందిన మొత్తం 60 మంది విదేశీ ఉగ్రవాదులు ఇప్పటికే చురుగ్గా ఉన్నారని నిఘావర్గాలు గుర్తించాయి. 17 మంది స్థానిక ఉగ్రవాదులు కూడా చురుగ్గా ఉన్నారని తెలిపాయి.

జమ్మూ కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. జవాన్ మృతి



శ్రీనగర్, ఏప్రిల్ 24: జమ్మూ-కశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ ఆర్మీ జవాన్ మృతి చెందారు. దాదు బసంత్‌గఢ్ ప్రాంతంలో భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 6 పారా ఎస్ఎఫ్ విభాగానికి చెందిన హవల్దార్ ఝంటు అలీ షేక్ మరణించినట్టు ఆర్మీకి చెందిన వైట్‌నైట్ కార్ప్స్ 'ఎక్స్' ద్వారా తెలిపింది. సంఘటన స్థలంలో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయినట్టు పేర్కొంది. అలీ ధైర్యసాహసాలు మరువలేనివని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని తెలిపింది.

తిరుమలలో భద్రత కట్టుదిట్టం

తిరుమల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో తిరుమలలో భద్రతను కట్టుదిట్టం చేశారు. కేంద్రం హెచ్చరికలతో జిల్లా పోలీసు, టీటీడీ విజిలెన్స్ అధికారులు అప్రమత్తమయ్యారు. శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అలిపిరిలో తనిఖీలను కట్టుదిట్టం చేశారు.



స్వస్థలాలకు వెళ్లేందుకు జమ్మూకశ్మీర్ రైల్వే స్టేషన్‌కు చేరిన పర్యాటకులు

ఎల్వోసీపై ప్రభావం!

- పాక్ నిర్ణయంతో దీర్ఘకాలంలో సరిహద్దు, కశ్మీర్ అంశాలు సంక్లిష్టం
- 1972లో యుద్ధం అనంతరం చరిత్రాత్మక సిమ్లా ఒప్పందం
- ఎల్వోసీ ఉనికిలోకి వచ్చింది కూడా అప్పుడే
- మూడోపక్షం జోక్యం వద్దన్న నిబంధన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: పాకిస్థాన్ నుంచి విముక్తి కోరుతూ తూర్పు పాకిస్థాన్ ప్రజలు జరిపిన విముక్తి పోరాటానికి భారత్ మద్దతు పలకటం, ఆ నేపథ్యంలో పాక్ భారత సైన్యంపై దాడులకు దిగటంతో.. 1971లో ఇరు దేశాల మధ్య భీకర యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో భారత్ గొప్ప విజయం సాధించటమేగాక.. పాకిస్థాన్‌లోని 13 వేల చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుంది. ఈ యుద్ధం నేపథ్యంలోనే బంగ్లాదేశ్ స్వతంత్రదేశంగా ఆవిర్భవించింది. యుద్ధం అనంతరం.. భారత్-పాక్ సిమ్లా ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. 1972 జూలై 2వ తేదీన ఈ ఒప్పందంపై నాటి భారత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ, పాకిస్థాన్ అధ్యక్షుడు జుల్ఫికర్ అలీ భుట్టో సంతకాలు చేశారు. ఇరుదేశాల మధ్య నెలకొన్న ఘర్షణ వాతావరణానికి స్వస్తి పలికి స్నేహపూర్వక సంబంధాలు నెలకొల్పుకోవటం కోసం ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నామని నాడు భారత్-పాక్ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి.

ఒప్పందంలోని ప్రధానాంశాలు

- ఏ దేశమూ ఏకపక్షంగా వ్యవహరించి శాంతికి భంగం కలిగించే పనులకు పాల్పడవద్దు.
- ఒక దేశం అంతర్గత వ్యవహారాల్లో మరో దేశం జోక్యం చేసుకోవద్దు.
- ద్వైపాక్షిక చర్చల ద్వారా మాత్రమే అన్ని విబేధాలను పరిష్కరించుకోవాలి. మూడోపక్షం జోక్యం వద్దు
- 1971 యుద్ధం కాల్పుల విరమణ సమయంలో ఉన్న స్థితినే సిమ్లా ఒప్పందం.. జమ్మూకశ్మీర్‌లో ఇరుదేశాల సరిహద్దుగా (లైన్ ఆఫ్ కంట్రోల్- ఎల్వోసీ)గా మార్చింది.
- యుద్ధం సందర్భంగా భారత సైన్యం స్వాధీనం చేసుకున్న 13,000 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని పాకిస్థాన్‌కు తిరిగి ఇవ్వటానికి భారత్ అంగీకరించింది. శాంతికి కట్టుబడి ఉన్నామని చెప్పటానికి భారత్ ఇందుకు సమ్మతించింది. అయితే టర్ట్ క్, చాలుంకా వంటి కొన్ని వ్యూహాత్మక కీలకమైన ప్రాంతాలను మాత్రం భారత్ తన వద్దే ఉంచుకుంది.

ఒప్పందం నిలిపివేతతో జరిగేదేమిటి?

సిమ్లా ఒప్పందం అమలును నిలిపివేయాలని పాకిస్థాన్ తాజాగా నిర్ణయించింది. దీని వల్ల సంభవించే పరిణామాలు తక్షణం కాకపోయినా, దీర్ఘకాలంలో ప్రభావం చూపే అవకాశం ఉంది. కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ అంశంగా మలిచే ప్రయత్నాలను ముందు నుంచీ చేస్తున్న పాక్ ఇక మీదట వాటిని మరింత ముమ్మరం చేయవచ్చు. కశ్మీర్ వివాదంలో మూడో పక్షం జోక్యం దిశగా పాక్ అడుగులు వేసే అవకాశం ఉంది. ఐరాస లేదా చైనా వంటి తన మిత్రదేశాల జోక్యాన్ని పాకిస్థాన్ కోరవచ్చు.సిమ్లా ఒప్పందాన్ని పక్కకపెడితే.. ఎల్వోసీకి కట్టుబడాల్సిన అవసరం ఉండదు. ఇప్పటికే ఎల్వోసీని ఉల్లంఘిస్తూ తరచూ కాల్పుల ఘటనలు చేసుకుంటున్నాయి. ఇవి మరింత పెరిగే ప్రమాదం ఉంది. తక్షణం కాకపోయినా, దీర్ఘకాలంలో.. ప్రాంతీయ స్థిరత్వానికి భంగం వాటిల్లి, భారత్-పాక్ మధ్య చర్చలకు దారులు పూర్తిగా మూసుకుపోయే పరిస్థితులు ఏర్పడవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పాకిస్థాన్‌కు యుద్ధ భయం!

- సరిహద్దులకు సైన్యం.. నిఘా పెంపు
- ఆగమేఘాలపై క్షిపణుల పరీక్షలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ ఎలాంటి చర్యలు తీసుకోనుందోనని దాయాది దేశం పాకిస్థాన్‌లో ఆందోళన మొదలైందా? అందుకే.. క్షిపణి పరీక్షలు నిర్వహిస్తూ.. సరిహద్దుల్లో నిఘాను పెంచుతూ.. సైన్యాన్ని తరలిస్తోందా? ఈ ప్రశ్నలకు తాజా పరిణామాలు ఔననే సమాధానం చెబుతున్నాయి.

సరిహద్దుల్లో హై అలర్ట్

పాకిస్థాన్ రక్షణ శాఖ బుధవారం నుంచే సరిహద్దుల్లో అప్రమత్తమైంది. సైన్యం, యుద్ధ ట్యాంకులను నియంత్రణ రేఖ(ఎల్‌వోసీ) వద్దకు పంపడమే కాకుండా.. నిఘా, సైన్యం రవాణా విమానాలను తరలించింది. గురువారం ఆగమేఘాలపై క్షిపణి పరీక్షలు నిర్వహించగా.. భారత్ ఎలాంటి చర్యలకు దిగినా.. ఎదుర్కొనేందుకు సిద్ధమేనంటూ.. రక్షణ శాఖ మంత్రి ఖావాజా ఆసిమ్ ప్రకటించడం గమనార్హం..!

'ఫ్లాగ్ ఆపరేషన్'పై పదేపదే ప్రకటనలు

భారత్ తమపై అభాండాలు(తప్పుడు 'ఫ్లాగ్ ఆపరేషన్') మోపుతోందని పాక్ ప్రభుత్వం బుధవారం నుంచి ఆరోపణలు గుప్పిస్తోంది. పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్ అధ్యక్షతన గురువారం జరిగిన జాతీయ భద్రత సమావేశం తర్వాత.. ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ ధార్, రక్షణ మంత్రి ఖావాజా ఆసిమ్ విలేకరులతో మాట్లాడుతూ.. ఇదే అంశాన్ని ఎత్తిచూపారు. "పహల్గాం దాడి తర్వాత ఎలాంటి విచారణ జరపకుండానే.. పాక్‌పై ఆరోపణలు చేశారు. ఫ్లాగ్ ఆపరేషన్ ద్వారా ఉగ్రదాడులకు సంబంధించి ఒక దేశం లేదా ఒక సంస్థపై దాడికి సిద్ధమనడానికి యుద్ధ వ్యూహం లాంటిదే. ఇప్పుడు భారత్ అదే చేస్తోంది" అని విమర్శించారు.

భారత్‌పై ఉగ్రవాద నెపం

పాక్ రక్షణ మంత్రి ఖావాజా ఆసిమ్ ఏకంగా భారత్‌పై ఉగ్రవాద నెపం మోపారు. "మాకు ఉన్న నిఘా వర్గాల సమాచారం ప్రకారం.. పాకిస్థాన్‌లో ఉగ్రవాద దాడులకు భారత్ కుట్రలు చేస్తోంది. మేం ఒకటే చెబుతున్నాం. మా పౌరులపై దాడి జరిగితే.. భారత పౌరులు కూడా సురక్షితంగా ఉండరు. యుద్ధానికి బదులుగా భారత్ మాపై ఉగ్రవాదానికి సిద్ధమవుతోంది. భారత్ ఏదైనా సాహసానికి దిగితే.. తగిన సమాధానం ఇస్తాం" అని ఆయన వ్యాఖ్యానించారు.



రాష్ట్రపతితో షా, జైశంకర్ భేటీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: దాయాది దేశం పాకిస్థాన్‌పై భారత్ ఆంక్షలు.. దానికి ప్రతిగా పాక్ ప్రతి ఆంక్షల నేపథ్యంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఉగ్రదాడికి సంబంధించిన వివరాలను ఇరువురు మంత్రులు ఆమెకు వివరించినట్లు సమాచారం. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలను రాష్ట్రపతి కార్యాలయం 'ఎక్స్'లో పోస్టు చేసింది. అదే సమయంలో భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ జీ-20 దేశాల్లో ఎంపిక చేసిన దేశాల రాయబారులతో సమావేశం నిర్వహించింది.

అత్యంత హేయమైన చర్య: ట్రంప్

పహల్గాంలో నిస్సహాయులైన పర్యాటకులపై జరిగిన దాడిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ఖండించారు. ఈ దాడికి పాల్పడ్డ వారిని పట్టుకోవడంలో భారత్‌కు తాము పూర్తిస్థాయిలో మద్దతిస్తామన్నారు. గురువారం ఆయన ప్రధాని మోదీకి ఫోన్ చేశారు. ఈ ఘటన అత్యంత హేయమైన చర్య అని వ్యాఖ్యానించారు.

నేడు కశ్మీర్‌కు ఆర్మీ చీఫ్

భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది శుక్రవారం కశ్మీర్‌లో పర్యటించనున్నారు. శ్రీనగర్‌లో ఆయన ఆర్మీ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. నియంత్రణ రేఖ వెంబడి భద్రత, నిఘాను ముమ్మరం చేయడం, అట్టారీ క్రాసింగ్ వద్ద తీసుకుంటున్న చర్యలపై సమీక్షిస్తారు.

కుప్పకూలిన పాక్ స్టాక్ మార్కెట్

భారత్ ఆంక్షల నేపథ్యంలో గురువారం పాకిస్థాన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ కుప్పకూలింది. కరాచీ-100 ఇండెక్స్ 2,565 పాయింట్ల మేర నష్టపోయింది.



పాక్‌నుంచి వాఘా సరిహద్దు గుండా భారత్‌కు తిరిగి వస్తున్న ఓ భారతీయుడు

48 గంటల్లో వెళ్లిపోవాల్సిందే..

పాకిస్థాన్ జాతీయులకు.. అన్ని రకాల వీసాలు రద్దు

- వైద్యం కోసం మెడికల్ వీసాలపై వచ్చినవారికి మాత్రం 29వ తేదీ వరకు గడువు
- ఆదేశాలు జారీ చేసిన విదేశాంగ శాఖ
- అట్టారీ-వాఘా చెక్‌పోస్టు మీదుగా.. తిరిగి వెళ్లిపోతున్న పాకిస్థానీయులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కఠిన చర్యలు చేపట్టిన భారత్.. పాకిస్థాన్ జాతీయులకు అన్నిరకాల వీసాలను రద్దు చేసింది. ఈ మేరకు 48 గంటల్లోగా తిరిగి వెళ్లిపోవాలంటూ విదేశాంగశాఖ గురువారం మధ్యాహ్నం ఆదేశాలు జారీ చేసింది. సాధారణ వీసాలపై భారత్‌కు వచ్చిన పాకిస్థానీయులు ఈ నెల 27వ తేదీ నాటికల్లా తిరిగి వెళ్లిపోవాలని.. వైద్యం కోసం మెడికల్ వీసాలపై వచ్చినవారు 29వ తేదీలోగా వెళ్లిపోవాలని ఆదేశించింది. ఇకపై పాకిస్థానీలకు ఎలాంటి వీసాలు ఇవ్వకుండా వీసా సర్వీసులను సస్పెండ్ చేసింది. మరోవైపు భారతీయులెవరూ పాకిస్థాన్‌కు వెళ్లవద్దని, ఇప్పటికే పాకిస్థాన్‌లో ఉన్నవారు వెంటనే తిరిగి రావాలని స్పష్టం చేసింది. ఈ ఆదేశాల నేపథ్యంలో పాకిస్థానీయులు సరిహద్దుల్లోని అట్టారీ-వాఘా సమీకృత చెక్‌పోస్టు మీదుగా తమ దేశానికి వెళ్లిపోతున్నారు. ఈ క్రమంలో ఢిల్లీలోని బంధువులను కలిసేందుకు పాకిస్థాన్‌లోని కరాచీ నుంచి వచ్చిన ఓ కుటుంబం.. చెక్‌పోస్టు వద్ద మీడియాతో మాట్లాడింది. "బంధువులను కలిసేందుకు ఏప్రిల్ 15న ఢిల్లీకి వచ్చాం. 45 రోజులు వీసా గడువు ఉంది. కానీ వెంటనే తిరిగి వెళ్లిపోవాల్సి వస్తోంది. పహల్గాంలో దాడి చేసినది ఎవరైనా సరే అది తప్పే. ఇలాంటి విద్వేషాన్ని మేం కోరుకోవడం లేదు" అని పేర్కొంది. మరోవైపు ఇప్పటికే పాకిస్థాన్‌లోని బంధువుల వద్దకు వెళ్లిన భారతీయులు ఇదే చెక్‌పోస్టు మీదుగా తిరిగి వచ్చేస్తున్నారు.

'ఎక్స్' ఖాతా, పీఎస్ఎల్ నిలిపివేత

పాకిస్థాన్ ప్రభుత్వానికి చెందిన అధికారిక 'ఎక్స్' ఖాతాను భారతదేశంలో నిలిపివేశారు. కేంద్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు 'ఎక్స్' సంస్థ ఈ చర్య చేపట్టింది. మరోవైపు మన ఐపీఎల్ తరహాలో పాకిస్థాన్ నిర్వహించే 'పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)' క్రికెట్ మ్యాచ్‌ల ప్రసారాన్ని భారత్‌లో నిలిపివేశారు. ఫ్యాన్‌కోడ్ ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఈ నిర్ణయం తీసుకుంది. అంతేకాదు పీఎస్ఎల్‌కు సంబంధించిన అన్ని రకాల సమాచారాన్ని కూడా తొలగించేసింది.

నేను పాకిస్థానీ కాదు..: ప్రభాస్ హీరోయిన్



ఇమాన్వీ ఇస్మాయిల్

ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌కు చెందిన నటులు, గాయకులు, టెక్నీషియన్లు భారత సినీ పరిశ్రమలో పనిచేయకుండా నిషేధిస్తున్నట్టు 'ఫెడరేషన్ ఆఫ్ వెస్టర్న్ ఇండియా సినీ ఎంప్లాయీస్' సంస్థ ప్రకటించింది. ఇక ప్రభాస్ నటిస్తున్న ఓ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న ఇమాన్వీ ఇస్మాయిల్ పాకిస్థానీ అని, ఆమెను తప్పించాలని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీనిపై ఇమాన్వీ స్పష్టత ఇచ్చారు. తాను భారతీయ అమెరికన్ అని, లాస్ ఏంజిలిస్‌లో పుట్టానని తెలిపారు. తనకు, తన కుటుంబంలో ఎవరికీ కూడా పాకిస్థాన్‌తో ఎలాంటి సంబంధాలు లేవని, తప్పుడు ప్రచారం చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

పాక్ దౌత్యవేత్తకు సమన్లు.. మిలటరీ దౌత్య సిబ్బందికి నోటీసులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24 : పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా పాకిస్థాన్‌పై భారత్ కఠిన ఆంక్షల పరంపర కొనసాగుతూనే ఉంది. దౌత్యపరమైన సంబంధాల విషయంలో తాజాగా కఠిన నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్‌లోని ఉన్నత దౌత్యాధికారి సాద్ అహ్మద్ వరైచ్‌కు బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సమన్లు పంపింది. ఆయనను స్వయంగా పిలిపించి పాక్ మిలిటరీ దౌత్య సిబ్బందికి నోటీసులు (పర్సోనా నాన్ గ్రాటా) అందించింది. ఈ నోటీసు అందుకున్నవారంతా వారం రోజుల్లోగా భారత్‌ను వదిలిపెట్టి వెళ్లిపోవాల్సి ఉంటుంది. దౌత్యపర ఆంక్షలు మే ఒకటో తేదీ వరకు అమలులో ఉంటాయని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ తెలిపారు. రాయబార కార్యాలయాల్లోని సిబ్బంది సంఖ్యను క్రమంగా 55 నుంచి 30కు తగ్గిస్తామని ఆయన చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన రక్షణ వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో దీనిపై కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.


సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటితో డీజీపీ జితేందర్, ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి

తెలంగాణ పోలీస్.. భేష్!

» డీజీపీ, ఇంటెలిజెన్స్ డీజీలకు సీఎం అభినందనలు

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పోలీసింగ్‌లో తెలంగాణ పోలీసులు దేశంలోనే ప్రథమ స్థానం సంపాదించుకున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. డీజీపీ జితేందర్, ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డిలకు అభినందనలు తెలిపారు. గురువారం పోలీసు ఉన్నతాధికారులు సీఎం రేవంత్‌ను కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కలిసి ఇండియా జస్టిస్ నివేదిక పూర్తి వివరాలను అందచేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఇది తెలంగాణ పోలీసుల సమష్టి విజయమని, మరింత నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి, సీఎస్ శాంతికుమారి పాల్గొన్నారు. కాగా, రాష్ట్రంలోని ప్రతి పోలీసు యూనిట్‌లో పది మంది మహిళలకన్నా ఎక్కువున్న చోట సహస్ కమిటీలు ఏర్పాటు చేయాలని డీజీపీ జితేందర్ సూచించారు. తెలంగాణ మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో ఈ కమిటీలు పనిచేయాలన్నారు. డీజీపీ కార్యాలయంలో సహస్ కమిటీల రెండు రోజుల సదస్సును గురువారం డీజీపీ ప్రారంభించి మాట్లాడారు. మహిళా సిబ్బంది నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు స్వీకరించి న్యాయబద్ధంగా, వేగంగా పరిష్కరించాలని సూచించారు.

పోలీసు కుటుంబాల నుంచి సివిల్స్‌కు ముగ్గురి ఎంపిక

పోలీసు సిబ్బంది కుటుంబాల నుంచి సివిల్స్‌కు ఎంపికైన ముగ్గురిని డీజీపీ జితేందర్ అభినందించారు. డీజీపీ కార్యాలయంలో గురువారం వారిని సత్కరించారు. డిచ్‌పల్లి హెడ్ కానిస్టేబుల్ గోవింద్ కుమారుడు సాయి చైతన్య సివిల్స్‌లో 68వ ర్యాంకు, డీజీపీ కార్యాలయంలో డీఎస్పీగా పనిచేస్తున్న వేణుగోపాల్ కుమారుడు కౌశిక్ నర్సింహ 225వ ర్యాంకు, అసెంబ్లీలో చీఫ్ మార్షల్‌గా పనిచేస్తున్న కరుణాకర్ కుమారుడు టి.సూర్య తేజ 779వ ర్యాంకు సాధించారు.

మే మూడో వారంలో కాళేశ్వరం నివేదిక!

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంతోపాటు ఆర్థిక అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్.. మే మూడో వారంలో ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. ఇప్పటికే విచారణ ప్రక్రియ కీలక దశలు దాటడంతో 90% నివేదిక సిద్ధమైంది. ఈ ముసాయిదా నివేదిక 400 పేజీలు దాటినట్లు సమాచారం. దీనికి కమిషన్ తుదిరూపు ఇస్తోంది. నివేదిక సిద్ధమై సమర్పించే క్రమంలోనే కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఆర్థిక శాఖ మాజీ మంత్రి ఈటలలకు కబురు పంపే అంశంపై నిర్ణయం తీసుకోనుంది.

నేడు ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని పన్వర్ హాల్‌లో అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం ఎన్నికల పరిశీలకుడు సురేంద్రమోహన్, రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి లెక్కింపు కేంద్రాన్ని పరిశీలించారు.

తుక్కు వ్యాపారుల నుంచి 23 లక్షల లూటీ

» నిందితుల్లో సైబరాబాద్ సీపీ ఎస్కార్ట్ కానిస్టేబుల్

» కానిస్టేబుల్ సహా ముగ్గురి అరెస్టు

మొయినాబాద్, ఏప్రిల్, 24 (ఆంధ్రజ్యోతి): తుక్కు వ్యాపారులకు అమ్మకానికి భారీ ఎత్తున స్క్రాప్ ఉందని పిలిపించి, వారిపై దాడికి పాల్పడి, రూ.23 లక్షల నగదుతో ఉడాయించిన కేటుగాళ్లను మొయినాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారు. అరెస్టయిన వారిలో సైబరాబాద్ సీపీ ఎస్కార్ట్ వాహనంలో ఉండే ఏఆర్ కానిస్టేబుల్ కూడా ఉన్నాడు. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన స్క్రాప్ వ్యాపారి అజయ్‌కి ముంబైలో వ్యాపారం చేసేప్పుడు నబీ, అతని కుమారుడు మొబిన్ పరిచయం అయ్యారు. హైదరాబాద్‌లో తుక్కు వ్యాపారులను లూటీ చేసే ఉద్దేశంతో వీరు పథకం పన్నారు. హైదరాబాద్‌లో స్క్రాప్ వ్యాపారం చేసే ఇమ్రాన్, ఉమర్ ఫారూఖ్‌లకు బుధవారం ఫోన్ చేశారు. మొయినాబాద్ మండల పరిధిలోని ఖుత్బుద్దీన్‌గూడలో ఓ ఫామ్‌హౌస్‌ను కూల్చివేస్తున్నారని, అక్కడి తుక్కును కొనుగోలు చేయడానికి రావాలని పిలిచాడు. దాంతో వారిద్దరూ తమ స్నేహితుడు సోహిల్‌తో కలిసి రూ.23 లక్షల నగదుతో మధ్యాహ్నానికి అక్కడికి చేరుకున్నారు. వారు రాగానే.. అజయ్, నబీ, మొబిన్, ఇమ్రాన్ అనే విత్రుడు, ఫామ్‌హౌస్‌లో పనిచేసే రాంచందర్, ఖుత్బుద్దీన్‌గూడకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్(సైబరాబాద్ సీపీ ఎస్కార్ట్‌లో విధులు) శేఖర్, మసూద్‌తో కలిసి దాడి చేశారు. ఏఆర్ కానిస్టేబుల్ దాబూదర్పం ప్రదర్శిస్తూ.. అంత డబ్బు ఎక్కడిదని ప్రశ్నిస్తూ.. వారి నుంచి లాక్కొన్నాడు. వెంటనే అక్కడి నుంచి కారులో పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు ప్రారంభించిన మొయినాబాద్ పోలీసులు.. కానిస్టేబుల్ శేఖర్, రాంచందర్, మసూద్‌ను గురువారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. మిగతా నిందితులు-- అజయ్, మొబిన్, నబీ, ఇమ్రాన్ పరారీలో ఉన్నారు. వారిని అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

భాషావేత్త బండి రామకృష్ణారెడ్డి కన్నుమూత

» పలు యూనివర్సిటీల్లో ప్రొఫెసర్‌గా సేవలు

» దేశ భాషల పరిరక్షణకుగాను పద్మశ్రీ గుర్తింపు



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ భాషావేత్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత బండి రామకృష్ణారెడ్డి(83) అనారోగ్యంతో కన్నుమూశారు. కొంతకాలంగా వయసు రీత్యా తలెత్తే సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. రామకృష్ణారెడ్డి కవి, కుయి, మండా భాషల పరిరక్షణకు అవిరళ కృషి చేశారు. ఇంది, ఆవే భాషలకు లిపి తయారు చేశారు. ఆయన స్వస్థలం చిత్తూరు జిల్లా రెంటాలచెను. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ హిందీ, పుణే దక్కన్ కాలేజీలో భాషా శాస్త్రాన్ని అభ్యసించారు. ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయం నుంచి తెలుగు వాక్య నిర్మాణంలో స్థానిక అధ్యయనాలు అంశంపై పీహెచ్‌డీ చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం భాషా శాస్త్ర విభాగంలో 1977 నుంచి 1990 వరకు ఆచార్యుడిగా సేవలందించారు. అనంతరం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం భాషాభివృద్ధి పీఠం అధిపతిగా, తర్వాత రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. కుప్పం, ద్రవిడ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక రిజిస్ట్రార్‌గానూ పనిచేశారు. అంతరించిపోతున్న భారతీయ భాషల పరిరక్షణకు రామకృష్ణారెడ్డి అందించిన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 2023లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. రామకృష్ణారెడ్డి అంత్యక్రియలు శుక్రవారం ఉదయం 11 గంటలకు తార్నాకలోని శ్మశానవాటికలో నిర్వహిస్తున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.

తెలంగాణ నమూనాను ప్రపంచానికి చాటుతాం

(మొదటిపేజీ తరువాయి)

కలిసి భట్టి విక్రమార్క గురువారమిక్కడ సదస్సు వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఈ సదస్సు ద్వారా ప్రభుత్వ ఆలోచనా విధానాలను ప్రపంచానికి చెప్పనున్నామని, తద్వారా రాష్ట్రంలోకి పెట్టుబడులను ఆహ్వానిస్తామని తెలిపారు. లౌకికవాద కాంగ్రెస్ పార్టీ ఆలోచన, సిద్ధాంతాలను వివరించనున్నట్లు చెప్పారు. ప్రగతిశీల భావజాల రాజకీయ పార్టీలతో కలిసి డిక్లరేషన్‌ను రూపొందించి, విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ మోడల్‌ను ప్రపంచానికి చాటడానికి సదస్సు ఉపయోగపడుతుందన్న ఉద్దేశంతోనే ఇక్కడ నిర్వహిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ మూల సిద్ధాంతాలైన అహింస, సత్యం, న్యాయం, ప్రజాస్వామ్యం వంటి అంశాలపై వివిధ దేశాల ప్రతినిధులతో అభిప్రాయాలను పంచుకుంటామని చెప్పారు. 100కు పైగా దేశాల నుంచి 450 మందికి పైగా ప్రభుత్వ అధినేతలు, ఎంపీలు, జాతీయ పార్టీల నాయకులు, కార్పొరేట్ దిగ్గజాలు, మేధావులు, నిపుణులు, సిద్ధాంతకర్తలు, ప్రగతిశీల భావజాల నాయకులు హాజరవుతారని వివరించారు. అప్పట్లో అమెరికా, రష్యా వంటి రెండు అగ్ర దేశాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం సాగుతున్న సందర్భంలో జవహర్‌లాల్ నెహ్రూ ఆలోచనలతో భారత దేశం అలీన విధానాన్ని ముందుకు తెచ్చిందని చెప్పారు. అదే విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వాలు ముందుకు తీసుకెళుతున్నాయన్నారు. ఆ పరంపరలో భాగంగా రాహుల్ గాంధీ 'న్యాయ్' అనే ఆలోచన మేరకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సదస్సును నిర్వహిస్తోందన్నారు. ప్రపంచ పటంలో హైదరాబాద్‌ను నిలిపేందుకు ఈ సదస్సు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రగతిశీల రాజకీయ పార్టీలను మాత్రమే ఆహ్వానించామని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సదస్సు నిర్వహణతో పెట్టుబడుల విషయంలో తెలంగాణకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని భావిస్తున్నట్లు ఉత్తమ్ తెలిపారు.

సాంస్కృతిక కార్యక్రమాల తొలగింపు

పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో సదస్సులో సాంస్కృతిక కార్యక్రమాలు, విందులు వంటివాటిని తొలగించామని ఏఐసీసీ కార్యదర్శి గురుదీప్‌సింగ్ సప్పల్ చెప్పారు. ఇలాంటి సందర్భంలో భారత్ సమ్మిట్‌ను నిర్వహించడం సమంసజం కాదన్న అభిప్రాయాలూ ఉన్నాయని, అందుకే ఆడంబరాలకు తావివ్వడం లేదని తెలిపారు. ఉగ్రదాడులు, దేశ రక్షణ గురించి కూడా సదస్సులో చర్చించి, డిక్లరేషన్‌లో చేరుస్తామని చెప్పారు. కాగా, భారత్ సమ్మిట్ ఏర్పాట్లను భట్టి, ఉత్తమ్, మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు.

శ్రీరామనవమికి రూ.2.69కోట్ల ఆదాయం

» భద్రాద్రిలో గత ఏడాది కంటే అదనంగా రూ.80 లక్షలు

భద్రాచలం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో నిర్వహించిన శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు రూ.2,69,09,390 ఆదాయం సమకూరింది. 2024లో రూ.1,89,61,124 ఆదాయం రాగా ఈసారి రూ.80 లక్షలు అదనంగా ఆదాయం లభించింది. మార్చి 30 నుంచి ఏప్రిల్ 12 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించగా, 6న శ్రీరామనవమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణం, 7న సీతారాముల మహా పట్టాభిషేకాన్ని నిర్వహించారు. భద్రాద్రి దేవస్థానం ఈ ఏడా ది భక్తుల సదుపాయాలు, సౌకర్యాలు, ఏర్పాట్ల కోసం సుమారు రూ.2.50 కోట్ల వరకు వెచ్చించగా రూ.19 లక్షలు అదనంగా వచ్చినట్లయ్యింది.

కర్రెగుట్టల్లో ఎన్‌కౌంటర్.. ముగ్గురు నక్సల్స్ కాల్చివేత

(మొదటిపేజీ తరువాయి)

తెలుస్తాయని వివరించారు. వీరంతా హిడ్మా దళానికి(పీఎల్‌జీ ఒకటో బెటాలియన్) చెందిన వారని అనుమానిస్తున్నారు. మరోవైపు కర్రెగుట్టల చుట్టూ-- ఉత్తరాన ఛత్తీస్‌గఢ్‌లోని పూజారి కాంకేర్, తూర్పున భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా చర్ల, దక్షిణాన ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం, తూర్పున ఇంద్రావతి నది ప్రాంతాల్లో కూంబింగ్ కొనసాగుతోంది. కర్రెగుట్టల పరిసరాల గూడేల్లోని ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. మరికొన్ని గూడేల ప్రజలు భయంతో వేరే ప్రాంతాలకు తరలిపోయారు. పూజారి కాంకేర్ వైపు ఉన్న పెద్ద ఉట్లపల్లి, చిన్న ఉట్లపల్లి, భీమారంపాడు గ్రామాల్లో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. రెండ్రోజులుగా అడవుల్లో భారీ పేలుళ్లు జరుగుతున్నాయని కర్రెగుట్టల క్షేత్ర పర్యటనకు వెళ్లిన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి వివరించారు. పెద్ద ఉట్లపల్లిలో ఓ భాగం పూర్తిగా ఖాళీగా కనిపించింది. ఇళ్లలో జనాలెవ్వరూ లేకపోవడం గమనార్హం.! కర్రెగుట్టలపైకి పంపుతున్న డ్రోన్లు.. థర్మల్ ఇమేజింగ్ సాంకేతికతతో మావోయిస్టుల ఉనికిని గుర్తిస్తున్నట్లు తెలుస్తోంది. ఆ సమాచారం మేరకు బలగాలు హెలికాప్టర్ల నుంచి కాల్పులు జరుపుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. కర్రెగుట్టల్లో హిడ్మాతోపాటు.. మావోయిస్టు పార్టీ అగ్రనాయకుడు దామోదర్ తదితరులున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వీరిని బలగాలు చుట్టుముట్టినట్లు సమాచారం. తెలంగాణ వైపు కూడా కర్రెగుట్టల్లో పోలీసుల ఆపరేషన్ కొనసాగుతోంది. ఈ ప్రాంతాల్లో మావోయిస్టులు అమర్చిన మందుపాతరలను బలగాలు గుర్తిస్తూ.. నిర్వీర్యం చేస్తూ ముందుకు సాగుతున్నాయి. గురువారం కూడా బలగాలు మందుపాతరలను నిర్వీర్యం చేసినప్పుడు వచ్చే భారీ శబ్దాలతో ఈ ప్రాంతాలు దద్దరిల్లిపోయాయి. వాజేడు, వెంకటాపురం మండలాల మీదుగా నిరంతరం హెలికాప్టర్ల ద్వారా ఏరియల్ సర్వే నిర్వహిస్తున్నారు. రెండ్రోజులుగా ఎండలు తీవ్రమవ్వడంతో.. కూంబింగ్‌లో ఉన్న 15 మంది జవాన్లు వడదెబ్బకు గురయ్యారు. వీరిని చికిత్స నిమిత్తం హెలికాప్టర్ ద్వారా వెంకటాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మరికొందరు జవాన్లు కూడా డీహైడ్రేషన్‌కు గురైనట్లు తెలిసింది.


లొంగిపోయిన నక్సల్స్ వివరాలను వెల్లడిస్తున్న మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

నక్సల్స్ అణచివేత పేరిట ఆదివాసీలను హతమారుస్తున్నారు..

» ఆదివాసీ జనహననాన్ని అడ్డుకోండి

» రాష్ట్రపతికి పీస్ డైలాగ్ కమిటీ లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): 'మావోయిస్టుల అణచివేత పేరిట అమాయక ఆదివాసీలను హతమారుస్తున్నారు. దేశంలో జరుగుతున్న ఆదివాసీల జనహననాన్ని అడ్డుకోవడం ఆదివాసీ బిడ్డగా మీ బాధ్యత' అంటూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పీస్ డైలాగ్ కమిటీ, పలు సంఘాల నాయకులు లేఖ రాశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బేషరతుగా కాల్పుల విరమణ ప్రకటించి.. శాంతి చర్చలకు మార్గం సుగమం చేయాలని రాష్ట్రపతిని పీస్ డైలాగ్ కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్, దంతేవాడ ఆదివాసీ యాక్టివిస్ట్ సోనిసోరి, ఛత్తీస్‌గఢ్ బచావో ఆందోళన్ ప్రతినిధి బేలా భాటియా, పీయూసీఎల్ ప్రతినిధి కవితా శ్రీవాత్సవ, సీడీఆర్‌వో ప్రతినిధి క్రాంతి చైతన్య, ఆపరేషన్ గ్రీన్ హంట్ వ్యతిరేక పోరాట కమిటీ ప్రతినిధి పర్మిందర్ సింగ్ లేఖలో కోరారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల్లోని బస్తర్, గడ్చిరౌలి, పశ్చిమ సింగభం ప్రాంతాల్లో యుద్ధ వాతావరణం నెలకొందని, వేలాది కేంద్ర, రాష్ట్ర బలగాలు మావోయిస్టుల ఏరివేత పేరిట మారణకాండ సృష్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

మాకు సమాచారం లేదు: ఐజీ

కర్రెగుట్టల్లో జరుగుతున్న ఆపరేషన్‌లో తెలంగాణ పోలీసులు పాల్గొనడం లేదని మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించారు. అక్కడ ఛత్తీస్‌గఢ్ పోలీసులు, కేంద్ర బలగాలు 'ఆపరేషన్ కగార్'లో భాగంగా కూంబింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కర్రెగుట్టల వద్ద ఏం జరుగుతుందో కూడా తమకు సమాచారం లేదన్నారు. తెలంగాణ పోలీసులు మావోయిస్టుల లొంగుబాటుపైనే దృష్టి సారించారని, ఏ రాష్ట్రానికి చెందిన నక్సల్స్ అయినా.. ఇక్కడ లొంగిపోవొచ్చని ప్రకటించారు. లొంగిపోయిన నక్సల్స్‌కు ఎలాంటి హాని తలపెట్టబోమని, ప్రభుత్వం అందించే రివార్డులతో పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో ప్రస్తుతం 94 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారని తెలిపారు. వీరంతా లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలవాలని కోరారు. గత ఏడాది నుంచి ఇప్పటి వరకు జరిగిన ఎన్‌కౌంటర్లలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు సహా.. 18 మంది నక్సల్స్ మృతిచెందినట్లు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 12 మంది మావోయిస్టులను అరెస్టు చేయగా.. 250 మంది లొంగిపోయినట్లు వెల్లడించారు.

14 మంది మావోయిస్టుల లొంగుబాటు

మావోయిస్టు పార్టీకి చెందిన 14మంది సభ్యులు గురువారం మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఐజీ వివరాలను వెల్లడించారు. లొంగిపోయిన వారిలో 13 మంది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి, ఒకరు భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా చర్ల ప్రాంతానికి చెందినవారున్నారు. లొంగిపోయినవారిలో ఏవోబీ స్పెషల్ జోనల్ పరిధిలోని గాలికొండ ఏరియా కమిటీ సభ్యుడు మాడ్వి అంద అలియాస్ రాజేశ్, కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ ఉదయ్, మావోయిస్టు భద్రత బృందం సభ్యురాలు సోడి కోసి ఉన్నారు. మిగతా వారంతా మిలీషియా సభ్యులు. లొంగిపోయిన వారిలో ఇద్దరిపై రూ.4 లక్షల రివార్డు ఉన్నట్లు ఐజీ వెల్లడించారు. వీరందరికీ తక్షణ పునరావాస సాయం కింద రూ.25 వేల చొప్పున నగదును అందించామన్నారు. సమావేశంలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్, ములుగు, భూపాలపల్లి, భద్రాద్రి-కొత్తగూడెం ఎస్పీలు అంబరీష్, కిరణ్‌ఖరే, రోహిత్‌రాజ్, ఏటూరునాగరం ఏఎస్పీ శివమ్ ఉపాధ్యాయ పాల్గొన్నారు.

హవాలా ఆపరేటర్లను అదుపులోకి తీసుకున్న ఈడీ

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): హవాలా ఆపరేటర్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) అధికారులు కొరడా ఝళిపించారు. గురువారం హైదరాబాద్‌లోని 13 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి అక్రమ లావాదేవీలకు సంబంధించిన కీలక పత్రాలతో పాటు నగదును స్వాధీనం చేసుకున్నారు. పలువురు హవాలా ఆపరేటర్లను తదుపరి విచారణ నివిత్తం ఈడీ కార్యాలయానికి తీసుకెళ్లారు. మనీలాండరింగ్‌కు సంబంధించి అంది న పక్కా సమాచారం తోనే ఈడీ అధికారులు ఈ సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. రాయదుర్గం పరిధిలోని చిత్రపురి కాలనీలో నివాసముంటున్న ఇద్దరిని ఈడీ అధికారులు అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి 75 లక్షల రూపాయలతో పాటు కోడ్ భాషలో ఉన్న కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

ఎస్ఎల్‌బీసీ సహాయక చర్యలకు తాత్కాలిక బ్రేక్

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగంలో కొన సాగుతున్న సహాయక చర్యలను తాత్కాలికంగా నిలుపుదల చేయాలని సాంకేతిక కమిటీ నిర్ణయించింది. సొరంగంలోని ఇన్‌లెట్ వైపు నుంచి 13.6 కి.మీ తర్వాత ముందుకెళ్లడం ఏ మాత్రం సురక్షితం కాదని కమిటీ అభిప్రాయపడింది. గురువారం జలసౌధలో సాంకేతిక కమిటీ సమావేశం రెవెన్యూ శాఖ (విపత్తులు) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. దీనికి ఫైర్ సర్వీసెస్ డీజీ నాగిరెడ్డి, నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో పాటు ఏపీలోని ఎన్‌డీఆర్ఎఫ్ పదో బెటాలియన్ కమాండెంట్, నేషనల్ జియోఫిజికల్ పరిశోధనా సంస్థ డైరెక్టర్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డిప్యూటీ డైరెక్టర్, నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ భూశాస్త్రవేత్త, బార్డర్ రోడ్ ఆర్గనైజేషన్ (బీఆర్‌వో) సంస్థ నుంచి టన్నెల్ నిపుణులు పరీక్షిత్ మెహ్రా హాజరయ్యారు. తదుపరి సహాయక చర్యల్లో ఏ విధంగా ముందుకెళ్లాలనే దానిపై జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, నేషనల్ జియోఫిజికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, నేషనల్ సెంటర్ ఫర్ సెస్మాలజీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైనింగ్ అండ్ ఫ్యూయల్‌తో పాటు బార్డర్ రోడ్డు ఆర్గనైజేషన్‌తో ఉప కమిటీని వేసి, అధ్యయనం అనంతరం సైట్ స్పెసిఫిక్ రిపోర్టును తయారు చేయాలని కమిటీ సూచించింది. ఈ కమిటీ నివేదిక వచ్చేదాకా తదుపరి సహాయక చర్యల దిశగా ముందుకెళ్లరాదని నిర్ణయించారు. ఈ క్రమంలో ఆర్మీ, జాతీయ విపత్తుల స్పందన సంస్థ(ఎన్‌డీ ఆర్ఎఫ్) బలగాలతో పాటు ర్యాట్ మైనర్లను సహాయక చర్యల నుంచి తప్పించి, వెనక్కి పంపించాలని నిర్ణయించారు. ఎస్‌డీఆర్ఎఫ్, సింగరేణితో పాటు రైల్వేకు చెందిన సిబ్బందితో టన్నెల్ బోరింగ్ మిషన్(టీబీఎం) అవశేషాల తొలగింపు వంటి ప్రక్రియలు చేపట్టనున్నారు. గత ఫిబ్రవరి 22న టన్నెల్‌లో ప్రమాదం చోటుచేసుకుంది. ఇప్పటిదాకా రెండు మృతదేహాలను బయటకు తీశారు. మరో ఆరుగురి ఆచూకి లభించలేదు. ఆ కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని నిర్ణయించారు. సాంకేతిక ఉప కమిటీ నివేదిక చేతికి అందాక ఎస్ఎల్‌బీసీ ఇన్‌లెట్ (దోమలపెంట) నుంచి తదుపరి టన్నెలింగ్ తవ్వకమంతా డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానంలో చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు.

తెలుగుకు ద్రోహం.. 'జయప్రద'ంగా సంస్కృతం!

ప్రభుత్వ ఉత్తర్వులకు భిన్నంగా సొంత నిర్ణయం.. ఇంటర్ బోర్డులో ఓ అధికారి అత్యుత్సాహం

» ఆమె ఉత్తర్వులను ప్రశ్నించని ఉన్నతాధికారులు

» ఏడాదిన్నరగా ఆమెకు రెండు కీలక పదవులు

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌లో ద్వితీయభాషగా తెలుగును ఎత్తివేసి సంస్కృతాన్ని తేవాలన్న ఇంటర్ బోర్డు ఆలోచన వెనక ఓ ఉన్నతాధికారి కీలక పాత్ర పోషిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంస్కృతాన్ని రెండో భాషగా బోధిస్తున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 15 మాత్రమే ఉన్నాయి. వీటి వివరాలు అందించాలని ప్రభుత్వం ఆదేశించగా.. ఆ ఉన్నతాధికారి భిన్నమైన ఆదేశాలు జారీచేశారు. అన్ని ప్రభుత్వ కాలేజీల్లో సంస్కృతాన్ని అమలు చేయాలని, అందుకు కావాల్సిన పోస్టుల వివరాలు తెలపాలంటూ అత్యుత్సాహం ప్రదర్శించారు. వరంగల్ ఆర్జేడీ హోదాలో ఈనెల 8న రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లకు ఆమె పంపిన ఆదేశాలు ఇంటర్‌లో తెలుగుకు గొడ్డలి పెట్టుగా మారనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పదోతరగతి వరకూ.. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్ బోధించే ఇంటర్నేషనల్ స్కూళ్ల సహా అన్ని ప్రైవేటు విద్యాసంస్థల్లోనూ తెలుగును తప్పనిసరిగా అమలు చేయాలని రెండు నెలల క్రితం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీచేసిన సంగతి తెలిసిందే. ఈ ఆదేశాలతో రాష్ట్రంలో తెలుగు భాష వెలుగుతుందని విద్యావేత్తలు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. అంతలోనే.. ఇంటర్లో ద్వితీయ భాషగా ఉన్న తెలుగు స్థానంలో సంస్కృతాన్ని ప్రవేశపెట్టే దిశగా ఈనెల 8న ఇంటర్ బోర్డు విడుదలచేసిన ఆదేశాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. పాఠశాలల్లో తెలుగును బలోపేతం చేస్తున్న సర్కారు.. ఇంటర్లో ఇలాంటి నిర్ణయాన్ని ఎలా తీసుకుంటుందని భాషా ప్రేమికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 436 ప్రభుత్వ జూనియర్ కాలేజీలుండగా.. వాటిలో రెండో భాషగా సంస్కృతాన్ని బోధిస్తున్నది 15 కాలేజీల్లో మాత్రమే. కొన్ని కాలేజీల్లో ఉర్దూ, హిందీలను రెండో భాషగా బోధిస్తుండగా.. 400 కాలేజీల్లో రెండో భాషగా తెలుగును బోధిస్తున్నారు. ఇంటర్‌లో.. సంస్కృతం పేపర్‌లో గరిష్ఠంగా 99 మార్కుల దాకా వేస్తుండటం, తెలుగుకు తక్కువ మార్కులు వస్తుండడంతో చాలా మంది విద్యార్థులు సంస్కృతాన్నే రెండో భాషగా తీసుకుంటున్నారు. ప్రభుత్వ కాలేజీల్లో సంస్కృతాన్ని బోధించేవి తక్కువగా ఉండడంతో ప్రైవేటు కాలేజీల వైపు మొగ్గుచూపుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో.. ప్రభుత్వ కాలేజీల్లో తెలుగుతోపాటు సంస్కృతాన్ని కూడా ప్రవేశపెడితే ద్వితీయభాషగా తెలుగు తీసుకునే వారే ఉండరనే ఆందోళన వ్యక్తమవుతోంది. అందుకే సర్కారు వైఖరిపై విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై 'ఆంధ్రజ్యోతి' పరిశోధించగా.. ఇంటర్ బోర్డులో రెండు కీలక పదవుల్లో ఉన్న ఓ ఉన్నతాధికారి అత్యుత్సాహమే దీనికి కారణమని తెలిసింది.

మెమోల్లో లేకున్నా..

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సంస్కృతాన్ని ప్రవేశపెట్టేందుకు, కావాల్సిన సంస్కృత జూనియర్ లెక్చరర్ల పోస్టుల భర్తీకి వివరాలు పంపాలని ఇంటర్ బోర్డు వరంగల్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ హోదాలో జయప్రద బాయి ఈనెల 8న ఆదేశాలు జారీచేశారు. దీనికి రెఫరెన్సుగా రెండు పాత మెమోలను ప్రస్తావించారు. ఒకటి నిరుడు ఆగస్టు 27న ప్రభుత్వం విడుదలచేసిన మెమో, మరొకటి ఈ ఏడాది మార్చి 29న ఇంటర్ విద్య సంచాలకులు జారీచేసిన మెమో. ఈ రెండు మెమోలనూ పరిశీలించగా.. కొత్తగా అన్ని ప్రభుత్వ కాలేజీల్లో సంస్కృతాన్ని అమలుచేయాలనిగానీ, సంస్కృత జేఎల్ పోస్టులు సృషించాలనిగానీ లేదు. అయినా, వరంగల్ ఆర్జేడీ జయప్రద బాయి ఆ తరహా ఉత్తర్వులు విడుదల చేశారు. ఆ ఉత్తర్వుల ఆధారంగానే.. అన్ని కాలేజీల్లో సంస్కృతాన్ని ప్రవేశపెట్టేందుకు ఇంటర్ బోర్డు ఏర్పాట్లు చేస్తోంది. ఆ ఉత్తర్వులను ఇంటర్ విద్య సంచాలకులుగానీ, విద్యాశాఖ కార్యదర్శి గానీ ప్రశ్నించలేదు. ఉత్తర్వుల ఉద్దేశంపై ఇంతవరకూ వివరణ కోరలేదు. చాలా కాలంగా వరంగల్ ఆర్జేడీగా కొనసాగుతున్న జయప్రదబాయికి 2023 అక్టోబరులో పరీక్షల నియంత్రణాధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆమె ఏడాదిన్నరకు పైగా హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డు ప్రధాన కార్యాలయంలోనే ఉంటూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 33 జిల్లాల ఇంటర్ ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీలను పర్యవేక్షించాల్సిన కీలక బాధ్యత వరంగల్ ఆర్జేడీపై ఉంటుంది. మరోవైపు పరీక్షలకు సంబంధించిన అత్యంత కీలక పదవిని కూడా ప్రధాన కార్యాలయంలో ఆమెను నిర్వహిస్తున్నారు. సమర్థులైన, సీనియర్ అధికారులున్నప్పటికీ ఆమెను రెండు కీలక పదవుల్లో నియమించడాన్ని బోర్డులోని ఇతర అధికారులు వ్యతిరేకిస్తున్నారు.

తెలుగుకు ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయం అధికారులు స్వతంత్రంగానే తీసుకున్నారా? లేక ప్రభుత్వ విధానమా? అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యావ్యవస్థలో కీలక నిర్ణయాలు తీసుకునేముందు సమగ్ర అధ్యయనం, సంబంధిత నిపుణులతో సంప్రదింపులు, చర్చలు జరపాలని పేర్కొన్నారు. కానీ, నిపుణులతో కమిటీలు వేయకుండా, ఎలాంటి అధ్యయనం చేయకుండా ఇంటర్ బోర్డు ఏకపక్షంగా నిర్ణయం ఎలా తీసుకుంటుందని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు సాగి కమలాకర శర్మ, సి.కాశీం, ఏలె విజయలక్ష్మి, ఎస్.రఘుతోపాటు వివిధ విశ్వవిద్యాలయాల తెలుగు ఆచార్యులు ప్రశ్నించారు. ఇంటర్ బోర్డు అధికారుల ఆదేశాలు చూస్తుంటే తెలంగాణలో తెలుగు లేకుండా చేయాలని కంకణం కట్టుకున్నట్లుగా ఉందని విమర్శించారు. పదో తరగతి తర్వాత విద్యా జీవితానికి అత్యంత కీలకమైన ఇంటర్‌లో మాతృభాష అత్యంత కీలకమన్నారు. అది లేకుండా కేవలం మార్కుల కోసం సంస్కృతాన్ని ప్రవేశపెడితే విద్యార్థులు మాతృభాషకు పూర్తిగా దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. పదో తరగతి వరకు ప్రస్తావనే లేని సంస్కృతాన్ని ఇంటర్లో అన్ని కార్పొరేట్ కాలేజీల్లో ప్రవేశపెట్టడం ప్రభుత్వం చేసిన తప్పని అభిప్రాయపడ్డారు. విద్యార్థి జీవితానికి ఏ మాత్రం ఉపయోగపడని సంస్కృతాన్ని ప్రోత్సహించడం వెనక ఆంతర్యం ఏమిటో స్పష్టం చేయాలని నిలదీశారు. ఇంటర్లో ద్వితీయ భాష విషయంలో ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని, బోర్డు నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. ఇంటర్‌లో ద్వితీయ భాషగా తెలుగును మరింత సమర్థంగా అమలు చేసేందుకు, విద్యార్థులు తెలుగునే తీసుకునేలా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తెలుగు ఆచార్యులు, విద్యావేత్తలతో ఉన్నతస్థాయి కమిటీని వేయాలని విజ్ఞప్తి చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.